సూర్య 19 వ వసంతంలోకి ...
www.suryaa.com
visit us @ https://www.suryaepaper.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శుక్రవారం | 13 మార్చి 2026 | హైదరాబాద్
సంపుటి 19 | సంచిక 143
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, ఫాల్గుణ మాసం బహుళ పక్షం, దశమి తె.5.37, పూర్వాషాఢ రా.1.12, వర్జ్యం ఉ.9.28 నుంచి 11.12 వరకు
రాహుకాలం ఉ.10.30 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం ఉ.8.40 నుంచి 9.27 వరకు తిరిగి మ.12.34 నుంచి 1.21 వరకు




6 లో

## లోక్‌సభను తాకిన గ్యాస్ సెగలు

- రష్యా నుంచిచమురుకు అమెరికా ఆమోదమేంటని నిలదీసిన విపక్షం
- దేశ సార్వభౌధికారాన్ని అగ్రరాజ్యం చేతిలో పెడతారా?
- ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను ప్రస్తావించిన రాహుల్ గాంధీ
- రాహుల్ వ్యాఖ్యలు సభా మర్యాదలకు విరుద్ధంగా ఉన్నాయన్న కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పురి


## ఇరాన్‌లో ప్రభుత్వం కూలిపోయే ముప్పు లేదు



6 లో

- అమెరికా నిఘా సంచలన నివేదిక
- సుప్రీం లీడర్ దాడుల్లో మరణించడంతో ప్రభుత్వం కూలిపోతుందన్న అమెరికా
- ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరానియన్లకు పిలుపు
- మత నాయకత్వ వ్యవస్థ బలంగా ఉందన్న గూఢచారి నివేదిక అంచనాలు తల్లకిందులు కావటంతో ట్రంప్ మల్లగుల్లాలు

### నష్టాల్లో స్టాక్
## మార్కెట్‌లు




- అంతర్జాతీయ చమురు ధరల ఒడిదొడుకులతో మార్కెట్లకు భారీగా నష్టాలు
- సెన్సెక్స్ 829 పాయింట్లు, నిఫ్టీ 227 పాయింట్లు నష్టం
- తీవ్రంగా నష్టపోయిన ఆటో, ఎఫ్ఎంసీజీ, రియాల్టీ రంగాల షేర్లు
- ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చలు జరిపిన భారత విదేశాంగ మంత్రి

వివరాలు-5లో

### గ్యాస్ సంక్షోభం మధ్య
# పుకార్లు హల్‌చల్

- అప్రమత్తంగా ఉండాలని దేశ ప్రజలకు ప్రధాని మోడీ సూచన..!
- పరిస్థితిని భయాందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై నిఘా
- ప్రస్తుత స్థితి ప్రజల ముందు ఉంచాలని ప్రధాని మోడీ మంత్రులకు ఆదేశాలు

ఇరాన్‌లో జరుగుతున్న యుద్ధం మధ్య, దేశంలోని చాలా ప్రాంతాలలో గ్యాస్ కొరత పెరుగుతోంది. సిలిండర్ల కోసం పొడవైన లైన్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితిని భయాందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై నిఘా ఉంచాలని ప్రధాని మోదీ తన మంత్రులను ఆదేశించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం సన్నాహాలు బలంగా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



6 లో

### ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ
# రింగు రోడ్లు

- భారీ వాహనాలను అనుమతించకూడదు
- ప్రణాళికలను రూపొందించాలి
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



వివరాలు-2లో

ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడటంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

# గ్యాస్ కొరత వాస్తవమే

- కమర్షియల్ సిలిండర్ల కొరత ఉంది
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



3 లో

తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు.

# స్పీకర్ నిర్ణయమే ఫైనల్

- బీఆర్ఎస్ పార్టీకి సుప్రీం కోర్టులో షాక్...
- పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పు



ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీకి సుప్రీం కోర్టులో షాక్ తగిలింది. దీంట్లో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం విచారణను ముగిస్తున్నట్టుగా పేర్కొంది. క్రితంసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీ ఫాంపై నెగ్గిన పదిమంది ఎమ్మెల్యేలు ఆ తరువాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారని పేర్కొంటూ వారిపై అనర్హత వేటు వేయాలని మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ కు కూడా ఫిర్యాదులు చేశారు. కాగా, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు ఆదేశాలు జారీ చేసింది.

## ఉపాధి అవకాశాలు, సాంకేతిక అభివృద్ధికి కీలకం




2 లో

- విద్యాసంస్థలు - పరిశ్రమల అనుసంధానం అవసరం
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య


విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్యసభలో కృష్ణయ్య ప్రసంగించారు.

## అంతా ఇంతే!




ఓటుపై దీని ప్రభావం ఉంటుందేమో సార్ !

### భారత జెండా ఉన్న నౌకలకు
## ఇరాన్ పర్మిషన్



6 లో

### హార్మ్యూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతి

ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న అత్యంత క్లిష్టమైన యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో, భారత దౌత్య యంత్రాంగం అనుసరిస్తున్న వ్యూహాలు దేశానికి భారీ ఊరటను ఇస్తున్నాయి. భారత ఫ్లాగ్ తో ఉన్న నౌకలకు హార్మ్యూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చింది. మిడిల్ ఈస్ట్ లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, భారత విదేశాంగ మంత్రి జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య నిరంతరం చర్చలు సాగుతున్నాయి.

# బడ్జెట్‌పై కసరత్తు ముమ్మరం

- అత్యాధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలనపై చర్చ
- ప్రజా భద్రతకు సంబంధించి కీలక అంశాలపై ఆరా
- హోం, ఐటీ శాఖలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష



అసెంబ్లీ సమావేశాలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్‌పై కసరత్తును ముమ్మరం చేస్తోంది. శాఖల వారిగా ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యాధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన మరియు ప్రజా భద్రతకు సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, పోలీసు యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిగినట్లు భట్టి వెల్లడించారు.

వివరాలు-3లో

### వంట గ్యాస్‌పై
## మరో పిడుగు



6 లో

- బుకింగ్ గడువు రోజులు మరింత పెంపు
- కేంద్రం మరో సంచలన నిర్ణయం
- సిలండర్ కావాలంటే 15 రోజులు ఆగాల్సిందే

మిడిల్ ఈస్ట్ లో యుద్ధం ప్రభావం భారత్‌పై పడుతుంది. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ లభ్యతపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. వంట గ్యాస్ ధరలు పెరుగుతుండడంతో ప్రజలు భారీగా బుకింగ్ చేసుకుంటున్నారు. దీంతో కేంద్ర ఇప్పటికే గ్యాస్ బుకింగ్ 25 గడువు విధించింది. తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది.

# ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ రింగు రోడ్లు




● భారీ వాహనాలను అనుమతించకూడదు ● ప్రణాళికలను రూపొందించాలి ● సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడటంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా జిల్లా కేంద్రాల నుంచి రింగు రోడ్లకు అనుసంధానించేలా రేడియల్ రోడ్లు నిర్మించాలని సీఎం తెలిపారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నుంచి నాగార్జున సాగర్ చేరేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

ఇక ఎలక్ట్రిక్ వాహనాలపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి ప్రభుత్వంలోని ఏ శాఖైనా తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ వాహనాలనే కొనుగోలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ప్రభుత్వ శాఖల పరిధిలో అద్దెలకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని సీఎం తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ పద్ధతులకు స్వస్తి చెప్పాలని.. మొత్తం ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగించాలని సీఎం ఆదేశించారు. ఆర్‌టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని... ఇందుకు షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించాలని సీఎం సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్ కు స్థలం కేటాయిస్తామని.. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ నిర్ణయమే ఫైనల్




● బీఆర్‌ఎస్ పార్టీకి సుప్రీం కోర్టులో షాక్... ● పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో బీఆర్‌ఎస్ పార్టీకి సుప్రీం కోర్టులో షాక్ తగిలింది. దీంట్లో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం విచారణను ముగిస్తున్నట్టుగా పేర్కొంది. క్రితంసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ బీ ఫాంపై నెగ్గిన పదిమంది ఎమ్మెల్యేలు ఆ తరువాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారని పేర్కొంటూ వారిపై అనర్హత వేటు వేయాలని మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ కు కూడా ఫిర్యాదులు చేశారు. కాగా, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు ఆదేశాలు జారీ చేసింది. పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఈ క్రమంలో విచారణ ముగించిన స్పీకర్ మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. వాళ్లు పార్టీ మారారనటానికి ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. కాగా, బీఆర్‌ఎస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ లతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా స్పీకర్ తరపున వాదనలు వినిపించిన అభిషేక్ సింఘ్వీ ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై ఇప్పటికే విచారణ ముగిసినట్టు చెప్పారు. ఇక విచారణ జరపాల్సిన అవసరం లేదు. దీంట్లో వెల్లడైన వివరాల ఆధారంగా స్పీకర్ తగు నిర్ణయం కూడా తీసుకున్నారని చెప్పారు. పిటిషన్లను స్పీకర్ కార్యాలయం పరిష్కరించిందన్నారు. ఈ వాదనలతో సుప్రీం కోర్టు ఏకీభవించిందవి. స్పీకర్ ఈ అంశంలో ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఇక విచారణ జరపాల్సిన అవసరం లేదని అభిప్రాయ పడింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేల ఫిరాయింపులకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై విచారణ ముగిసినట్టేనని పేర్కొంది. స్పీకర్ తన తీర్పును రెండు రోజుల్లో అధికారికంగా వెలువరించి ప్రతులను ఫిర్యాదుదారులకు అంద చేయాలని సూచించింది.

## విద్యాసంస్థలు - పరిశ్రమలు అనుసంధానం అవసరం..

# ఉపాధి అవకాశాలు, సాంకేతిక అభివృద్ధికి కీలకం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్యసభలో కృష్ణయ్య ప్రసంగించారు. ప్రస్తుతం విద్యా సంస్థలు మరియు పరిశ్రమలు తమ తమ స్వంత లక్ష్యాలు, ప్రయోజనాల దిశగా వేర్వేరు మార్గాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ, పరస్పర సహకారం ద్వారా ఇరు వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని వారు పేర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు కూడా చాలా కాలం క్రితమే పరిశ్రమలు--విద్యాసంస్థల సహకారం అవసరాన్ని గుర్తించాయి. ముఖ్యంగా విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర నిధులు తగ్గుతున్న ఈ కాలంలో, పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా వనరులను సమర్థంగా వినియోగించుకోవడం మరియు స్వావలంబన సాధించడం అత్యంత అవసరమైంది. అయితే పరిశ్రమల లాభాపేక్ష, గోప్యత వంటి అంశాలు కొన్నిసార్లు ఈ సహకారానికి అడ్డంకిగా మారుతున్నాయి. పరిశ్రమలు తమ ప్రాజెక్టులకు సంబంధించిన పరిశోధనలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా విశ్వవిద్యాలయాల పరిశోధన సామర్థ్యాలను పెంచవచ్చు. విశ్వవిద్యాలయాల వద్ద ఉన్న మానవ వనరులు మరియు పరిశ్రమల ఆర్థిక మద్దతు కలిసి పనిచేస్తే నూతన సాంకేతిక ఆవిష్కరణలకు దారి తీస్తాయి. ఉదాహరణకు, ఏరోస్పేస్ పరిశోధన కోసం కొన్ని అంతర్జాతీయ సంస్థలు విశ్వవిద్యాలయాలకు అందించిన నిధులు విమానయాన సాంకేతిక రంగంలో గణనీయమైన పురోగతికి దోహదపడ్డాయి. అదే సమయంలో విద్యాసంస్థలు కూడా పరిశ్రమలకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను కలిగించే విధంగా పాఠ్యాంశాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా స్థానిక పరిశ్రమల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా కోర్సులు రూపొందిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విశ్వవిద్యాలయాల నుండి పట్టభద్రులయ్యే విద్యార్థుల్లో చాలా మంది పరిశ్రమల వైపు వెళ్లే నేపథ్యంలో పరిశ్రమలకు అనుకూలమైన నైపుణ్యాలు వారికి అందించడం అత్యంత కీలకం. విద్యాసంస్థలు--పరిశ్రమల భాగస్వామ్యం సాంకేతిక అభివృద్ధికి, వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాల కోసం మరియు ఆర్థిక విలువ సృష్టించడానికి గొప్ప అవకాశాలను కల్పిస్తుంది. సరైన విధానాలు, పరస్పర గౌరవంతో ఇరు వర్గాలు కలిసి పనిచేస్తే అసాధారణ ఫలితాలు సాధ్యమవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. పరిశ్రమలు మరియు విద్యాసంస్థల మధ్య పెరుగుతున్న ఈ పరస్పర సహకారం భవిష్యత్ అభివృద్ధి మరియు పురోగతికి కీలకంగా మారనుంది అని కృష్ణయ్య పేర్కొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల పక్షాన అసెంబ్లీలో గళమెత్తుతా



● ఎలక్ట్రిక్ బస్సుల ముసుగులో ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్ర ● కాంగ్రెస్ సర్కార్ జూట మాటలతో ఆర్టీసీని సంస్థను అప్పుల కుప్ప చేసింది ● మహాలక్ష్మి పథకం కింద బాకీ పడ్డ 2,804 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ ● తన్నీరు హరీష్ రావు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాష్ట్ర ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తానని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పష్టం చేశారు. మంగళవారం టీజీఎస్‌ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆయనను కలిసి, ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల పక్షాన నిలబడి, వారి సమస్యలను సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చిన హరీశ్ రావు గారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి, కార్మికులకు చేస్తున్న అన్యాయంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఒకవైపు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను కాపాడుకోవాలని కార్మికులు పోరాడుతుంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని హరీశ్ రావు గారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కార్పొరేట్ శక్తులకు అప్పగించి, వారికే సబ్సిడీలు ఇస్తూ ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ కంపెనీలతో ఏకంగా 2000 బస్సుల సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, విద్యుత్ బస్సుల ముసుగులో సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ కంకణం కట్టుకుందని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే సబ్సిడీలను నేరుగా ఆర్టీసీకే ఇప్పించి, సంస్థ సొంతంగా బస్సులు కొనుగోలు చేసుకునేలా పథకంలో సవరణలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జీరో టికెట్ అమలు కోసం ప్రతినెలా 350 కోట్లు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇపుడు అరకొర నిధులు చెల్లించి చేతులు దులుపుకోవడం శోచనీయం. గత రెండేళ్లుగా ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిల భారాన్ని ఆర్టీసీపైనే మోపడం వల్ల సంస్థ ఆర్థికంగా కుదేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇప్పటికీ రెండు పీఆర్సీలు పెండింగ్లో ఉండగా, 2025 పీఆర్సీ సైతం అమలుకు నోచుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆయన గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హరీశ్ రావు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఆర్టీసీపై సవతి తల్లి ప్రేమను చూపించకుండా. తక్షణమే 2,804 కోట్ల బకాయిలను విడుదల చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలి. కార్మికుల సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బలంగా బీఆర్‌ఎస్ పక్షాన వినిపిస్తాం.. ప్రభుత్వం మెడలు వంచైనా పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేలా పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

# మహిళా బిల్లులో అన్ని వర్గాల మహిళలకు ప్రాతినిధ్యం దక్కాలి




● బీసీ మహిళలు సాధికారత దక్కేవరకు పోరాడాలి ● మహిళా బిల్లులో బీసీ సబ్ కోట కల్పించకపోతే పార్లమెంటును ముట్టడిస్తాం ● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: చట్ట సభలలో అన్ని వర్గాల మహిళలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పించే వరకు పోరాడి సాధించాలని, అప్పుడే మహిళా సాధికారత లభిస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ మహిళా సంక్షేమ సంఘం, బీసీ ఉద్యోగుల మహిళా సంఘం సయుశీక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్ లో మహిళా దినోత్సవాన్ని బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి, బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టసభలలో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల మహిళలకు అందులో సబ్ కోట కల్పించకపోవడం చాలా అన్యాయం అన్నారు మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట లేకపోవడం మూలంగా మహిళా బిల్లు అమలు జరిగిన అగ్రకుల నాయకులు కుర్చీలలో వారి కుటుంబ సభ్యులు మాత్రమే మహిళా బిల్లు పేరుతో చట్టసభలోకి అడుగు పెడతారన్నారు, మహిళా బిల్లు బిసి, ఎస్సీ ఎస్టీ మైనార్టీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం సబ్ కోట కల్పించినప్పుడే మహిళా బిల్లుకు సంపూర్ణ సాధికారత లభిస్తుందని ఆయన వెల్లడించారు. బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ లు మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతూనే మీకు ఒక వైపు పోటీ ప్రపంచం పురుషులతో సమానంగా ఎదగడానికి సమాజంలో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలని, ఆత్మవిశ్వాసం, రాజకీయ లక్ష్యంతో ముందుకు సాగాలని వారు అన్నారు. ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాలలో మహిళా బిల్లుపై ప్రత్యేకంగా చర్చించి మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోట కల్పించాలని ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు లేకుంటే పార్లమెంట్ ముట్టడి చేపడతామని వారు హెచ్చరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 40 మంది మహిళ నేతలకు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్ డాక్టర్ రమణ నాయక్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, బీసీ మహిళ నేతలు రాధా రాణి, తారకేశ్వరి, జ్యోతి, సమతా యాదవ్, సంధ్యారాణి, సుజాత, ఉమాదేవి, మీనా, సరిత, విజయ లక్ష్మి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.


# గర్భిణీ స్త్రీలకు ప్రాధాన్యత ఇవ్వాలి



● రైల్వే టికెట్ నిర్ధారణ విషయంలో ప్రత్యేక కోటా కల్పించాలి ● కేంద్ర రైల్వే శాఖా మంత్రికి కమిటీ సభ్యులు కాలపురెడ్డి సాయిబాబా విజ్ఞప్తి

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః రైల్వే టికెట్ నిర్ధారణ (కన్ఫర్మేషన్) విషయంలో గర్భిణీ స్త్రీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక కోటా కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే విభాగీయ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సభ్యులు కాలపురెడ్డి సాయిబాబా కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. సవినయంగా మీ దృష్టికి తీసుకొని వస్తున్న విషయం ఏమనగా తరుచుగా దక్షిణ మధ్య రైల్వే జోన్ నందు రోజు వారిగా లక్షలాది మంది ప్రయాణికులు వాళ్ళ అత్యవసరాల కోసం అత్యవసరముగా ప్రయాణిస్తున్నారు. అందులో వృద్ధులకు, వైకల్యం ఉన్న వ్యక్తులకు, మహిళలకు, ఉద్యోగుల కార్డు ఉన్న వారి కోసం మరియు ప్రీమియం తత్కాల్ అని ప్రత్యేక కోటా ఏర్పాటు చేయడం జరిగింది. కాని గర్భిణీ స్త్రీలు రిజర్వేషన్ టికెట్ నిర్ధారణ (కన్ఫర్మేషన్) కాకపోవడం వల్ల జనరల్ బోగిలలో ప్రయాణించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. కావున రైల్వే టికెట్ బుక్ చేసినప్పుడు వారి మెడికల్ సర్టిఫికేట్ ను గమనించి వారికి కుడా ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలనీ మరియు వారి టికెట్ కన్ఫర్మేషన్ అయ్యేలాగా చేసి వారి సమస్యలను కుడా దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని కోరి ప్రార్థిస్తున్నాను. ప్రయాణికుల సమస్యలను మీ దృష్టికి తీసుకొని రావడానికి మీ యొక్క అముఖ్యమైన సమయం కేటాయించావలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాను.

ఈ క్రింది ప్రయాణికుల వివిధ సమస్యలను మీ దృష్టికి తీసుకొని వస్తున్నాను. క్యాటరింగ్ ఆహార నాణ్యత విక్రేతల నుండి నాణ్యత లేకపోవడం. అధిక ధరలు స్టేషన్లలో ఆహారం అందుబాటులో లేకపోవడం. సాంకేతిక, మౌలిక సదుపాయాల సమస్యలు ఫ్యాన్లు, లైట్లు లేదా ఛార్జింగ్ పాయింట్లు పనిచేయకపోవడం వాష్‌రూమ్‌లలో నీటి కొరత సరైన సమాచారం లేకపోవడంతో ప్లాట్‌ఫామ్‌లలో ఆకస్మిక మార్పులు -- గందరగోళం. రైళ్ల ఆలస్యం లేదా రూట్ మార్పుల గురించి సరైన ప్రకటనలు లేవు. చివరి నిమిషంలో రైలు రద్దు చేయడం వాళ్ళ ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. టిక్కెట్ల కొనుగోలు సమస్యలు ధృవీకరించబడిన టిక్కెట్లను పొందడంలో ఇబ్బంది. ఏజెంట్‌లు ద్వారా అధిక ఛార్జీలు - ఆ సమయానికి తత్కాల్ టికెట్ అందుబాటులో లేకపోవడం. మురికి కోచ్‌లు, టాయిలెట్‌లు మరియు ప్లాట్‌ఫారమ్‌లు అపరిశుభ్రమైన ఆహారం మరియు నీటి నాణ్యత లేకుండా పోతుంది. జనరల్ కంపార్ట్‌మెంట్‌లలో రద్దీగా ఉండడం వల్ల రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లలో ప్రయాణించడం సమస్యగా మారుతుంది. సామాను, వ్యక్తిగత వస్తువుల దొంగతనం. భద్రతా సమస్యలు, సహ ప్రయాణీకులు లేదా అనధికార విక్రేతల వేధింపులు లేదా దుర్వినియోగం. దూర ప్రాంతాలలో (రైల్వే రక్షణ దళం) ఉనికి లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.




# కవిత ఇంటికి సీబీఐ అధికారులు!

● ఇటీవల ఢిల్లీ లిక్కర్ స్కామ్‌పై హైకోర్టులో సీబీఐ పిటిషన్ ● హైకోర్టు జారీ చేసిన నోటీసులు ఇచ్చామన్న అధికారులు

హైదరాబాద్ః హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇంటికి గురు వారం సీబీఐ అధికారులు వచ్చారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కు సంబంధించి హైకోర్టులో సీబీఐ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టు జారీ చేసిన నోటీసులు ఇచ్చేందుకు కవిత ఇంటికి అధికారులు వచ్చారు. ఇటీవల ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు కవితతో పాటు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితరులపై ఉన్న అభియోగాలను డిస్మిస్ చేసిన విషయం తెలిసిందే. దీంతో సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. రౌస్ అవెన్యూ కోర్టు తాము చూపిన ఆధారాలను పట్టించుకోలేదని పిటిషన్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో కవితతో పాటు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఇంటికి కూడా నేడు సీబీఐ అధికారులు వెళ్లారు. శ్రీనివాసుల రెడ్డి కుమారుడికి సైతం సీబీఐ నోటీసులు అందించింది.

సీబీఐ అధికారులు వచ్చిన సమయంలో కవిత ఇంట్లో లేకపోవడంతో ఆమె భర్త అనిల్ నోటీసులు తీసుకున్నారు. అయితే.. ఈ నెల 16న కోర్టుకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పు దేశ వ్యాప్తంగా చర్చ నియాంశమైంది. ఇది రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని మరోసారి తేలిందని కవిత, కేజ్రీవాల్ అన్నారు. తీర్పు వచ్చిన తర్వాత కేజ్రీవాల్ కంటతడి పెట్టారు. తాను అవినీతి పరుడని కట్టు కథలు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను నిజాయితీ పరుడతి కోర్టు తీర్పుతో తేలిందన్నారు. ఢిల్లీలో ఇప్పుడు ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీకి పది కన్నా ఎక్కువ సీట్లు వస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు.

## పల్లెల్లో పార్టీలకతీతంగా మానవ సంబంధాలు ఉంటాయి

కొండ పోచమ్మను దర్శించుకున్న బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు కొండ పోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెటూర్లలో మానవ సంబంధాలు పార్టీలకతీతంగా ఉంటాయని అన్నారు. తనకు పార్టీ అధికార ప్రతినిధి పదవి వచ్చిన సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన మిత్రులు కూడా తన వద్దకు వచ్చి సన్మానం చేయడం తనకు గర్వంగా ఉందన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన సమయంలో జర్నలిస్టు మిత్రులతో తనకు మంచి అనుబంధం ఏర్పడిందని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి బీజేపీ అధికార ప్రతినిధిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు యన్. రామచంద్ర రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మేడ్చల్--మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, తీగుల్ నర్సాపూర్ సర్పంచ్ స్వప్న శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గర్నెపల్లి రమేష్, ఉపసర్పంచ్ స్వామి, దేవాలయ అర్చకులు, జిల్లా అధ్యక్షుడు మరాటి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పుంటి శీను, రాష్ట్ర నాయకులు సిద్ధల రవి, ఉపాధ్యక్షులు బాలు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎల్లంరాజు, బైరి ప్రభాకర్ పాల్గొన్నారు.

## కేంద్ర మాజీ మంత్రి కావూరికి నివాళులర్పించిన తెలంగాణ, ఆంధ్ర పదేశ్ బీజేపీ అధ్యక్షులు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మరియు భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం మాజీ కేంద్రమంత్రి కావూరి సాంబశివరావు నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కఠిన సమయంలో వారికి మనోధైర్యం, శక్తిని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు మరణం పట్ల బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున, అలాగే వ్యక్తిగతంగా తన తరఫున ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన కావూరి సాంబశివరావు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో విశేషమైన సేవలు అందించారని అన్నారు. ఐదుసార్లు ఎంపీగా ఎన్నికై, కేంద్ర మంత్రిగా కూడా దేశానికి సేవలందించారని గుర్తు చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 1984లోనే స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కార్యక్రమాలను ప్రారంభించారని, అవి తర్వాత కాలంలో అనేక ప్రభుత్వాలకు మార్గదర్శకంగా మారాయని తెలిపారు.

ఒక ప్రజాప్రతినిధిగా అనేక సేవలు చేసిన తర్వాత ఆయన భారతీయ జనతా పార్టీలో చేరారని పేర్కొన్నారు. ఆయన మరణం ప్రజా జీవితానికి తీరని లోటని పేర్కొంటూ మరోసారి బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# పనుల్లో వేగం పెంచాం

● 5,39,841 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం ● వంద శాతం ఇళ్ల నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తి : అజయ్ జైన్ ప్రెజెంటేషన్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిది : రెండవ రోజు జాల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ప్రెజెంటేషన్ ఇస్తూ.. పీఎంఏవై తదితర పథకాల కింద 2015-16 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 17,94,996 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి పనుల్లో వేగం పెంచామని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఏకంగా 5,39,841 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. 2024 జూన్ 1 నుండి ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణం కోసం ఏకంగా రూ. 19,512.28 కోట్లు ఖర్చు చేశామని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మరో 5,27,479 ఇళ్లు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న ఉగాది నాటికి పెట్టుకున్న స్పష్టమైన లక్ష్యాలను వివరించారు. వంద శాతం ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. ఇందులో భాగంగా మార్చి 2026 నాటికి 2.50 లక్షల ఇళ్లు, జూన్ నాటికి 2.70 లక్షల ఇళ్లు, సెప్టెంబర్ నాటికి మరో 1.62 లక్షల ఇళ్లను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. చిత్తూరు, అనకాపల్లి, నెల్లూరు, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాలు మరింత దృష్టి సారించాలని సూచించారు.




# దేశంలో హెల్త్‌కేర్ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి



## ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మెడికవర్ ఆసుపత్రి ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: హైదరాబాద్ దేశంలో ప్రముఖ హెల్త్‌కేర్ కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో నూతనంగా ప్రారంభించిన మెడికవర్ ఆసుపత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఆసుపత్రుల స్థాపన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ ప్రారంభంతో భారత్‌లో మెడికవర్ ఆసుపత్రుల సంఖ్య 25కు చేరింది. ఈ నూతన ఆసుపత్రి దేశంలోనే అత్యంత ఎత్తైన ఆసుపత్రి భవనాలలో ఒకటిగా నిర్మించబడింది. అత్యాధునిక సదుపాయాలు, ఆధునిక వైద్య సాంకేతికతతో రూపొందించిన ఈ ఆసుపత్రిలో 550 పడకల సామర్థ్యం ఉంది. పలు ప్రత్యేక వైద్య విభాగాలలో సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఇది సిద్ధంగా ఉంది. ఈ ఆసుపత్రిలో ముఖ్యంగా 5 సెకన్లలో గుండె స్కాన్ పూర్తి చేసే అత్యాధునిక హార్ట్ స్కానింగ్ సాంకేతికతను తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ప్రవేశపెట్టారు. అదేవిధంగా 640-స్లైస్ సీటీ స్కాన్ సాంకేతికతను ఏర్పాటు చేసి మరింత స్పష్టమైన చిత్రీకరణతో వేగవంతమైన మరియు ఖచ్చితమైన నిర్ధారణకు అవకాశం కల్పించారు.

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మెడికవర్ ఆసుపత్రుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మెడికవర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జీ. అనిల్ కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ. శరత్ రెడ్డి, పి. హరికృష్ణ, డైరెక్టర్ ఏ .ఆర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఆధునిక వైద్య సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు మరియు సమగ్ర వైద్య విధానాలతో ఈ ఆసుపత్రి రోగులకు వేగవంతమైన సమర్థవంతమైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

## శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న గవర్నర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం కోసం గురువారం ఉదయం యాదగిరిగుట్టకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. గవర్నర్ రాక సందర్భంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా ప్రతాప్ శుక్లా చేత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రతిభను వెలికితీసే నెట్ ఫ్లిక్స్



● హైటెక్‌సిటీలో నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
● టాలెంట్ ఉన్న వాళ్లకు గొప్ప అవకాశాలు దక్కటం ఖాయం ● యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తాయ ● సృజనాత్మకత, సాంకేతికత, ప్రతిభ కలిసే కేంద్రంగా ఎదుగుతోందన్న తెలంగాణ ● ప్రపంచ స్థాయి కథాకథన కేంద్రంగా రాష్ట్రం అభివృద్ధి చేందుతోంది

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : నెట్‌ఫ్లిక్స్ సంస్థను హైదరాబాద్కు ఆహ్వానిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలా మంది ఇలాంటి స్టూడియో కోసం వెయిట్ చేస్తున్నారన్న ఆయన ప్రపంచవ్యాప్తంగా మంచి ప్రతిభను నెటిఫ్లిక్స్ వెలికితీస్తుందని కితాబిచ్చారు. హైదరాబాద్, నెట్‌ఫ్లిక్స్‌కు దగ్గరి పోలికలు ఉన్నాయని చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ టాలెంట్ ఉన్న వాళ్లకు గొప్ప అవకాశాలు కల్పిస్తుందని, ఇప్పుడు గ్లోబల్ సిటీగా హైదరాబాద్ ఎదిగిందని అన్నారు. నెట్ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, తెలుగు అగ్రనటుడు రానాతో కలిసి ప్రారంభించారు. ఇందులో ఐలైన్ స్టూడియోస్ ప్రతినిధులు కూడా ఉన్నారు.

**నంబర్ వన్ బ్రాడ్కాస్టర్గా నెట్ఫ్లిక్స్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని నెట్‌ఫ్లిక్స్ కూడా ఆ దిశగా దృష్టి పెట్టినట్లు ఒకసారి ఆర్టికల్ చదివానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నెట్ఫ్లిక్స్ భవిష్యత్తులో స్పోర్ట్స్ విభాగంలో నంబర్ వన్ బ్రాడ్‌కాస్టర్‌గా ఎదుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసాను ఇచ్చారు. సినిమాలపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందని, మూవీస్ చూడటం చాలా ఇష్టమని అన్నారు. ఫ్యూచర్ సిటిలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయం పెట్టుకుంటామంటే స్థలం కేటాయిస్తామని, నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కంపెనీని కూడా అక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు.

**ఇలాంటి స్టూడియో ఎంతగానో ఉపయోగపడుతుంది :** హైదరాబాద్లో ఐలైన్ స్టూడియోను ప్రారంభించడం సంతోషంగా ఉందని ప్రముఖ నటుడు రానా అన్నారు. ఐలైన్ వంటి సంస్థ హైదరాబాద్కి రావడం ఇక్కడి సినిమాలు, అవి సాధించిన



విజయాల గురించి చెప్పడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. నటులకు, దర్శకులకు, ప్రొడ్యూసర్లకు ఇలాంటి స్టూడియో భవిష్యత్తులో ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.

**బాహుబలి వల్ల వీఎఫ్ఎక్స్ అర్థమైంది :** గతంలో పరిమితమైన ఆర్థిక వనరులతోనే అదీ కూడా చాలా తక్కువ మంది సినిమాలను నిర్మించేవాళ్లని రానా అన్నారు. ఇప్పుడు సినిమాల్లో సరికొత్తగా టెక్నాలజీ వినియోగం పెరగడం, ఐలైన్ వంటి స్టూడియోలు ఇక్కడికి రావడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. బాహుబలి వంటి సినిమాల కారణంగా వీఎఫ్ఎక్స్ ఎలా ఉంటుంది, అద్భుతాలు ఎలా చెయొచ్చో తెలుసుకున్నట్లు చెప్పారు. సహజంగా షూటింగ్ చేయడం యాక్టర్స్ చూస్తుంటారు, కానీ స్టూడియోలో క్రియేట్ చేసిన ప్రపంచంలో కూడా నటనను నేర్చుకుంటారన్నారు.

"హైదరాబాద్ నగరం ముఖ్యంగా సినిమా చిత్ర పరిశ్రమ ఈ స్థాయిలో ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. సినిమా పరిశ్రమను ఆనాడు చెన్నై నుంచి ఇక్కడికి రావడానికి ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు స్టూడియోలు ఏర్పాటు చేయడంకో సాకారమైంది. ప్రపంచ స్థాయి టాలెంట్ను ఇక్కడ ప్రదర్శించడానికి అవకాశం కల్పించారు. ఈరోజు హైదరాబాద్కు నెట్ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లే. ఇది నా కలకు ముందు అడుగుగా భావిస్తున్నాను. ఈ విషయాన్నే నా మిత్రులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు చెప్పి ఉంటా. ఇదేదో కేవలం టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ కాదు. ప్రస్తుతం ఫోకస్ అంతా హాలీవుడ్ పైనే. నెట్ఫ్లిక్స్ హైదరాబాద్లో ఉందని చెప్పడానికి నేను గర్వంగా ఫీలవుతున్నా. నేను అధికారికంగానే చెబుతున్న హాలీవుడ్ ఇక్కడ ఉంది. నా కల త్వరలోనే సాకారం కాబోతుంది. నెట్ఫ్లిక్స్ను, ఐలైన్ సీఈవో జెఫ్ను సంతోషంగా హైదరాబాద్కు ఆహ్వానిస్తున్నా" అని రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంపై తాజాగా ఎక్స్లో పోస్ట్ చేశారు. " తెలంగాణకు నెట్‌ఫ్లిక్స్‌ను స్వాగతిస్తూ, సృజనాత్మకత, ఆవిష్కరణ, ప్రపంచ ఆకర్షించడానికి ఈ సహకారం ఉంటుంది. హైదరాబాద్, నెట్‌ఫ్లిక్స్ కలిసి ప్రపంచంలో ప్రతిభ, అవకాశాలు, సంస్కృతులను అనుసంధానించే ద్వారాలుగా పనిచేస్తాయి. అంతర్జాతీయ వినోదం, సృజనాత్మక పరిణామానికి అర్థవంతంగా దోహదపడతాయి" అని రాసుకొచ్చారు.

## రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే పాలన

### రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి ధీమా



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణలో మరో పదిహేనేళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ప్రజాపాలన-ప్రగతి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోమటిరెడ్డి పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ప్రజా పాలన మొదలైంది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు, ఉచిత కరెంటు బిల్లు, ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ఇస్తున్నాం. సర్పంచులు గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి. రాష్ట్రంలో మరో 15 ఏళు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుటుంబ పాలన తప్ప ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదు. గ్రామ సర్పంచులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతతో పని చేయాలి. ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలి. గ్రామాలలో ఎలాంటి సమస్య ఉన్న సర్పంచులు నేరుగా కలెక్టర్‌ను గానీ నన్ను గానీ కలవచ్చు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుంది' అని మంత్రి కోమటిరెడ్డి భరోసా ఇచ్చారు.

# బడ్జెట్‌పై కసరత్తు ముమ్మరం



● అత్యాధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలనపై చర్చ ● ప్రజా భద్రతకు సంబంధించి కీలక అంశాలపై ఆరా
● హోం, ఐటీ శాఖలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : అసెంబ్లీ సమావేశాలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్‌పై కసరత్తును ముమ్మరం చేస్తోంది. శాఖల వారిగా ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యాధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన మరియు ప్రజా భద్రతకు సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, పోలీసు యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిగినట్లు భట్టి వెల్లడించారు. ఈ సమావేశంలో హోం శాఖ కార్యదర్శి సి.వి. ఆనంద్, ఏడీజీ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ సీపీ సజ్జనార్, సైబరాబాద్ సీపీ రమేష్, మల్కాజ్‌గిరి సీపీ అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ సీపీ సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, నార్కోటిక్ చీఫ్ సందీప్ శాండిల్య తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఐటీ శాఖతోనూ.. హోంశాఖ సమీక్షా అనంతరం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం మరియు శాసనసభ వ్యవహారాల శాఖల ఉన్నతాధికారులతో భట్టి సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఐటీ స్పెషల్ సెక్రటరీ భవేష్ మిశ్రా, టీజీఐఐసి ఎండి శశాంక్, ఇండస్ట్రీస్ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఆధునిక వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నాం
● ప్రభుత్వం ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా ప్రతి రైతుకు ఇస్తాం ● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ సముదాయ ఆవరణలో ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు మినీ ట్రాక్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎస్సీ, ఎస్టీ రైతులకు ఒక్కోటి రూ.4.9 లక్షల విలువ గల 20 హెచ్‌పి కెపాసిటీ మినీ ట్రాక్టర్లను 60 శాతం సబ్సిడీతో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయం, ఉద్యాన రంగాల అభివృద్ధికి యాంత్రీకరణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ఆధునిక పద్ధతులు, యంత్రాలను వినియోగించి సాగు ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని, రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూముందుంటుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు, డీఆర్‌డీఓ జ్యోతి తదితర జిల్లా అధికారులు, సంబంధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరత వాస్తవమే



● కమర్షియల్ సిలిండర్ల కొరత ఉంది ● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణ బ్యూరోప్రతినిధి: తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. మరో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

## వచ్చే నెలలోనే కొత్త ఇళ్ల మంజూరు

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచేసేవారికి ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. ప్రభుత్వం నుంచి కొత్త ఇళ్ల మంజూరుపై కీలక ప్రకటన వచ్చింది. చాలామంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు కేటాయిస్తుందా అని నిరీక్షిస్తున్నారు. అయితే ఎట్టకేలకు ప్రభుత్వం పంపిణీకి సిద్ధమైంది. ఇందిరమ్మ ఇళ్లపై తెలంగాణ సర్కార్ భారీ శుభవార్త అందించింది. రాష్ట్రంలో లక్షలాది మంది కొత్త ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. ఎప్పుడెప్పుడు మంజూరు అవుతాయా అని గత కొద్ది నెలలుగా ఎదురుచూస్తున్నారు. తొలి జాబితాలో 3.50 లక్షల మందికి ఇళ్లను పంపిణీ చేయగా.. రెండో విడతలో మరికొంతమంది అర్హులకు ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధమవుతోంది. రెండో జాబితాపై అధికారులు కసరత్తు పూర్తి చేయగా.. విడుదల చేసేందుకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసింది.

## కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల గ్యాస్ కొరత

### మంత్రి పొన్నం ప్రభాకర్




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా, భారతదేశానికి గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వంటగ్యాస్, కమర్షియల్ సిలిండర్ల కొరత తీవ్రమైంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఈ సంక్షోభం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతుండగా, సామాన్యులు గ్యాస్ బుకింగ్స్, డెలివరీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో వంట కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకుండినట్లు వ్యవహరిస్తుంది. రాష్ట్రం నుండి 8 మంది ఎంపీలు ఉన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు రాష్ట్రానికి సరిపడ గ్యాస్ తీసుకురాలేకపోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

ఇలాంటి ఇబ్బందులు ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించాలి. గతంలో ఉక్రెయిన్ - రష్యా యుద్ధాన్ని ఆపమని చెప్పిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పుడెందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. గ్యాస్ ఇప్పటికిప్పుడు కొరత లేకున్న వంట గ్యాస్ కి సంబంధించి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ విషయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకుంటామని కేంద్ర ప్రభుత్వం నుండి నిర్దిష్ట ప్రకటన ఎందుకు రావడం లేదు. గ్యాస్ కొరత లేనప్పుడు గ్యాస్ ధరలు ఎందుకు పెంచారో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు సమాధానాలు చెప్పడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. గ్యాస్ తో పాటు భవిష్యత్తులో ఎరువుల కొరత సంభవించే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగాలి గ్యాస్ కొరత నివారించాలి. ఎరువుల కొరత రాకుండా చూసుకోవాలి. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్యాస్ సరఫరా పెంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే కేంద్రం రాష్ట్రాల అవసరాలను పరిగణలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాల వల్ల రవాణా రంగం, చిన్న వ్యాపారాలు మరియు గృహ వినియోగదారులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన గ్యాస్ సరఫరా పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మరోసారి డిమాండ్ చేశారు. రాష్ట్రాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్యాస్ పంపిణీపై స్పష్టమైన విధానాలు తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలను కాపాడటం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం సహకరిస్తే సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# రేపటి నుంచే పదో తరగతి పరీక్షలు

● పరీక్షకు పరీక్షకు మధ్య భారీ గ్యాప్ ● పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అలర్ట్ ● అన్ని జిల్లాల డీఈఓలకు ఆదేశాలు జారీ

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుండి ప్రారంభం అవుతున్నాయి. పరీక్ష పరీక్షకు మధ్యన భారీ విరామం ఇవ్వడం గమనార్హం. మార్చి 14వ తేదీ నుంచి ప్రారంభమై ఏప్రిల్ 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షలు (ఫిబ్రవరి 25 నుంచి మార్చి 13 వరకు) ముగిసిన వెంటనే టెన్త్ పరీక్షలు మొదలవుతున్నాయి. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌లో విద్యాశాఖ తీసుకున్న అత్యంత ముఖ్యమైన నిర్ణయం ప్రతి పరీక్షకు మధ్య గ్యాప్ ఇవ్వడం కీలకంగా ఉంది. పండుగల సమయాలు, సెలవు దినాలు ఈ పరీక్షల మధ్య రావడం వలన విద్యార్థులకు నాలుగు రోజుల వరకు గ్యాప్ లభించింది. సాధారణంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతారు. ఈ సుదీర్ఘ విరామం కారణంగా విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఒక్కో సబ్జెక్టుపై దృష్టి సారించడానికి .. రివిజన్ చేసుకోవడానికి సమయం దొరుకుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు దోహదపడుతుందని విద్యాశాఖ నమ్ముతోంది. పరీక్ష తేదీ, సబ్జెక్టు వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది పరీక్షలను ప్రభుత్వం ప్రకటించింది. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్ ఎగ్జామ్, మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్ ఎగ్జామ్,, మార్చి 23న థర్డ్ లాంగ్వేజ్ ఎగ్జామ్, మార్చి 28న మ్యాథమాటిక్స్ , ఏప్రిల్ 02న ఫిజికల్ సైన్స్ , ఏప్రిల్ 07 న బయోలాజికల్ సైన్స్ , ఏప్రిల్ 13న సోషల్ స్టడీస్ పరీక్షలు



జరుగుతాయి. పరీక్షల నిర్వహణపై ఇప్పటికే విద్యాశాఖ వెంటనే అన్ని జిల్లాల డీఈఓ లకు , పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం పంపింది. స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు.. జిల్లా విద్యా అధికారులు జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ఎలాంటి సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

**తెలంగాణ ప్రభుత్వం**
సాగునీటి పారుదల మరియు ఆయుకట్టు అభివృద్ధి శాఖ
**కార్యనిర్వాహక ఇంజనీరు వారి కార్యాలయం, డివిజన్ నెం.1, సంగారెడ్డి ఫోన్ : 9440816444**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**
**నోటీసు నెం. 57, 58, 59** (Reserved for SC), **60, 61/EE/ID1/SRD/2025-26, తేది: 10-03-2026.** క్రమ సంఖ్య: **1 నుండి 5 వరకు.** 1) సాగునీటి పారుదల శాఖా - సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, నేరేడిగుంట గ్రామం, యెల్ చెరువు అభివృద్ధి పనుల కొరకు తేదీ : 16.03.2026 నుండి 23.03.2026 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.27.91 లక్షలు. 2). సాగునీటి పారుదల శాఖా - సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, నేరేడిగుంట గ్రామం, ఉప్పొని చెరువు అభివృద్ధి పనుల కొరకుతేదీ : 16.03.2026 నుండి 23.03.2026 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.19.02 లక్షలు. 3). సాగునీటి పారుదల శాఖా సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, అక్సాన్ పల్లి గ్రామం, పెద్ద చెరువు అభివృద్ధి పనుల కొరకు తేదీ: 16.03.2026 నుండి 23.03.2026 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.26.50 లక్షలు. 4). సాగునీటి పారుదల శాఖా - సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, అక్సాన్ పల్లి గ్రామం, సంగయ్య చెరువు అభివృద్ధి పనుల కొరకు తేదీ : 16.03.2026 నుండి 23.03.2026 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.15.62 లక్షలు. 5). సాగునీటి పారుదల శాఖా సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, రోళ్ళపహాడ్ గ్రామం, హిస్స కుంట అభివృద్ధి పనుల కొరకు-తేదీ: 16.03.2026 నుండి 23.03.2026 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.15.17 లక్షలు. మిగతా వివరాలకు 'ఇ' - ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫామ్ www.tender.telanagana.gov.in వెబ్ సైట్ నందు తేదీ: 16.03.2026 నుండి చూడగలరు.
**సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, నీటి పారుదల డివిజన్ నెం. 1, సంగారెడ్డి**
**DIPR.RO.No.16902-PP/CL/Advt/1/2025-26 , Dt: 12-03-2026**

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## క్రిప్టో సంస్కరణలే కీలకం!

భారతదేశంలో డిజిటల్ ఆస్తుల నియంత్రణకు సంబంధించి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు తీసుకున్న తాజా నిర్ణయం ఒక కీలక మలుపుగా కనిపిస్తోంది. ఇప్పటివరకు క్రిప్టో ఆస్తులపై కఠినంగా వ్యవహరించిన ప్రభుత్వం, ఇప్పుడు వాటిని ఆర్థిక ఖాతాల నివేదికల్లో చేర్చడం ద్వారా ఒక క్రమబద్ధమైన మార్గాన్ని ఎంచుకుంది. 2026 నుండి అమలులోకి రానున్న ఈ కొత్త నిబంధనల ప్రకారం డిజిటల్ కరెన్సీలు, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీలు, ఇతర ఎలక్ట్రానిక్ ద్రవ్య ఉత్పత్తులను పన్ను పరిధిలోకి తీసుకువస్తున్నారు. యుద్ధాలు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, మార్కెట్లలో తీవ్రమైన అస్థిరత నెలకొన్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం కేవలం పన్నుల వసూలుపైనే కాకుండా, పారదర్శకతపై కూడా దృష్టి సారించడం గమనార్హం. ప్రస్తుతం భారతదేశంలో క్రిప్టో లావాదేవీలపై విధిస్తున్న పన్నుల భారం ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. లాభాలపై 30 శాతం పన్ను, ట్రేడింగ్ ద్వారా వచ్చే ఆదాయంపై మరో 30 శాతం పన్ను విధిస్తుండటం వల్ల దేశీయంగా డిజిటల్ ఆస్తుల రంగం కుంటుపడుతోంది. పెట్టుబడిపై 7 శాతం పన్ను విధించడం కంటే, దానిని 10 నుండి 15 శాతానికి పెంచి ఇతర భారీ పన్నులను రద్దు చేస్తే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంటుంది. భారీ పన్నుల వల్ల దేశీయ టాలెంట్, పెట్టుబడులు ఇతర దేశాలకు తరలిపోతుండటం ఆర్థిక వ్యవస్థకు ఒక పెద్ద లోటుగా మారుతోంది. కేవలం ఆదాయాన్ని పిండుకోవడం కంటే, ఒక అనుకూలమైన పన్ను విధానాన్ని రూపొందించడం ద్వారా ప్రభుత్వం మరింత ఎక్కువ రెవెన్యూను దీర్ఘకాలంలో సాధించవచ్చు. ఈ విషయంలో థాయిలాండ్, సింగపూర్ వంటి దేశాలను భారతదేశం ఒక ఉదాహరణగా తీసుకోవాలి. ఆ దేశాలు క్రిప్టో లావాదేవీలపై పన్ను మినహాయింపులు ఇవ్వడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వెబ్ 3 కంపెనీలను, స్టార్టప్‌లను ఆకర్షిస్తున్నాయి. సింగపూర్ ఇప్పటికే ఆసియాలోనే ఒక క్రిప్టో హబ్‌గా అవతరించింది, థాయిలాండ్ పర్యాటక రంగంతో పాటు డిజిటల్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తోంది. అక్కడ అమలవుతున్న పన్ను రహిత లేదా తక్కువ పన్ను విధానాల వల్ల ఆ దేశాల ఆర్థిక వ్యవస్థల్లోకి విదేశీ మారక ద్రవ్యం భారీగా వచ్చి చేరుతోంది. భారతదేశం కూడా అటువంటి ఉదారమైన విధానాలను అవలంబిస్తే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రిప్టో దిగ్గజాలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపుతాయి, తద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడటంతో పాటు సాంకేతిక రంగంలో భారత్ అగ్రగామిగా నిలుస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా భారతదేశం తన పన్ను నిబంధనలను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం నియంత్రణ, పర్యవేక్షణ పేరుతో పన్నుల భారాన్ని పెంచడం కంటే, వినూత్నమైన ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేయాలి. డిజిటల్ ఆస్తులను ఒక ఆర్థిక ఆస్తిగా గుర్తించి, వాటికి తగిన చట్టబద్ధత కల్పిస్తూనే పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలి. అప్పుడే అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న తీవ్రమైన ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకుని, భారతదేశం తన సొంత డిజిటల్ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసుకోగలదు. ఇతరదేశాల నుండి పాఠాలు నేర్చుకుంటూ, మన దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఒక సమతుల్యమైన విధానాన్ని రూపొందించడం ద్వారా మాత్రమే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, ఆర్థిక మందగమనం కారణంగా మదుపరులు సురక్షితమైన పెట్టుబడి మార్గాల కోసం అన్వేషిస్తున్న తరుణంలో క్రిప్టో ఆస్తులు ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగే అవకాశం ఉంది. అయితే భారతదేశం విధిస్తున్న ముప్పై శాతం పన్ను, ప్రతి లావాదేవీపై ఒక శాతం టీడీఎస్ వంటి కఠిన నిబంధనలు సృజనాత్మకతను అణచివేస్తున్నాయి. యుద్ధం వల్ల సాంప్రదాయ మార్కెట్లు కుప్పకూలుతున్నప్పుడు, డిజిటల్ ఆస్తులు ఆర్థిక వ్యవస్థకు ఒక రక్షణ కవచంలా పనిచేయగలవు, కానీ భారీ పన్నులు ఉండటం వల్ల సామాన్య మదుపరులు ఈ అవకాశాన్ని వదులుకుంటున్నారు. ప్రభుత్వం పన్ను శాతాన్ని పది నుండి పదిహేను శాతానికి తగ్గించి, నష్టాలను లాభాలతో సర్దుబాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తే దేశీయ మార్కెట్లోకి భారీగా నిధులు ప్రవహిస్తాయి.

దుబాయ్ లాంటి నగరాలు క్రిప్టో స్నేహపూర్వక విధానాల ద్వారా ప్రపంచ ఆర్థిక కేంద్రాలుగా మారుతుండటం మనం గమనించాలి. అక్కడ పన్ను మినహాయింపులు ఉండటం వల్లే వేల సంఖ్యలో భారతీయ టెక్ నిపుణులు అక్కడికి వలస వెళ్లి తమ స్టార్టప్‌లను ప్రారంభిస్తున్నారు, దీనివల్ల మన దేశం విలువైన మానవ వనరులను, పన్ను ఆదాయాన్ని కోల్పోతోంది. సింగపూర్ తరహాలో పారదర్శకమైన చట్టాలు, థాయిలాండ్ తరహాలో తక్కువ పన్ను భారం అమలు చేస్తే భారతదేశం డిజిటల్ కరెన్సీ రంగంలో ప్రపంచ నాయకుడిగా ఎదిగే అవకాశం ఉంటుంది. కేవలం నిఘా పెంచడం కోసం ఖాతాల నివేదికలను సేకరించడం మాత్రమే కాకుండా, ఈ రంగాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి ప్రోత్సాహకాలు అందించాల్సిన సమయం ఆసన్నమైంది.

పెట్టుబడిపై పన్నును పెంచి, ట్రేడింగ్ లాభాలపై పన్నును తగ్గించడం ద్వారా ప్రభుత్వం స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడానికి క్రిప్టో మైనింగ్, బ్లాక్‌చైన్ అభివృద్ధి కేంద్రాలకు ప్రత్యేక ఆర్థిక మండళ్లను కేటాయించాలి. అనిశ్చితి నెలకొన్న యుద్ధ కాలంలో ఇలాంటి ఆధునిక ఆర్థిక సంస్కరణలు భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు వేగంగా నడిపిస్తాయి. పొరుగు దేశాలు చేస్తున్న ప్రయోగాలను గమనించి, మన దేశ పన్ను విధానాన్ని సరళతరం చేయడం ద్వారా మాత్రమే భారత్ గ్లోబల్ డిజిటల్ విప్లవంలో తన ముద్ర వేయగలదు.

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కేవలం బంగారం, చమురు నిల్వలపైనే కాకుండా డిజిటల్ ఆస్తుల నిల్వలపై కూడా భారతదేశం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యుద్ధం సంభవించినప్పుడు దేశాల మధ్య ఉండే సాంప్రదాయ బ్యాంకింగ్ వ్యవస్థలు స్తంభించిపోయే ప్రమాదం ఉంటుంది, అటువంటి అత్యవసర సమయాల్లో వికేంద్రీకృతమైన క్రిప్టో ఆస్తులు దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కాపాడగలవు. మన పొరుగు దేశాలు లేదా అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే తమ విదేశీ మారక నిల్వల్లో కొంత భాగం డిజిటల్ ఆస్తులను చేర్చుకుంటున్నాయి, భారత్ కూడా ఆ దిశగా అడుగులు వేయడం ద్వారా అంతర్జాతీయ చెల్లింపుల విషయంలో ఎవరిపైనా ఆధారపడకుండా ఉండవచ్చు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కేవలం ఖర్చు చేయడానికే కాకుండా, ఒక జాతీయ డిజిటల్ రిజర్వ్ ఏర్పాటుకు ప్రభుత్వం వినియోగించగలిగితే అది దేశ భవిష్యత్తుకు ఒక పెద్ద పెట్టుబడి అవుతుంది. పన్ను విధింపు అనేది పెట్టుబడిదారులను శిక్షించేలా ఉండకూడదు, వారిని ప్రోత్సహించేలా ఉండాలి. సింగపూర్, హాంగ్ కాంగ్ వంటి దేశాలు క్రిప్టోను ఒక చట్టబద్ధమైన ఆస్తిగా గుర్తిం చి వాటి లావాదేవీల కోసం ప్రత్యేక నియంత్రణ సంస్థలను ఏర్పాటు చేశాయి, దీనివల్ల అక్కడి ప్రభుత్వంపై మదుపరులకు నమ్మకం పెరిగింది. భారతదేశంలో కూడా అస్పష్టమైన నిబంధనలను తొలగించి, స్పష్టమైన చట్టాలను రూపొందిస్తే విదేశీ కంపెనీలు తమ కార్యాలయాలను ఇక్కడ స్థాపించడానికి ముందుకు వస్తాయి. దీనివల్ల భారీగా పన్ను ఆదాయం రావడమే కాకుండా, సాంకేతిక రంగంలో వేల సంఖ్యలో ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. గ్లోబల్ డిజిటల్ ఎకానమీలో భారత్ అగ్రస్థానంలో నిలవాలంటే కేవలం నియంత్రణ మాత్రమే సరిపోదు, వినూత్నమైన ప్రోత్సాహకాలు కూడా తోడవ్వాలి.

యుద్ధం వల్ల కలిగే ఆర్థిక అస్థిరతను తట్టుకోవడానికి సామాన్య మదుపరులకు క్రిప్టో ఒక భరోసాగా మారుతుంది, కానీ ప్రస్తుత 30 శాతం ఆదాయపు పన్ను భారం వారిని ఈ రంగానికి దూరం చేస్తోంది. ఒకవేళ ప్రభుత్వం ఈ పన్నును తగ్గించి, అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాల మాదిరిగా సరళమైన పన్ను విధానాన్ని ప్రవేశపెడితే, భారత్ లోపల ఉన్న నల్లధనం బయటకు రావడమే కాకుండా అది వ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థలోకి చేరుతుంది. 2026 నాటికి ఆర్థిక నివేదికల్లో వీటిని చేర్చాలనే నిర్ణయం పారదర్శకతకు నాంది పలికినప్పటికీ, పన్నుల విషయంలో కూడా మార్పులు జరిగితేనే ఈ రంగం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలదు. మారుతున్న ప్రపంచ క్రమానికి అనుగుణంగా మన ఆర్థిక విధానాలను వేగంగా మార్చుకోవడం ద్వారా మాత్రమే భారతదేశం ఒక శక్తివంతమైన డిజిటల్ అగ్రరాజ్యంగా అవతరించగలదు.

# గల్ఫ్ యుద్ధ సెగ. భారత్‌ని అతలాకుతలం చేస్తుందా?



- ఇప్పటికే అంతర్జాతీయ చమురు సరఫరా వ్యవస్థ అతలాకుతలం
- ముడి చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతులపైనే భారత్ ఆధారం
- గ్యాస్ ధరలు పెరగడంతో ప్రభుత్వంపై సబ్సిడీ భారం ఖాయం
- గృహ వినియోగ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే సూచనలు
- వాస్తవ పరిస్థితులను, భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తల ఆవశ్యకత సుస్పష్టం

తేజస్విని
హైదరాబాద్

ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలన్నింటినీ వణికిస్తున్నాయి, ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ప్రత్యక్ష దాడులు అంతర్జాతీయ చమురు సరఫరా వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. భారతదేశం తన ఇంధన అవసరాల కోసం గల్ఫ్ దేశాలపై భారీగా ఆధారపడటం వల్ల, అక్కడ జరిగే చిన్న మార్పు కూడా మన దేశంలోని సామాన్యుడి జేబుపై ప్రభావం చూపుతోంది. యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో గృహ వినియోగ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే సూచనలు కనిపిస్తు న్నాయి, రవాణా వ్యవస్థ స్తంభించి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగానే కాకుండా, ప్రపంచ ఆర్థిక గమనాన్ని మార్చే శక్తిగా మారుతోంది. సముద్ర మార్గాల్లో నౌకల రాకపోకలు నిలిచిపోవడం వల్ల ఎగుమతులు, దిగుమతులు దెబ్బతిని భారతీయ రూపాయి విలువ పడిపోతోంది, పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్ల నుండి వెనక్కి తగ్గుతున్నారు. దేశీయంగా పరిశ్రమలు మూతపడే పరిస్థితి రావడం, నిరుద్యోగం పెరగడం వంటి భయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశం ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను, భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తల ఆవశ్యకతని స్పష్టం చేస్తుంది.

**ఇంధన, గ్యాస్ సంక్షోభం (ఎల్పీజీ కొరత):**

భారతదేశం తన ముడి చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది, ఇరాన్ సమీపంలోని హార్ముజ్ జలసంధి ద్వారానే మనకు అవసరమైన చమురులో మెజారిటీ భాగం సరఫరా అవుతుంది. యుద్ధం కారణంగా ఈ సముద్ర మార్గం మూతపడితే భారత్‌కు చమురు సరఫరా పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది, దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్కసారిగా వందల రూపాయలకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల చమురు కంపెనీలు తమ నిల్వలను నియంత్రించడం మొదలుపెట్టాయి, ఇది దేశవ్యాప్తంగా ఇంధన కొరతకు దారితీస్తోంది. గృహ అవసరాలకు వాడే ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై ఈ యుద్ధం తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోంది, ఎందుకంటే మనం దిగుమతి చేసుకునే గ్యాస్‌లో సింహభాగం ఈ యుద్ధ ప్రాంతం నుండే వస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో గ్యాస్ ధరలు పెరగడంతో ప్రభుత్వంపై సబ్సిడీ భారం పెరుగుతోంది, పరిస్థితి ఇలాగే కొనసాగితే గృహ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల లభ్యత తగ్గిపోవచ్చు. డెలివరీలో జాప్యం జరగడం, గ్యాస్ ఏజెన్సీల వద్ద స్టాక్ లేకపోవడం వంటి వార్తలు సామాన్య ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి, వినియోగదారులు ముందస్తుగా సిలిండర్లను బుక్ చేసుకునేందుకు క్యూ కడుతున్నారు. ముడి చమురు ధరల పెరుగుదల కేవలం ఇంధనానికే పరిమితం కాకుండా, ఎరువులు, ప్లాస్టిక్, రసాయనాల తయారీపై కూడా ప్రభావం చూపుతుంది. చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ సామాన్యుడి రవాణా ఖర్చు రెట్టింపు అవుతుంది, ఆటోలు, బస్సులు, గూడ్స్ వాహనాల ఛార్జీలు పెరగడం వల్ల సామాన్యుడి బడ్జెట్ తలకిందులవుతోంది. గ్యాస్, పెట్రోల్ సంక్షోభం వల్ల దేశీయంగా ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయి, చివరకు అది ద్రవ్యోల్బణానికి దారితీసి ప్రజల కొనుగోలు శక్తిని హరిస్తోంది, ఇది దేశ ఆర్థిక మూలాలను దెబ్బతీసే ప్రమాదంగా మారింది.

**హోటళ్ల మూసివేత, ఆతిథ్య రంగం సంక్షోభం:**

హోటల్ పరిశ్రమ ప్రధానంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై ఆధారపడి నడుస్తుంది, అయితే యుద్ధం కారణంగా ఈ సిలిండర్ల ధరలు ఆకాశాన్ని తాకడం వల్ల వ్యాపారం చేయడం యజమానులకు భారంగా మారింది. చిన్న తరహా టిఫిన్ సెంటర్లు, బడ్జెట్ హోటళ్లు తమ ఖర్చులను భరించలేక తాత్కాలికంగా బోర్డులు తిప్పేస్తున్నాయి, వినియోగదారుల నుంచి ఎక్కువ ధర వసూలు చేస్తే గిరాకీ తగ్గుతుందనే భయంతో చాలామంది వ్యాపారాన్ని నిలిపివేస్తున్నారు. నగరాల్లోని ప్రధాన హోటళ్లలో కూడా మెనూ ధరలు 20 నుండి 30 శాతం వరకు పెరగడం వల్ల సామాన్యుడు హోటళ్లకు వెళ్లడం తగ్గించేశాడు.

గ్యాస్ కొరత తీవ్రం కావడంతో కొన్ని హోటళ్లు ప్రత్యామ్నాయంగా బొగ్గు, కట్టెల పొయ్యిలను వాడుతున్నాయి, కానీ ఇది అందరికీ సాధ్యమయ్యే పని కాదు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌లు, చిన్న గదుల్లో నడిచే హోటళ్లకు గ్యాస్ తప్ప వేరే మార్గం లేదు, సరఫరాదారులు సిలిండర్ల కోటాను తగ్గించడంతో హోటల్ యజమానులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. వంట గ్యాస్ అందుబాటులో లేకపోవడం వల్ల ఇప్పటికే కొన్ని ప్రధాన నగరాల్లో రాత్రిపూట నడిచే హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మూతపడ్డాయి, దీనివల్ల ఆ రంగంలో పనిచేసే కార్మికులు రోడ్డున పడుతున్నారు. కేవలం గ్యాస్ ధరలే కాకుండా, వంట నూనెలు, కూరగాయలు, పప్పు ధాన్యాల ధరలు కూడా రవాణా ఖర్చుల వల్ల పెరిగిపోయాయి. హోటల్ నడపడానికి కావాల్సిన ముడిసరుకు వ్యయం పెరగడం, మరోవైపు గ్యాస్ కొరత వెన్నాడుతుండటంతో ఆతిథ్య రంగం కుప్పకూలే స్థితికి చేరుకుంది. దీనివల్ల పర్యాటక రంగం కూడా దెబ్బతింటోంది, పర్యాటకులు హోటల్ ఖర్చులను భరించలేక తమ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. ఇది దేశీయంగా సేవా రంగంపై ఆధారపడిన లక్షలాది మంది జీవనోపాధిని ప్రశ్నార్థకం చేస్తోంది.

**పరిశ్రమల కుదేలు, ఎగుమతులపై దెబ్బ:**

భారతీయ పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకులో ఎక్కువ భాగం సముద్ర మార్గాల ద్వారానే వస్తుంది, యుద్ధం కారణంగా ఎర్ర సముద్రంలో నౌకలపై దాడులు జరుగుతుండటంతో అంతర్జాతీయ రవాణా కంపెనీలు తమ సేవలను నిలిపివేస్తున్నాయి. దీనివల్ల ముడిసరుకు భారత్ చేరుకోవడానికి నెలల సమయం పడుతోంది, ఫ్యాక్టరీలలో ఉత్పత్తి ఆగిపోవడం వల్ల కార్మికులకు పని దొరకడం లేదు. రసాయన పరిశ్రమలు, ఫార్మా రంగాలు ముఖ్యంగా ఇరాన్ నుండి వచ్చే ముడి పదార్థాలపై ఆధారపడటం వల్ల ఆయా రంగాలు తీవ్రమైన ఉత్పత్తి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భారతదేశం నుండి విదేశాలకు వెళ్లే బియ్యం, తేయాకు, వస్త్రాలు, ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులు భారీగా తగ్గిపోయాయి. రవాణా ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు యుద్ధం వల్ల 50 శాతం పైగా పెరగడం వల్ల భారతీయ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌లో తమ పోటీతత్వాన్ని కోల్పోతున్నాయి. విదేశీ ఆర్డర్లు రద్దవుతుండటంతో ఎగుమతిదారులు నష్టాల్లో కూరుకుపోతున్నారు, ఇది దేశ విదేశీ మారక నిల్వలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఈ ఒత్తిడిని తట్టుకోలేక మూతపడుతున్నాయి, దీనివల్ల పారిశ్రామిక వృద్ధి రేటు గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉంది.

యుద్ధం వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో తలెత్తిన అంతరాయం భారతీయ ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాలను కూడా దెబ్బతీస్తోంది. విదేశాల నుండి రావాల్సిన విడిభాగాలు రాకపోవడంతో కార్లు, మొబైల్ ఫోన్ల తయారీ మందగించింది, ఫలితంగా మార్కెట్‌లో వీటి ధరలు పెరిగిపోతున్నాయి. పెట్టుబడులు తగ్గడం, బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు వడ్డీలు కట్టలేకపోవడం వల్ల పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. పారిశ్రామిక ఉత్పత్తి పడిపోవడం వల్ల దేశ జీడీపీపై కోలుకోలేని దెబ్బ పడే అవకాశం ఉంది, ఇది దీర్ఘకాలిక ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఆర్థిక వ్యవస్థ పతనం:**

యుద్ధం కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధర పెరగడం వల్ల భారత్ దిగుమతుల కోసం ఎక్కువ డాలర్లను ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనివల్ల విదేశీ మారక నిల్వలు వేగంగా హరించుకుపోతున్నాయి, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ నిరంతరం పడిపోతోంది. రూపాయి బలహీనపడటం వల్ల మనం దిగుమతి చేసుకునే ప్రతి వస్తువు ఖరీదుగా మారుతోంది, ఇది దేశీయ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమవుతోంది. ఆర్థిక స్థిరత్వం దెబ్బతినడం వల్ల విదేశీ ఇన్వెస్టర్లు భారత స్టాక్ మార్కెట్ల నుండి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు.

దేశీయంగా ద్రవ్యోల్బణం పెరగడం వల్ల సామాన్య ప్రజల పొదుపు తగ్గిపోతోంది, బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచడం వల్ల గృహ రుణాలు, వాహన రుణాలు తీసుకున్న వారిపై ఈఎంఐల భారం పెరుగుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉండటం వల్ల, ఇంధన ధరల ప్రభావం వ్యవసాయం నుండి సాఫ్ట్‌వేర్ రంగం వరకు కనిపిస్తోంది. ప్రభుత్వం తన బడ్జెట్ అంచనాలను మార్చుకోవాల్సి వస్తోంది, అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులను పెరిగిన ఇంధన సబ్సిడీల కోసం మళ్లించాల్సి రావడం వల్ల మౌలిక సదుపాయాల కల్పన మందగిస్తోంది. యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే భారత ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం వల్ల మార్కెట్‌లో డిమాండ్ పడిపోతుంది, ఇది కంపెనీల లాభాలను దెబ్బతీసి ఉద్యోగాల కోతకు దారితీస్తుంది. షేర్ మార్కెట్ పతనం వల్ల సామాన్య ఇన్వెస్టర్ల సొమ్ము ఆవిరైపోతోంది, దేశంపై రుణ భారం పెరుగుతోంది. ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలంటే ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది, ఇది దేశ పురోగతికి పెద్ద అడ్డంకిగా మారింది.

**రవాణా వ్యవస్థ స్తంభన, నిత్యావసరాల కొరత:**

యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరిగినప్పుడు దాని ప్రభావం రవాణా రంగంపై పిడుగులా పడుతుంది, డీజిల్ ధరలు పెరగడం వల్ల లారీలు, గూడ్స్ వాహనాల యజమానులు తమ కిరాయిలను భారీగా పెంచుతున్నారు. పరిస్థితులు నెలకొన్నాయి.

దీనివల్ల పొరుగు రాష్ట్రాల నుండి వచ్చే కూరగాయలు, పప్పు ధాన్యాలు, పాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపు అవుతున్నాయి, సామాన్యుడి వంటగదిలో మంట పుడుతోంది. సరుకు రవాణా ఖరీదైనదిగా మారడంతో మార్కెట్లోకి సరఫరా తగ్గిపోతోంది, ఇది కృత్రిమ కొరతకు దారితీసి బ్లాక్ మార్కెట్ పెరిగేలా చేస్తోంది. రవాణా వ్యవస్థ కుంటుపడటం వల్ల కేవలం ఆహార పదార్థాలే కాకుండా ఔషధాల సరఫరాపై కూడా ప్రభావం పడుతోంది, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అవసరమైన మందులు సకాలంలో ఆసుపత్రులకు చేరడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు తగ్గిపోవడం వల్ల రైతులు తమ పండించిన పంటను మార్కెట్లకు తరలించలేక నష్టపోతున్నారు, మరోవైపు పట్టణాల్లో నివసించే ప్రజలు అధిక ధరలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సరఫరా గొలుసు తెగిపోవడం వల్ల ఆర్థిక వ్యవస్థలోని చక్రం నెమ్మదిస్తోంది, ఇది దేశవ్యాప్తంగా ఒక రకమైన అశాంతికి కారణమవుతోంది.

ప్రభుత్వ రవాణా సంస్థలు కూడా పెరిగిన డీజిల్ ధరల భారాన్ని భరించలేక బస్సు ఛార్జీలను పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది, దీనివల్ల ప్రతిరోజూ ప్రయాణించే పేద, మధ్యతరగతి ప్రజల ఖర్చులు పెరిగిపోతున్నాయి. విమాన ఇంధనం ధరలు కూడా ఆకాశాన్ని తాకడం వల్ల విమాన ప్రయాణాలు సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి, ఇది వ్యాపార ప్రయాణాలను తగ్గించి పరోక్షంగా వాణిజ్య లావాదేవీలను దెబ్బతీస్తోంది. రవాణా రంగం పడిపోవడం అంటే దేశం యొక్క నాడులు నెమ్మదించడమే, ఇది చివరకు దేశ పురోగతిని దశాబ్దాల వెనక్కి నెట్టే ప్రమాదం ఉంది.

**స్టాక్ మార్కెట్ కుప్పకూలడం, ఇన్వెస్టర్ల ఆందోళన;**

అంతర్జాతీయ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు ఇన్వెస్టర్లలో అభద్రతా భావం పెరిగిపోతుంది, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వల్ల భారత స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూస్తున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ నిధులను సురక్షితమైన ఆస్తులైన బంగారం, డాలర్లలోకి మళ్లించడం వల్ల షేర్ల ధరలు దారుణంగా పడిపోతున్నాయి, దీనివల్ల సామాన్య ఇన్వెస్టర్ల కష్టార్జితం కోట్లాది రూపాయల మేర ఆవిరైపోతోంది. మార్కెట్ ఒడిదుడుకుల వల్ల కంపెనీల మార్కెట్ విలువ తగ్గిపోతోంది, ఇది కొత్త పెట్టుబడులు రాకుండా అడ్డుపడుతోంది.

**భారతదేశం నేర్చుకోవాల్సిన పాఠాలు:**

ఈ యుద్ధం భారతదేశానికి ఒక హెచ్చరిక లాంటిది, మనం ఇంధనం కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తక్షణమే తగ్గించుకోవాలని ఇది సూచిస్తోంది. వ్యూహాత్మక చమురు నిల్వలను భారీగా పెంచుకోవాలి, కనీసం ఆరు నెలలకు సరిపడా ఇంధనాన్ని భూగర్భంలో నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలి. ప్రస్తుత నిల్వలు కేవలం కొన్ని రోజులకు మాత్రమే సరిపోతాయి, అందుకే భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు ఎదురైనప్పుడు దేశం స్తంభించకుండా ఉండాలంటే నిల్వ సామర్థ్యమే మనకు శ్రీరామ రక్ష. పునరుత్పాదక ఇంధన వనరులైన సౌర శక్తి, పవన శక్తి, గ్రీన్ హైడ్రోజన్ వైపు మనం వేగంగా అడుగులు వేయాలి. ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా పెట్రో ల్, డీజిల్ అవసరాలను తగ్గించుకోవచ్చు, ఇది మనకు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడమే కాకుండా ఇంధన భద్రతను ఇస్తుంది. స్వదేశీ వనరుల ద్వారా ఇంధన అవసరాలను తీర్చుకోగలిగిన రోజే మనం అంతర్జాతీయ యుద్ధాల ప్రభావం నుండి పూర్తిగా తప్పుకోగలము. పరిశోధన, అభివృద్ధి రంగంలో పెట్టుబడులు పెంచి కొత్త టెక్నాలజీలను అందుబాటులోకి తీసుకురావాలి. వ్యాపారాలు, పరిశ్రమలు ఒకే మార్కెట్ లేదా ఒకే సరఫరా మార్గంపై ఆధారపడకూడదు, ముడిసరుకు దిగుమతుల కోసం ప్రత్యామ్నాయ దేశాలను వెతుక్కోవాలి. ఆత్మనిర్భర్ భారత్ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేసి నిత్యావసర వస్తువులు, రసాయనాలు, విడిభాగాలను దేశీయంగానే తయారు చేసుకోవాలి. సముద్ర మార్గాల్లో రక్షణ కోసం మన నావికాదళాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి, అంతర్జాతీయ దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకుని మన వాణిజ్య ప్రయోజనాలను కాపాడుకోవాలి. ఈ పాఠాలను గ్రహించి అమలు చేస్తేనే భారతదేశం ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలబడగలదు.

మొత్తం మీద చెప్పాలంటే, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కేవలం రెండు దేశాల సరిహద్దులకు పరిమితం కాకుండా భారతీయ సామాన్యుడి వంటగది వరకు ప్రభావం చూపుతోంది, ఇంధన ధరల పెరుగుదల, గ్యాస్ కొరత, హోటళ్లు మూతపడటం వంటివి మన ఆర్థిక వ్యవస్థకు ఒక హెచ్చరికగా నిలుస్తున్నాయి. ఇలాంటి అంతర్జాతీయ సంక్షోభాల వల్ల కలిగే నష్టాలను తట్టుకోవాలంటే మనం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి, స్వదేశీ వనరులను పెంచుకోవాలి, వ్యూహాత్మక ఇంధన నిల్వలను పటిష్టం చేసుకోవాలి. ఈ కష్టకాలం మనల్ని మరింత పటిష్టమైన ఆర్థిక విధానాల వైపు నడిపిస్తుందని, భవిష్యత్తులో యుద్ధాల నీడ మన పురోగతిని అడ్డుకోకుండా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలని ఆశిద్దాం.

అమెరికా విషయంలో నరేంద్రమోదీ తీసుకొన్న నిర్ణయాలు.. వ్రతం చెడినా

# అంతర్జాతీయంగా సమున్నత స్థాయిలో భారత్ కీర్తి ప్రతిష్టలు



సి.రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి

మేము నిటారుగా నిల్చుంటాం. ఎవరిముందు తలవంచం. మా మిత్రులందరికీ స్నేహహస్తం అందుబాటులో ఉంటుంది. మా వ్యవహారాల్లో ఎవరి జోక్యాన్ని సహించం 1982లో ఈ మాటలు పలికినవారు ఉక్కు మహిళగా పేరుపొందిన నాటి భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ ను ఉద్దేశించి. సందర్భం ఏమిటంటే- భారత్ను అమెరికా శిబిరంలో చేరాలని ప్రెసిడెంట్ రీగన్ చేసిన ప్రతిపాదనకు శ్రీమతి ఇందిరాగాంధీ నిష్కర్షగా చెప్పిన సమాధానం అది. ఆమె ఈ మాటల్ని ఎక్కడో అనలేదు. అమెరికా పర్యటించినపుడు సాక్షాత్తు రోనాల్డ్ రీగన్ సమక్షంలోనే అమెరికా, రష్యాల మధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధంలో తాము ఎవరి పక్షమూ వహించబోమని, దౌత్యపరంగా తమది తటస్థ వైఖరి అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు.

దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ మొదలుకొని, అటల్ బిహారీ వాజ్పేయి వరకు, మధ్యలో దేవెగౌడ, ఐకె గుజ్రాల్తోసహా దేశ ప్రధానులుగా కాంగ్రెస్ పార్టీ వారున్నా, కాంగ్రెసేతర పార్టీలకు చెందిన వారెవరున్నా.. భారత దేశ విదేశాంగ విధానం సుదృఢంగా అలీన విధానం (నాన్ అలైన్డ్)గానే కొనసాగింది. నిజానికి ఆనాటికి భారత్ నేటి మాదిరిగానే ప్రబల ఆర్థిక శక్తిగా లేదు. పేదరికం, నిరుద్యోగం, అవిద్య వంటి ఎన్నో సామాజిక, ఆర్థిక రుగ్మతలతో దేశం సతమతమవుతోంది. అయినప్పటికీ అన్న వస్త్రాల కోసమో, అణ్వాయుధాల కోసమో భారత్ ఎవరిముందూ తలవంచలేదు. దేశాన్ని ఎవరు ఏలుతున్నా.. వారు ఏకపక్షంగా తమకు తోచినట్టుగా నిర్ణయాలు తీసుకోలేదు. సొంత పార్టీ నేతలను, దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల నేతలను విశ్వాసంలోకి తీసుకొని అందరి సలహాలు, సూచనల మేరకు విదేశాంగ విధానాన్ని తీర్చిదిద్దారు. ప్రధానంగా దేశ ప్రయోజనాలు, మరీ ముఖ్యంగా ప్రపంచ మానవాళి శాంతి సౌభాగ్యాలకు దోహదం చేసే విదేశాంగ విధానాన్ని అనుసరించారు. కొన్ని సందర్భాలలో విదేశాంగనీతిలో రాజీపడవలసిన అనివార్యత ఏర్పడినా.. దేశ ప్రయోజనాల్ని ఎవరూ ఎన్నడూ పణంగా పెట్టలేదు. ఫలితంగానే నిన్నమొన్నటి వరకూ.. భారత్ కీర్తి ప్రతిష్టల్ని అంతర్జాతీయంగా సమున్నత స్థాయికి తీసుకువెళ్ల గలిగారు.

అయితే, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నడుస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న ఏకపక్ష, డొల్ల విదేశాంగ విధానంతో అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట మసక బారింది. దేశ ప్రయోజనాలు దెబ్బ తింటున్నాయి. భారతదేశం అనుసరించే విదేశాంగ విధానాన్ని ఒకప్పుడు వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి (స్ట్రాటజిక్ అటానమీ)గా చెప్పుకొనేవారు. దానివల్లనే దక్షిణాసియా దేశాలకు భారత్ ప్రాంతీయ నాయకత్వం వహించే స్థితికి చేరింది. కానీ, నరేంద్రమోదీ హ్రస్వదృష్టితో తీసుకొన్న పలు నిర్ణయాల కారణంగా నేడు భారత్ విదేశాంగ విధానంలో స్పష్టత లోపించింది. రాజకీయ ప్రత్యర్థి దేశాలకంటే వెనుకబడి పోయింది. పైగా, అంతర్జాతీయంగా అనేక అవకాశాలు కోల్పోయింది. చివరకు నేడు అనేక శిబిరాలుగా మారిన అంతర్జాతీయ సమాజంలో భారత్ ఎవరిపక్షం వహిస్తున్నదో, ఎందుకు వహిస్తున్నదో, దానివల్ల సాధిస్తున్న ప్రయోజనాలేమిటో చెప్పలేని నిస్సహాయ




అటల్ బిహారీ వాజ్పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఆయన తరచూ ఓ విలువైన మాట అంటుండేవారు. మీకు ఎలాంటి స్నేహితులు ఉండాలో ఎంచుకొనే అవకాశం మీకు ఉంది. కానీ పొరుగున్న ఎవరుఉండాలో నిర్ణయించడం అన్నది మీ చేతుల్లో ఉండదు. ఆ కారణంగానే ఒక్క పాకిస్థాన్ మినహా మిగతా పొరుగు దేశాలతో వాణిజ్య, దౌత్య, సాంస్కృతికపరంగా చక్కటి సంబంధాలు నెలకొల్పడానికి ప్రాధాన్యత ఇచ్చారు. నైబర్ హుడ్ ఫస్ట్ (పొరుగు వారే ముందు) అనే స్థాయిలో భారత్ తనకు మించిన స్థాయిలో నేపాల్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, శ్రీలంక, మాల్దీవులకు అన్ని రకాలుగా సాయం చేసింది. ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్లను దాదాపుగా ఒంటిచేత్తో పునర్నిర్మాణం చేసిందనే చెప్పాలి. ఆఫ్ఘనిస్థాన్ పార్లమెంట్ భవనం నిర్మాణం మొదలుకొని రోడ్లు, బ్రిడ్జిలు, టెలిఫోన్ వ్యవస్థ వరకు అనేక రంగాలలో సాయం చేసింది. 1971-72లో తూర్పు పాకిస్థాన్ విముక్తమై బంగ్లాదేశ్ గా అవతరించడానికి పాకిస్థాన్తో యుద్ధమే చేసిన భారత్.. ఆనాడు బంగ్లాదేశ్ శరణార్థులకు చోటిచ్చింది. వారి ఆకలి దప్పులు తీర్చడానికి దేశ ప్రజలపై అదనపు పన్నులు వేసింది. అదేవిధంగా.. శ్రీలంకలో వేర్పాటువాదాన్ని అణచడానికి భారత్ సైన్యాన్నే (ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ ఐపికెఎఫ్) పంపింది. పొరుగు దేశాలైన మయన్మార్, మాల్దీవులకు సైతం సాయపడింది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా.. ఇదొక నిరంతర ప్రక్రియలా కొనసాగింది.

కానీ.. నేటి పరిస్థితి ఏమిటి? నైబర్ హుడ్ ఫస్ట్ కాస్తా.. నైబర్ హుడ్ ఫర్గెట్ గా మారింది. భారత్ను ద్వేషించే దేశాలలో పాకిస్థాన్ సరసన బంగ్లాదేశ్ చేరిపోయింది. ఆ దేశంలో నేడు హిందువులపైన, హిందువుల ప్రార్థనా మందిరాలపై దాడులు జరుగుతుంటే.. దౌత్యపరమైన ఒత్తిడి తెచ్చి వాటిని ఆపగలిగే శక్తి భారత్ కు లేకుండా పోయింది. బంగ్లాదేశ్ పూర్తిగా చైనా చెప్పుచేతుల్లోకి వెళ్లిపోయింది. హసీనా ప్రభుత్వ పతనం అనంతరం.. బంగ్లాదేశ్లో లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. మోంగ్లా ఓడరేవును, తీస్తానదీ ముఖద్వారాన్ని చైనా అభివృద్ధి చేస్తోంది. నేపాల్, శ్రీలంక, మాల్దీవులతో సైతం భారత్ సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఏదో సామెత చెప్పినట్లు.. సొమ్మొపోయి శనిపట్టడానికి కారణం - మన దౌత్యనీతిలో వచ్చిన మార్పే! పొరుగు దేశాలతో పరస్పర సహకారం, గౌరవం ఇచ్చిపుచ్చుకొంటూ స్వప్రయోజనాలను కాపాడుకోవలసిన దౌత్య విధానంలో రాజకీయాలు జొరబడడం వల్ల.. సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. బంగ్లాదేశ్లో అవామీలీగ్ నేత శ్రీమతి షేక్ హసీనాతో వ్యక్తిగత అనుబంధం పెంచుకోవడం వల్ల అమెను వ్యతిరేకించే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైనాకు దగ్గరయింది. అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అధినేత తారిఖ్ రెహ్మాన్ చైనాకు తమ దేశపు తలుపులు బార్లా తెరిచాడు. అమెరికా విషయంలో కూడా ప్రధాని నరేంద్రమోదీ ఈ విధంగానే వ్యవహరించారు. ట్రంప్ను గెలిపించాలని ఆ దేశం వెళ్లి ఇండియన్ డయాస్పోరాకు పిలుపునిచ్చారు. పోనీ ట్రంప్ ఆ మేకు నరేంద్రమోదీ పట్ల, భారతపట్ల కృతజ్ఞత చూపించాడా అని అంటే సమాధానం లేదనే చెప్పాలి. భారత్పై ఏకపక్షంగా టారిఫ్లు భారీగా విధించాడు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుపై ఆంక్షలు విధించాడు. అలాగే ఇరాన్ నుంచి కూడా చమురు దిగుమతి చేసుకోరాదని అంతకుముందే హెచ్చరించాడు.

ఫలితం దక్కలేదన్నట్లుగా తయారైయింది. పైగా, అమెరికా ఆంక్షలకు తలొగ్గిన ఫలితంగా.. భారత మార్కెట్లను అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ముంచెత్తబోతున్నాయి. దాంతో, భారత రైతాంగం పరిస్థితి ప్రశ్నార్థకం కావడం ఖాయం. రెండేళ్ల క్రితం మొదలయిన రష్యా - ఉక్రెయిన్ యుద్ధంకు సంబంధించి భారత్ తన విధానాన్ని స్పష్టం చేయలేకపోయింది. రష్యా దుందుడుకు తనాన్ని ప్రశ్నించలేకపోయాయి. దానివల్ల యూరోపిన్ యూనియన్ (ఇయు) స్నేహాన్ని పోగొట్టుకోవలసి వచ్చింది.

ఇటీవల విశాఖలో జరిగిన నేవీ ఫ్లీట్లో పాల్గొని స్వదేశానికి బయలుదేరిన ఇరాన్ ఓడను హిందూ మహాసముద్రంలో అత్యంత అమానుషంగా ముంచేసిన ఘటనపై భారత్ నోరు మెదపలేదు. తమ అతిథిని ఆ విధంగా చేయడమేమిటని అమెరికాను ప్రశ్నించలేదు. హిందూ మహాసముద్రంలో దొంగచాటుగా అమెరికా తన జలాంతర్గాములను మొహరిస్తే దానిని తప్పని ఖండించలేదు. ఇక, ఇరాన్ అధినేత ఖమేనీ హత్య జరిగిన 6 రోజుల అనంతరం భారత్ దౌత్యాధికారి ఒకరు ఢిల్లీలోని ఇరాన్ కాన్సులేటికి వెళ్లి మొక్కుబడి సంతాపం చెప్పొచ్చారు. దేశాధినేత ఈ సంఘటనపై నోరు మెదపకపోవడం ఆశ్చర్యం. ఒకవేళ ఇరాన్ పట్ల వ్యతిరేకత ఉంటే అసలు ఇరాన్కు సంతాపం తెలపాల్సిన అవసరం లేదు. కానీ, ఈ అంశంలో జరిగిన తాత్సారానికి సమాధానం దొరకదు. ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉండి ఉంటే.. ఈ పాటికే వాటికి అమెరికాపై ప్రయోగించి ఉండేవారు. అంటే.. ఆయా దేశాలను నాశనం చేయడానికి అమెరికా బూచిగా చూపించే అంశం అణ్వాయుధాలు కలిగి ఉండడం. దీనిని కూడా ఇండియా ప్రశ్నించలేకపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా.. ఇరాన్తో యుద్ధానికి సిద్ధపడిన ఇజ్రాయెల్ దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటించడమే ఆశ్చర్యం. ఇజ్రాయెల్ పర్యటించిన ఏకైక ప్రధాని ఇప్పటివరకు ఒక్క మోదీయే. పైగా, ఇజ్రాయెల్ పర్యటనలో ప్రధాని మోదీ.. పాలస్తీనాతో జరిపిన యుద్ధంలో చనిపోయిన 1,219 ఇజ్రాయెలీలకు సంతాపం వ్యక్తం చేశారేతప్ప ఆ యుద్ధంలో ఇప్పటివరకు అసువులు బాసిన 70 వేల మంది పాలస్తీనీయుల పట్ల ఒక చుక్క కన్నీరు కూడా కార్చలేకపోయారు.

ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత అన్నది ఓ నానుడి. కానీ, నేడు దేశంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశంలో తాము సాధించిన విజయాలు.. వివిధ రాష్ట్రాలలో అధికారంలోకి రావడం, జీఎస్టీని సరళీకృతం చేయడం, లేబర్ కోడ్ చట్టాలు మార్చడం మొదలైన వాటిని ఘనంగా చాటుకుంటోంది తప్ప.. అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట గురించి మాట్లాడటం లేదు. ముఖ్యంగా.. నరేంద్రమోదీకి ఆప్తమిత్రుడైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్కు 30 రోజులపాటు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి అనుమతి ఇవ్వడం గురించి అధికార పార్టీకి చెందినవారెవరూ నోరు మెదపకపోవడం సిగ్గుచేటు. ప్రస్తుతం ఇరాన్పై సాగుతున్న అమెరికా, ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో నరేంద్రమోదీ అనుసరిస్తున్న మౌనం దేనికి సంకేతం?! విదేశీ విధానంలో కేంద్ర ప్రభుత్వం వేస్తున్న తప్పటడుగులు, తప్పుడు అడుగులకు దేశం చెల్లించే మూల్యం ఏ మేరకు ఉంటుందో ఊహించడం కష్టం.




# గ్యాస్ సంక్షోభం మధ్య పుకార్లు హల్‌చల్

● అప్రమత్తంగా ఉండాలని దేశ ప్రజలకు ప్రధాని మోడీ సూచన..!
పరిస్థితిని భయాందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై నిఘా
ప్రస్తుత స్థితి ప్రజల ముందు ఉంచాలని ప్రధాని మంత్రులకు ఆదేశాలు



న్యూఢిల్లీ ఇరాన్‌లో జరుగుతున్న యుద్ధం మధ్య, దేశంలోని చాలా ప్రాంతాలో గ్యాస్ కొరత పెరుగుతోంది. గ్యాస్+ సిలిండర్ల కోసం పొడవైన లైన్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితిని భయాందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై నిఘా ఉంచాలని ప్రధాని మోదీ తన మంత్రులను ఆదేశించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం సన్నాహాలు బలంగా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.
ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో దేశంలోని పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని ప్రధాని మోదీ గురువారం (మార్చి 12) తన మంత్రులను కోరినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితిపై భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న వారిని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు సోషల్ మీడియాలో కూడా చురుగ్గా ఉండాలని సూచించారు. అలాగే ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పేర్కొన్నారు.మంత్రులు విశ్వాసాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చిన ప్రధాని మోదీ, "ఇలాంటి ప్రచారాలకు ప్రతిస్పందించేటప్పుడు మంత్రులు విశ్వాసాన్ని కాపాడుకోవాలి. ఇది ఒక దేశాన్ని మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసే పరిస్థితి" అని అన్నారు.
ఎలాంటి సంక్షోభానైనా ఎదుర్కొనేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని, ఇందుకు సన్నాహాలు చాలా బలంగా ఉన్నాయని ఆయన అన్నారు. మన పొరుగువారి కంటే, అనేక ఇతర దేశాల కంటే భారతదేశం బలంగా, మెరుగ్గా ఉందన్న విషయం ప్రజలకు వివరించాలని ప్రధాని తెలిపారు.అంతకుముందు, బుధవారం తమిళనాడులో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, ప్రజలు భయపడవద్దని, ప్రజా ప్రయోజనాలను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. తమిళనాడులో జరిగిన నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. వాణిజ్య ఎల్పీజీ కొరత దేశంలోని హోటల్ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఎల్పీజీ సంక్షోభానికి త్వరిత పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. గ్యాస్ సంక్షోభాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ, సరైన, ధృవీకరించిన సమాచారాన్ని మాత్రమే వ్యాప్తి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఇదిలావుంటే, హార్ముజ్ జలసంధి ద్వారా అంతర్జాతీయ నౌకా రవాణాను మూసివేయడానికి లేదా అంతరాయం కలిగించడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాల మధ్య భారతదేశం ఒక పెద్ద పురోగతిని సాధించింది. ఈ సముద్ర మార్గం ద్వారా నౌకల కదలికకు సంబంధించి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తన ఇరాన్ ప్రతినిధి అబ్బాస్ అరఘ్చితో ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. చర్చల తర్వాత, ఇరాన్ భారతదేశం కోసం హార్ముజ్ జలసంధిని తెరవడానికి అంగీకరించింది. ఇరాన్ ఇప్పుడు భారత జెండా కలిగిన ట్యాంకర్లను దాని గుండా వెళ్ళడానికి అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే సౌదీ అరేబియా నుంచి ముడి చమురును మోసుకెళ్తున్న లైబీరియన్ జెండా కలిగిన ట్యాంకర్ ముంబై తీరానికి సురక్షితంగా చేరుకుంది. ప్రస్తుతం పుష్పక్, పరిమల్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు జలసంధిని సురక్షితంగా దాటుతున్నాయి.

# లోక్‌సభను తాకిన గ్యాస్ సెగలు

● రష్యా నుంచిచమురుకు అమెరికా ఆమోదమేంటని నిలదీసిన విపక్షం ● దేశ సార్వభౌధికారాన్ని అగ్రరాజ్యం చేతిలో పెడతారా?
● ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను ప్రస్తావించిన రాహుల్ గాంధీ.. ● రాహుల్ వ్యాఖ్యలు సభా మర్యాదలకు విరుద్ధంగా ఉన్నాయన్న కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి



న్యూఢిల్లీ లోక్‌సభలో ఎల్‌పీజీ కొరతపై జరిగిన చర్చ సందర్భంగా రాజకీయ సెగలు రాజుకున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ఇంధన భద్రతపై కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారానికి దారితీశాయి. రష్యా నుండి చమురు కొనుగోలు చేసే విషయంలో అమెరికా వంటి ఇతర దేశాల అనుమతి మనకు ఎందుకని ఆయన ప్రశ్నించారు. భారత్ వంటి సార్వభౌమ దేశం తన చమురు సంబంధాలను స్వయంగా నిర్ణయించుకోవాలే తప్ప పరాయి దేశాల ఒత్తిడికి తలొగ్గడం ఏంటని నిలదీశారు. దేశ ఆర్థిక భద్రతను కేంద్రం పక్కన పెట్టిందని ఆరోపిస్తూ సభలో కీలక పత్రాలను ప్రస్తావించారు. ఈ క్రమంలోనే కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురిని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యలు సభలో గందరగోళానికి దారితీశాయి. ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రస్తావనను తీసుకువస్తూ రాహుల్ చేసిన విమర్శలపై అధికార పక్షం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. దేశ భద్రత ఇంధన భద్రత గురించి మాట్లాడుతుంటే ఇలాంటి అసందర్భ విషయాలను తీసుకురావడం తగదని మంత్రులు ఖండించారు. రాహుల్ వ్యాఖ్యలు సభా మర్యాదలకు విరుద్ధంగా ఉన్నాయని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ ఆరోపణలను తిప్పికొడుతూ హర్దీప్ సింగ్ పురి దేశంలో ఇంధన పరిస్థితులపై స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం దేశంలో పెట్రోల్ డీజిల్ కొరత లేదని ఆయన భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ ఒత్తిళ్లకు లోనవకుండా దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. ఎల్‌పీజీ కొరతను దృష్టిలో ఉంచుకుని గ్యాస్ ఉత్పత్తిని భారీగా పెంచాలని ఇప్పటికే చమురు కంపెనీలను ఆదేశించినట్లు సభకు తెలిపారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.పేద ప్రజల అవసరాల కోసం పీడీఎస్ ద్వారా కిరోసిన్ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామని మంత్రి వివరించారు. దేశ ఇంధన అవసరాల కోసం ఏ దేశంపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. విపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసం అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకుండా చూస్తామని హర్దీప్ సింగ్ పురి హామీ ఇచ్చారు. ఉభయ పక్షాల మధ్య వాగ్వాదంతో లోక్‌సభ దద్దరిల్లింది.



# ఇరాన్‌లో ప్రభుత్వం కూలిపోయే ముప్పు లేదు

● అమెరికా నిఘా సంచలన నివేదిక ● సుప్రీం లీడర్ దాడుల్లో మరణించడంతో ప్రభుత్వం కూలిపోతుందన్న అమెరికా
● ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరానియన్లకు పిలుపు ● మత నాయకత్వ వ్యవస్థ బలంగా ఉందన్న గూఢచారి నివేదిక
● అంచనాలు తల్లకిందులు కావటంతో ట్రంప్ మల్లగుల్లాలు

ఇరాన్‌పై గత నెల 28న యుద్ధం ప్రారంభించిన తర్వాత.. నాయకత్వాన్ని మార్చడమే తమ లక్ష్యమని, ప్రభుత్వాన్ని ప్రజలు స్వాధీనం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపు నిచ్చారు. కానీ, అమెరికా ఉన్నత స్థాయి అధికారులు.. తమ లక్ష్యం అది కాదని ప్రకటించారు. ఈ క్రమంలో. ఇప్పుడు అమెరికా నిఘా నివేదిక సైతం ఇదే వెల్లడించడం గమనార్హం. దాదాపు రెండు వారాలుగా పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతున్నా.. ఇరాన్‌లో నాయకత్వం స్థిరంగానే ఉందని, ఇప్పట్లో ప్రభుత్వం కూలిపోయే అవకాశం లేదని అమెరికా నిఘా సంచలన నివేదిక బయటపెట్టింది. యుద్ధ పరిణామాలకు సమీపంగా ఉన్న విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా ఇంటెలిజెన్స్ ఈ నివేదిక ప్రచురించింది.
అమెరికా గూఢచారి వర్గాలు సేకరించిన పలు నివేదికలు... ప్రస్తుతం ఇరాన్‌లో ప్రభుత్వానికి తక్షణ ముప్పులేదని ఒక వర్గం పేర్కొంది. అంతేకాదు, ఇప్పటికీ ప్రజలపై ప్రభుత్వానికి నియంత్రణ కొనసాగుతుందని పేరు చెప్పడానికి నిరాకరించిన అధికార వర్గాలు సూచించినట్టు తెలిపింది. ఈ నివేదిక కొద్ది రోజుల కిందటే అగ్రరాజ్యం ఇంటెలిజెన్స్ సిద్ధం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు వివరించాయి. చమురు ధరలు, అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ భయాల నేపథ్యంలో ఒత్తిడి పెరుగుతు న్నందున 2003 తర్వాత అమెరికా చేపట్టిన అతిపెద్ద ఈ సైనిక ఆపరేషన్‌ను త్వరగా ముగిస్తామనే సంకేతాలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చారు. కానీ, ఇరాన్ నాయకత్వం కఠిన వైఖరి కొనసాగితే యుద్ధానికి ఆమోదయోగ్యమైన ముగింపు అంత సులభం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
ఫిబ్రవరి 28న జరిపిన దాడిలో ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించినా.. ఇప్పటికీ ఇరాన్‌లో మతాధికారుల నాయకత్వ వ్యవస్థ ఇప్పటికీ ఐక్యంగా ఉందని కొనసాగుతుందని నివేదికలు సూచిస్తున్నాయి. ఇజ్రాయెల్ అధికారుల అంతర్గత చర్చల్లోనూ ప్రస్తుత యుద్ధం కారణంగా ఇరాన్‌లో ఇస్లామిక్ ప్రభుత్వం పతనం అవుతుందనే నమ్మకం లేదనే అభిప్రాయం వ్యక్తమైనట్టు ఆ దేశ ఓ సీనియర్ అధికారి అన్నట్టు రాయిటర్స్ నివేదించింది. అయితే, క్షేత్రస్థాయిలో అంతర్గత రాజకీయ సమీకరణాలు ఎప్పుడైనా మారే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనిపై జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్ కార్యాలయం, వైట్‌హౌస్ దీనిపై తక్షణమే స్పందించడానికి నిరాకరించాయి.ఫిబ్రవరి 28 అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించిన తర్వాత.. గగనతల రక్షణ, అణు స్థావరాలు, సీనియర్ నాయకత్వం సహా అనేక లక్ష్యాలపై దాడులు నిర్వహించాయి. ఈ యుద్ధానికి ట్రంప్ యంత్రాంగం వివిధ కారణాలు వెల్లడించింది. ఆపరేషన్ మొదలైనప్పుడు.. ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు.
కానీ, ఇరాన్ ప్రభుత్వాన్ని మార్చడం తమ ఉద్దేశం కాదని అమెరికా ఉన్నతాధికారులు ప్రకటించారు.దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ సహా పదుల సంఖ్యలో ఉన్నతస్థాయి నాయకులు, అధికారులు హతమైనా ఇస్లామిక్ ప్రభుత్వానికి పాలనపై ఏ మాత్రం పట్టుసడల్లేదని పేర్కొంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, తాత్కాలిక నాయకత్వం ఇప్పటికీ ప్రజలపై పూర్తిగా నియంత్రణ కొనసాగిస్తుందని అమెరికా నిఘా నివేదిక అభిప్రాయపడింది.
అసెంబ్లీ నిపుణుల కమిటీ.. ఖమేనీ కుమారుడు మోజ్తాబా ఖమేనీని ఇటీవల నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నుకుంది.కానీ, ఇజ్రాయెల్ మాత్రం పాత ప్రభుత్వ అవశేషాలను కొనసాగించబోమని, మతతత్వ వాదులను వదలిపెట్టబోమని తేల్చిచెప్పింది. అయితే, ప్రస్తుతం జరుగుతోన్న ఇజ్రాయెల్–అమెరికా దాడుల్లో ఖమేనీ ప్రభుత్వాన్ని ఎలా కూలదోస్తాయనేది స్పష్టతలేదు. ఇరాన్ ప్రజలు వీధుల్లోకి వచ్చిన సురక్షితంగా నిరసన తెలిపేందుకు వీలుగా భూతల దాడి చేపట్టే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. ట్రంప్ యంత్రాంగం ఇరాన్‌లోకి అమెరికా దళాలను పంపే అవకాశాన్ని తోసిపుచ్చలేదు.

# వంట గ్యాస్‌పై మరో పిడుగు..



● బుకింగ్ గడువు రోజులను మరింత పెంపు ● కేంద్రం మరో సంచలన నిర్ణయం ● సిలండర్ కావాలంటే 15 రోజులు ఆగాల్సిందే

న్యూఢిల్లీ : మిడిల్ ఈస్ట్ లో యుద్ధం ప్రభావం భారత్ పై పడుతుంది. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ లభ్యతపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. వంట గ్యాస్ ధరలు పెరుగుతుండడంతో ప్రజలు భారీగా బుకింగ్ చేసుకుంటున్నారు. దీంతో కేంద్ర ఇప్పటికే గ్యాస్ బుకింగ్ 25 గడువు విధించింది. తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో వంట గ్యాస్ బుకింగ్ గడువులను 25 నుంచి 45 రోజులకు పెంచింది. పట్టణాలు, నగరాల్లో గ్యాస్ బుకింగ్ గడువులను 25 రోజులుగా నిర్ణయించింది. వినియోగదారుల్లో ఆందోళన
మిడిల్ ఈస్ట్ లో రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత్ లో ఎల్పీజీ సిలిండర్ల కొరత వస్తుందని ఆందోళనలు నెలకొన్నాయి. ఇంధన మార్కెట్లలో అంతరాయాలు కారణంగా దేశంలో వంటి గ్యాస్ సరఫరాను ప్రభావితం చేస్తాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే, ఎల్పీజీ సిలిండర్ల కొరత లేదని, గ్యాస్ సరఫరాలో గృహ వినియోగదారులకు ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఎల్పీజీ సరఫరాపై ప్రజలు భయపడవద్దని కోరింది. అదనపు సిలిండర్లను బుక్ చేసుకోవడానికి తొందరపడవద్దని సూచించింది.హోటళ్లు బంద్ఇరాన్ యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరతపై పుకార్లు చెలరేగాయి. ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ సరఫరా తగ్గడంతో హోటళ్లు బంద్ అయ్యాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి కేంద్రం రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా గ్యాస్+ సరఫరా స్థిరంగా ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏవైనా సరఫరా సమస్యలు తలెత్తితే కమర్షియల్ వినియోగదారుల కంటే వంట గ్యాస్ వినియోగదారులకు ప్రాధాన్యత ఇస్తామని అధికారులు తెలిపారు.45 రోజులకు పెంపుఇందులో భాగంగా ముందుగా ఎల్ పిజి బుకింగ్ పై 21 రోజుల గడువు విధించింది. ఆ తర్వాత రీఫిల్ సిలిండర్‌ను బుకింగ్‌ను 25 రోజులకు పెంచింది. తాజాగా గ్యాస్ సిలిండర్ బుకింగ్ గడువులను గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు పెంచినట్లు కేంద్రం ప్రకటించింది.
ఈ సర్దుబాటు అమల్లో ఉన్నప్పటికీ, వంట గ్యాస్ సిలిండర్లను అంతరాయం లేకుండా సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. అదనపు డబ్బులు డిమాండ్ చేస్తేఎల్పీజీ గ్యాస్ సిలిండర్ కోసం జనం క్యూ కట్టండంతో డీలర్లు అదనపు డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు అందుతున్నాయి. ఎవరైనా అదనపు డబ్బు డిమాండ్ చేసిన, బుకింగ్ చేసిన సిలిండర్ డెలివరీకి నిరాకరించినా ఎల్ పిజి ప్రొవైడర్ అధికారిక హెల్ప్‌లైన్ కు ఫిర్యాదు చేయవచ్చు. బ్లాక్ మార్కెట్ విక్రయాలకు పాల్పడే డీలర్లపై అధికారులు చర్యలు తీసుకుంటారని కేంద్రం తెలిపింది.
ఇండేన్ గ్యాస్ హెల్ప్‌లైన్ నంబర్1800–2333–555 (టోల్ ఫ్రీ)7718955555 (ఎల్ పిజి బుకింగ్, కంప్లైంట్స్)
ఈ హెల్ప్‌లైన్ కు ఫోన్ చేసి లేట్ డెలివరీలు, అధిక ఛార్జీలు లేదా ఎల్పిజి పంపిణీకి ఇతర సమస్యలను రిపోర్టు చేయవచ్చు.
భారత్ గ్యాస్ హెల్ప్‌లైన్ నంబర్1800–22–4344 (టోల్ ఫ్రీ)7715012345 (ఎల్ పిజి బుకింగ్)
హెచ్ పి గ్యాస్ హెల్ప్‌లైన్ నంబర్1800–2333–555 (టోల్ ఫ్రీ)9493602222 (హెచ్ పి ఎనీటైమ్ ఎల్ పిజి)

# దుబాయ్‌కు కష్టాలు.. వలస వెళ్లిపోతున్న మిలియనీర్లు



న్యూఢిల్లీ మిడిల్‌ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. లగ్జరీ లైఫ్‌కు మారుపేరుగా గుర్తింపు తెచ్చుకున్న దుబాయ్‌కు కష్టకాలం ఎదురవుతోంది. అక్కడి నుంచి సంపన్నులు భారీగా వలస వెళ్లిపోతున్నట్లు ఫైనాన్సియల్ టైమ్స్ దీనికి సంబంధించిన కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం.. యుద్ధ భయంతో సంపన్నులు దుబాయ్‌ను వీడి ఒమన్ రాజధాని మస్కట్ మీదుగా లండన్, యూరప్ నగరాలకు వెళ్లిపోతున్నారు. ప్రతిరోజూ మస్కట్ ఎయిర్‌పోర్టు నుంచి దాదాపు 30 ప్రైవేటు జెట్లు, చార్టర్ విమానాలు ప్రయాణిసున్నాయి. ఒక్కో విమానంలో కనీసం 8 మంది వెళ్తున్నారు. ఇరాన్ దాడులు ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటిదాకా దాదాపు 1000 మంది మిలియనీర్ల కుటుంబాలు దుబాయ్ నుంచి వెళ్లిపో యినట్లు తెలుస్తోంది. దుబాయ్‌లో 81,200 మంది మిలియనీర్లు ఉంటున్నారు.
యుద్ధం వల్ల భారీగా వలసలు కొనసాగుతుండటంతో దుబాయ్‌పై ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మస్కట్ ఎయిర్‌పోర్టులో రద్దీ పెరిగిపోయింది. గతవారంలో అక్కడి నుంచి వెళ్లిన విమానాల్లో మూడో వంతు ప్రైవేట్ జెట్‌లే ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**ఒక్కో సీటు ధర రూ.16 లక్షలు**

సంపన్నుల కోసం ప్రైవేట్ జెట్‌లో ఒక్కో సీటు ధర 20000 డాలర్లు(రూ.16 లక్షలు)గా ఉంది. అయినప్పటికీ చాలా ధనిక కుటుంబాలు ఐరోపాకు వెళ్లిపోతున్నారు. మస్కట్‌లో రద్దీ పెరగడంతో కొందరు రియాద్, దమ్మామ్ ఎయిర్ పోర్టులను కూడా వాడుకుంటున్నారు. మరికొందరు ఆసియా నుంచి అమెరికా మీదుగా యూరప్‌కు వెళ్తున్నారు. ఎయిర్ ఇండియా కూడా లండన్, పారిస్, న్యూయార్క్ లాంటి నగరాలకు అదనపు విమానాలు ప్రకటించింది. ప్రపంచంలో అతిపెద్ద మిలియనీర్ల వలసలకు దుబాయ్ కేరాఫ్‌గా ఉంది. కానీ ఇప్పుడు ఇక్కడి నుంచి నుంచి వలసలు మొదలవ్వడం ఆందోళన కలిగిస్తోంది. సౌదీ అరేబియా నుంచి కూడా మిలియనీర్లు వెళ్లిపోతున్నారు.
అక్కడ ఉండే అత్యధిక సంపన్నుల వద్ద కనీసం 10 లక్షల మిలియన్ డాలర్ల సంపద ఉంటుంది. వీళ్లు ఎక్కడికి వెళ్తే అక్కడ వ్యాపారాల్లో భారీగా పెట్టుబడులు పెడతారు. దీంతో ఆ ప్రాంతం ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. అందుకే సంపన్నులను ఆకర్షించడం కోసం చాలా దేశాలు పోటీ పడుతుంటాయి. గల్ఫ్ దేశాల్లోని యూఏఈకి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ వలసలను స్వాగతించే విధానం, జీరో ఆదాయపు పన్ను, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, రాజకీయ స్థిరత్వం ఉంటాయి. యూఏఈలోని దుబాయ్, అబుదాబి, షార్జాలో ఎక్కువగా బిలియనీర్లు ఉండేందుకు ఆసక్తి చూపుతారు. కానీ ఇప్పుడు యుద్ధం వల్ల సంపన్నులు వలస వెళ్లిపోవడంతో ఆ ప్రావిన్స్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

# ఇంధన భద్రతపై ఇరాన్‌తో మాట్లాడాం

దేశ ఇంధన భద్రతపై ఇరాన్‌తో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ ( మాట్లాడారని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ వెల్లడించారు. హార్ముజ్ మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి కూడా చర్చించినట్లు తెలిపారు. మరోవైపు, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, దానిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శ్రీలంక, మాల్దీవుల నుంచీ ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు.

**సురక్షిత ప్రాంతాలకు విద్యార్థులు**

.ప్రస్తుతం ఇరాన్‌లో దాదాపు తొమ్మిది వేల మంది భారతీయులు ఉన్నారని.. వీరిలో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు విదేశాంగశాఖ



అధికార ప్రతినిధి వెల్లడించారు. ఘర్షణ మొదలైన వెంటనే విద్యార్థులు సహా అనేక మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉందన్నారు.పాక్‌కు **అలవాటే** అఫ్గాన్‌తో ఇటీవల ఘర్షణకు భారత్ కారణమంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగశాఖ ఖండించింది. అవి నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు పరిపాటేనని విమర్శించింది. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం మాటలకు విశ్వసనీయత లేదని తెలిపింది.

## భారత జెండా ఉన్న నౌకలకు ఇరాన్ పర్మిషన్
## హార్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతి



న్యూఢిల్లీ : ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న అత్యంత క్లిష్టమైన యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో, భారత దౌత్య యంత్రాంగం అనుసరిస్తున్న వ్యూహాలు దేశానికి భారీ ఊరటను ఇస్తున్నాయి. భారత ఫ్లాగ్ తో ఉన్న నౌకలకు హార్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చింది. మిడిల్ ఈస్ట్ లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, భారత విదేశాంగ మంత్రి జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య నిరంతరం చర్చలు సాగుతున్నాయి. వీరిద్దరి మధ్య ఇప్పటివరకు మూడుసార్లు కీలకమైన చర్చలు జరిగాయి. ఇందులో భాగంగా మంగళవారం జరిగిన ఫోన్‌కాల్ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ వంటి హార్ముజ్ జలసంధి గుండా భారత నౌకలు సురక్షితంగా ప్రయాణించేలా చూడటమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశ్యం. అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు హార్ముజ్ ఆంక్షల ముప్పును ఎదుర్కొంటున్న తరుణంలో, భారత జెండాతో ఉన్న పుష్పక్ , పరిమళ్ వంటి భారీ ట్యాంకర్లు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుతుండటం జైశంకర్–అరాగ్చీల మధ్య జరిగిన దౌత్య చర్చల విజయానికి నిదర్శనంగా నిలిచింది.సూశ్రీంశీ =ఘుం – ప్రజల మన్ననలు పొందేలా ప్రజా ప్రతినిధులు పని చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిఈ దౌత్య ప్రయత్నాలు కేవలం ఇరాన్‌తోనే ఆగిపోలేదు. బుధవారం నాడు జైశంకర్ రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతో పాటు ఐరోపా సమాఖ్యకు చెందిన కీలక నేతలతో ఫోన్లో మాట్లాడారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రస్తుత యుద్ధం చూపుతున్న తీవ్ర ప్రభావాన్ని, ముడిచమురు, గ్యాస్ ధరల పెరుగుదలను ఎలా అదుపు చేయాలనే అంశాలపై వారు లోతుగా చర్చించారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మూతపడితే ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా నిలిచిపోయి ఆర్థిక సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని భారత్ హెచ్చరించింది. రష్యాతో సంప్రదింపులు జరపడం ద్వారా, ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను, దౌత్యపరమైన ఒత్తిడిని భారత్ పెంచుతోంది. దేశంలో ఇప్పటికే ఎల్‌పీజీ (గ్యా+), సీఎన్‌జీ (జచీ+) కొరత నెలకొన్న తరుణంలో, ఈ ట్యాంకర్లు సురక్షితంగా భారత్‌కు చేరుకోవడం వల్ల సామాన్యులకు ఇంధన ధరల భారం తగ్గడమే కాకుండా, పారిశ్రామిక అవసరాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉంటుంది.

# యుద్ధం ముగిస్తాం

**మూడు షరతులు పెట్టిన ఇరాన్**



న్యూఢిల్లీ : అమెరికా, ఇజ్రాయెల్‌తో చేస్తోన్న యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ ముందుకువచ్చింది. కానీ మూడు షరతులు విధించింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఎక్స్‌లో పోస్టు చేశారు."పశ్చిమాసియా ప్రాంతంలో శాంతికి ఇరాన్ కట్టుబడి ఉంది. రష్యా, పాకిస్థాన్ నాయకులతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని పునరుద్ఘాటించాను. అమెరికా రగిల్చిన యుద్ధాన్ని ముగించేందుకు మా మూడు షరతులను అంగీకరించాలి. ఇరాన్ చట్టబద్ధ హక్కుల్ని గుర్తించాలి. నష్టపరిహారం చెల్లించాలి. భవిష్యత్తులో దురాక్రమణలు జరగకుండా పటిష్ఠమైన అంతర్జాతీయ హామీలు ఉండాలి" అని అధ్యక్షుడు ఎక్స్‌లో రాసుకొచ్చారు.ఇరాన్ వార్నింగ్...ఒక బ్యారెల్‌కు 200 డాలర్ల చొప్పున చెల్లించేందుకు ప్రపంచం సిద్ధంగా ఉండాలని గురువారం ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. 1970 తర్వాత చమురు షాక్‌ను ఎదుర్కోవడానికి వ్యూహాత్మక నిల్వలను విడుదల చేయాలని అంతర్జాతీయ ఇంధన సంస్థ (×జూూ) సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా హెచ్చరిక వచ్చింది. మరోవైపు హార్ముజ్‌లో చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య దాడులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోకి అమెరికా (ఖూూ) మిత్ర దేశాల నౌకలు అడుగుపెడితే పేలిపోయేలా ఇరాన్ ఎక్కడికక్కడ 'నేవల్ మైన్స్' (సముద్రపు మందుపాతరలు) అమర్చడం ఆందోళన కలిగిస్తోంది.

## అమెరికా ఆయిల్ ట్యాంకర్ నౌకపై ఇరాన్ దాడి

**సూసైడ్ బోట్ సాయంతో పేల్చేసిన ఇరాన్ నౌకా దళం**

**భారతీయ నావికులను రక్షించిన ఇరాక్ అధికారులు**



రాత్రి వేళ చుట్టూ చిమ్మ చీకట్లు.. నడి సంద్రంలో ఓ నౌక.. ఒక్కసారిగా భారీ అగ్నిగో ళం.. కారు చీకటిలో మెరుపు మెరిసినట్టు సముద్రంపై పసుపు వర్ణంలో మంటలు జ్వలించాయి. ఈ దృశ్యం చూస్తే హాలీవుడ్ సినిమా సన్నివేశం అనుకుంటే పొరపాటే. ఇది హార్ముజ్ జల సంధిలో ఇరాన్ దాడి తర్వాత మంటల్లో చిక్కుకున్న అమెరికా యాజమాన్యంలోని ఆయిల్ ట్యాంకర్ నౌక సేఫ్‌సీ విష్ణు దృశ్యం. దాడి తర్వాత రెస్క్యూ కోసం వెళ్లిన నౌకలోని సిబ్బంది దీనిని రికార్డు చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వెలుగులోకి వచ్చింది. అండర్‌వాటర్ డ్రోన్‌తో ఇరాన్ దళాలు నౌకపై దాడిచేశాయి. దాడి అనంతరం చమురు తెట్టు సముద్ర ఉపరితలాన్ని కమ్మేసి, ఎండుగడ్డి మాదిరిగా తగలబడిపోయింది. ఈ దృశ్యాలు ఇరాన్–అమెరికా యుద్ధంలో అత్యంత భయంకరమైన ఫోటోలుగా చరిత్రలో నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ దాడిలో భారతీయ నావికుడు ఒకరు మృతి చెందగా... మరో 15 మంది సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. హార్ముజ్ జల సంధిలో ఇరాన్‌కు సమీపంలోని బస్రా వద్ద భారతీయ నావికులున్న అమెరికా నౌకపై దాడి జరిగింది. పర్షియన్ గల్ఫ్‌లో రెండు నౌకలపై అండర్‌వాటర్ డ్రోన్‌తో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ దాడి చేసినట్టు ఆ దేశ అధికారిక టెలివిజన్ ఐఆర్‌ఐబీ ప్రకటించింది.మార్షల్ ఐల్యాండ్స్ జెండా ఉన్న సేఫ్‌సీ విష్ణు ఆయిల్ ట్యాంకర్ అమెరికాకు చెందిన సంస్థ యాజమాన్యంలో ఉంది. విష్ణుతో పాటు గ్రీస్ యాజమాన్యంలోని మాల్టేసే జెండా ఉన్న జెఫైరోస్‌పై కూడా దాడి జరిగింది. దాడిలో భారతీయుడు మృతి చెందినట్టు బాగ్దాద్‌లో భారత రాయబార కార్యాలయం ధ్రువీకరించింది. మిగతా క్రూ సిబ్బందిని రక్షించి, సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు పేర్కొంది.'ఇరాక్ అధికారులతో బాగ్దాద్‌లోని భారత ఎంబసీ నిరంతరం సంప్రదింపులు జరుపు తుంది.. భారతీయ నావికులను రక్షించాం.. వారికి అవసరమైన సహాయం అందిస్తు న్నాం' అని ఎక్స్‌లో భారతీయ మిషన్ పోస్ట్ చేసింది. మృతిచెందిన నావికుడి కుటుం బానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది.తమ అనుమతి లేకుండా హార్ముజ్ జల సంధిని దాటేందుకు నౌకలు ప్రయత్నిస్తే.. పేల్చేస్తామని ఇరాన్ గతంలోనే హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ చమురు సరఫరాలో ఐదో వంతు హార్ముజ్ నుంచే రవాణా అవుతుంది. ఇరాన్, ఇజ్రాయెల్– అమెరికా యుద్ధంతో ఈ జల సంధిని ఇరాన్ మూసివేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రభావితం చూపి, చమురు సంక్షోభానికి దారితీసింది. హార్ముజ్‌లో నౌకలను సురక్షితంగా ప్రయాణించేందుకు తమ దళాలతో భద్రత కల్పిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు. కానీ, ఇది ఏ మేరకు ఫలిస్తుందో అనేది సందేహమే. ప్రస్తుతం చమురు ధరలు భగ్గుమంటున్నాయి. రెండు వారాల్లోనే క్రూడాయిల్ బ్యారెల్ 40 శాతం మేర పెరిగింది. యుద్ధం ఇప్పట్లో ఆగుతుందనే సూచనలు కనుచూపు మేరలోనూ కనిపించడం లేదు.

# జిల్లాలను ప్రమోట్ చేయండి

## పెట్టుబడులను ఆకర్షించండి



● స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కలెక్టర్లకు ర్యాంకింగులిస్తాం ● కమిట్మెంట్... కన్విన్స్... కో-ఆపరేట్
● పెట్టుబడులను రాబట్టేందుకు కలెక్టర్లకు 3జ ఫార్ములాను నిర్దేశించిన ముఖ్యమంత్రి
● అమరావతిలో క్రియేటీవ్ సిటీ, హిందూపూర్‌లో ఎలక్ట్రానిక్ సిటీ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు ప్రకటన
● 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో పెట్టుబడులు, టూరిజం శాఖలపై సీఎం సమీక్ష

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి పెట్టుబడులు రాబట్టడం ఆయా శాఖలకు సంబంధించిన అంశంగా కాకుండా... జిల్లా కలెక్టర్లు కూడా బాధ్యతగా తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు పెట్టుబడులు రాబట్టుకునేలా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో పెట్టుబడులను రాబట్టేలా కలెక్టర్లు కమిట్మెంట్తో పెట్టుబడిదారులను అన్వేషించి... పెట్టుబడులు పెట్టేందుకు కన్విన్స్ చేసి... ముందుకు వచ్చిన వారికి పూర్తిగా కో-ఆపరేట్ చేయాలంటూ జిల్లా కలెక్టర్లకు 3జ ఫార్ములను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజున ముఖ్యమంత్రి వివిధ అంశాలపై సమీక్షించారు. పెట్టుబడి, టూరిజం శాఖలపై జరిగిన చర్చలో సీఎం కీలకాంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులను వేగంగా గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాలి. పెట్టుబడులను ఆకర్షించేలా జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. పెట్టుబడులు వస్తే... స్థానికంగా యువతకు ఉపాధి, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతాయి. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ఎకనామిక్ రీజియన్ డెవలప్మెంట్ పేరుతో అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ రీజిజయన్ కు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, అమరావతికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్, తిరుపతి రీజియన్ కు ముఖేష్ కుమార్ మీనా బాధ్యత వహిస్తారు. రీజియన్ల వారీగా పరిశ్రమలు, పెట్టుబడులు, ఆయా ప్రాంతాల ఆర్థికాభివృద్ధి బాధ్యతను ఈ అధికారులు తీసుకుంటారు. పెట్టుబడులపై ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షించి ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి. అనుమతులు వేగంగా ఇవ్వటంతో పాటు భూ కేటాయింపులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరిగేలా చూడాలి. పరిశ్రమలకు నీటిని ఇస్తేనే వేగంగా ఉత్పాదన ప్రారంభిస్తారు. ఓర్వకల్లులో పారిశ్రామిక క్లస్టర్ రూపకల్పన చేశాం. ఇప్పుడు ఎయిర్ పోర్టు లాంటి మౌలిక సదుపాయాలు కూడా వచ్చాయి. ఇప్పుడు భవిష్యత్తులో ఓ మేజర్ పారిశ్రామిక హబ్ గా మారుతుంది. కడప జిల్లాలో కొప్పర్తి కూడా ఆ పారిశ్రామిక క్లస్టర్ గా తయారు కావాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**పెట్టుబడులపై జిల్లాల్లోనూ సమావేశాలు పెట్టాలి**

"పెట్టుబడులపై జిల్లాల్లో కూడా సమావేశాలు నిర్వహించాలి. పెట్టుబడులు రాబట్టేందుకు కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంపై జిల్లాల వారీగా ర్యాంకులిస్తాం. 2019-24లో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. అమర్ రాజా కంపెనీ తిరుపతిలో కార్పోరేట్ ఆఫీస్ పెట్టింది... వారినీ గత పాలకులు పారిపోయేలా చేశారు. 2014-19లో పరిశ్రమలకు ఇచ్చిన భూములను గత ప్రభుత్వం వేరే అవసరాలకు వాడేసింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏపీని బెంగళూరుకు పోటీగా తీర్చిదిద్దాం. మోస్ట్ లివబుల్ సిటీగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాం... ఎకో సిస్టం కల్పించాం. ఇప్పుడు ఆ ఫలితాలు హైదరాబాద్ అనుభవిస్తోంది. ఇప్పుడు రాష్ట్రం మొత్తం అదే తరహా ఎకో సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా జిల్లాల్లో పరిశ్రమలు రాకుంటే ఆ జిల్లాల్లో టూరిజం ప్రమోట్ చేయాలి... లేదా ఐటీని ప్రమోట్ చేయాలి... ఎంఎస్ఎంఈలు ప్రమోట్ చేయాలి.. అగ్రికల్చర్ ప్రమోట్ చేయాలి. ఇలా ఏదో ఒక రంగంలో ఆయా జిల్లాలకున్న ప్రత్యేకతలను, అనుకూలతలను దృష్టిలో పెట్టుకుని ఆయా రంగాల్లో అభివృద్ధి చేయాలి. జిల్లాలకున్న అడ్వాంటేజీలను ప్రమోట్ చేసి పెట్టుబడులను ఆకర్షించాలి. పెట్టుబడులు పెట్టేవారందరూ తమ దగ్గరకే రావాలని జిల్లా కలెక్టర్లు... మంత్రులు అనుకోకూడదు. పెట్టుబడులు పెట్టే వారెవరో గుర్తించి వారిని కలెక్టర్లు, మంత్రులు సంప్రదించే పరిస్థితి రావాలి. ఇదే విధంగా హైదరాబాద్ ను ప్రమోట్ చేయడం వల్లే ఖ్యాది వచ్చింది. జిల్లాల్లో వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలు, తలసరి ఆదాయం ఎంతమేర పెంచాం అన్నదానిపై జిల్లా కలెక్టర్లు దృష్టి పెట్టాలి. తదుపరి సమావేశం నుంచి ఏ జిల్లా కలెక్టర్ ఎంతమేర పరిశ్రమల్ని ప్రోత్సహించారన్న దానిపై సమీక్షిస్తాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే లాంటి ఇన్ఫ్రా ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. హిందుపూర్ సమీపంలో ఎలక్ట్రానిక్స్ సిటీని ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నాం."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**ఆతిథ్య రంగంలో అభివృద్ధికి ఆస్కారం**


"ఏపీలో ఆతిథ్య రంగానికి పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. అందుకే పర్యాటకానికి పారిశ్రామిక హోదాను కల్పించాం. ఏమీ లేని ప్రాంతాల్లోనే కొన్ని దేశాల్లో టూరిజం అభివృద్ధి చేస్తున్నారు. ఏపీలో అనేక చరిత్రాత్మక ప్రాంతాలు.. ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేసే అంశంపై ఫోకస్ పెట్టాలి. పురాతన కట్టడాలు చాలా ఉన్నాయి.. వాటికి ఎంతో చరిత్ర ఉంటుంది.. వాటిని ఎంకరేజ్ చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల హోటల్ గదులు సిద్ధం కావాలి. వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టేలు పెద్ద ఎత్తున రావాలి. కన్వెన్షన్ సెంటర్లు, మైస్ సెంటర్లు నిర్మాణం చేయాలి. యుద్ధ ప్రభావాల నేపథ్యంలో విదేశాల కంటే స్థానికంగా ఉండే




పర్యాటకానికి పెద్దఎత్తున ఆకర్షణ పెరుగుతుంది. దేవాలయాలు పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు... మానసిక ఉల్లాసాన్ని కలిగించే ప్రాంతాలు వాటిని అభివృద్ధి చేయాలి. పాపికొండలు, గండికోట భారత్ కే గ్రాండ్ కాన్యన్, సూర్యలంక మరో గోవాగా తయారవుతుంది. జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లో ఉన్న పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలి. టూరిజం ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయటంతో పాటు మాన్యుమెంట్లను కూడా అభివృద్ధి చేయాలి. తిమ్మమ్మ మర్రిమాను వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తే మంచి పర్యాటక ప్రాంతంగా మారుతుంది. కంభం చెరువు ఆసియాలోనే అతిపెద్ద మానవ నిర్మిత నీటి వనరు. పులికాట్ సరస్సులో పర్యాటక ప్రాజెక్టును ప్రతిష్టాత్మక కంపెనీలకు అప్పగించి అభివృద్ధి చేయాలి. స్థానికుల్ని ఈ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం చేయటం ద్వారా వేగంగా అభివృద్ధి జరుగుతుంది. జాతీయ రహదారులపై వే సైడ్ అమెనిటీస్, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు, నైట్ హాల్ట్ కోసం గదులు నిర్మాణం చేపడితే పెట్టుబడులు వస్తాయి. ఏపీఐఐసీ ద్వారా చేసే ల్యాండ్ అలాట్మెంట్ లో 5 ఎకరాల వరకూ కేటాయింపులు చేసేలా జిల్లా కలెక్టర్లకు ఆథరైజేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. విజయవాడలోని డిస్నీల్యాండ్, భవానీ ఐ ల్యాండ్ లను పర్యాటకంగా అభివృద్ధి చేద్దాం. అమరావతిలో క్రియేటివ్ సిటీ ఏర్పాటు చేస్తాం. అమరావతిలో కంటెంట్ క్రియేషన్ చేసే వారిని ప్రోత్సహిస్తాం. ఏఐ, ఫిలిం, కంటెంట్ క్రియేషన్ పరిశ్రమలకు పెద్ద పీట వేస్తాం. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ పెరిగేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో

## ఏపీ జెన్కో చారిత్రాత్మక రికార్డు



● సీఎం చంద్రబాబు సలహాలు, జెన్కో సిబ్బంది కృషితోనే రికార్డు ఉత్పత్తి ● గృహ, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు నిరంతరాయ విద్యుత్తే లక్ష్యం ● వేసవి విద్యుత్ అవసరాలు తీర్చేందుకు సిద్ధంగా ఉండాలి
● జెన్కో రికార్డు సాధనకు కృషి చేసిన అందరికీ అభినందనలు ● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఏపీ స్టేట్ బ్యూరో,అమరావతి రాష్ట్ర విద్యుత్ చరిత్రలో మొదటి సారి ఏపీ జెన్కో 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో లైఫ్ టైం రికార్డు సాధించడం గొప్ప విషయమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో)ను స్థాపించిన దగ్గర నుంచి ఇప్పటి వరకు ఎప్పుడూ నమోదు కాని విధంగా 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 5730 మెగావాట్ల ఎక్స్-బస్ ఉత్పత్తి సాధించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో ఇచ్చిన సలహాలు, సూచనలతో పాటు జెన్కో సిబ్బంది ప్రత్యేక కృషి ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు. జెన్కో సాధించిన అసాధారణ విజయం సందర్భంగా జెన్కో అధికారులతో గురువారం నాడు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయం నుంచే వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జెన్కో అధికారులను అభినందించారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరానే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. జెన్కో సాధించిన రికార్డు ఉత్పత్తిలో పాలుపంచుకున్నసిబ్బంది అందరికీ మంత్రి గొట్టిపాటి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

వేసవి విద్యుత్ అవసరాల కోసం ముందస్తు చర్యలు. : రాబోయే వేసవిలో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశముందని మంత్రి గొట్టిపాటి అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సంస్థలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గృహ, పారిశ్రామిక, వ్యాపార వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ అందించే లక్ష్యంతో దానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తితో పాటు రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ను కూడా విజయవంతంగా తీర్చడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సానుకూల సంకేతమని మంత్రి తెలిపారు. ముఖ్యంగా రాబోయే వేసవి నెలల్లో విద్యుత్ డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. విద్యుత్ అంతరాయాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు.

మౌలిక వసతుల బలోపేతంతో భారం తగ్గింపు : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీ జెన్కో ను సర్వనాశనం చేశారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రైవేట్ సంస్థల నుంచి అధిక ధరలకు అత్యధికంగా విద్యుత్ కొనుగోలు చేసి రాష్ట్ర ప్రజల పై రూ. 32 వేల కోట్ల భారాన్ని మోపారని విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్య ప్రజలపై భారం వేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వినియోగదారులపై భారం తగ్గించేందుకు అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగానే దేశంలో ఎక్కడాలేని విధంగా 13 పైసల ట్రూ డౌన్ ను ఇప్పటికే అమలు చేసి కొత్త చరిత్ర సృష్టించిందని తెలిపారు. అదే విధంగా విద్యుత్ వ్యవస్థలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో వేల కోట్ల రూపాయిలతో వందలాది సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. కొత్త విద్యుత్ లైన్లను కూడా వేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, జెన్కో ఎండీ పి. పుల్లారెడ్డి, ఏపీ జెన్కో, ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధుల ద్వారా లబ్దిదారులకు సంక్షేమ లేఖలు

●పెట్టుబడుల గురించి ఆలోచించినట్టే... పేదల గురించీ ఆలోచించాలి ● వేధింపులు లేకుండా పన్నుల వసూళ్లు పెరగాలి
● ఏపీలో పనులు చేస్తూ... వేరే రాష్ట్రాల్లో పన్నులు కడతామంటే ఎలా...?
●విద్యార్థులకు గుర్తుండిపోయేలా యూనివర్శిటీల్లో స్నాతకోత్సవాలు ●6వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తోందని... ఆ పథకాలకు సంబంధించిన ఓనర్షిప్ తీసుకోవాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధుల మీద ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు వివిధ పథకాల లబ్దిదారులకు ప్రజా ప్రతినిధుల ద్వారా సంక్షేమ లేఖలు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజున సూపర్ సిక్స్, సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..." సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వం తరపున లేఖను అందించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతీ లబ్దిదారుకూ ప్రతీ నెలా ఏం లబ్ది కలిగిందో తెలిసేలా చేయాలి. ఏ కుటుంబానికి ఏం లబ్ది కలిగిందో తెలిస్తే అంతా పారదర్శకంగా ఉంటుంది. ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలెండర్, తల్లికి వందనం, ఫీజు రీయింబర్సుమెంట్ లాంటివి లబ్దిదారులకు తెలియాలి. పథకం అమలు చేసే ముందు... లబ్దిదారుని ఖాతాలో డబ్బులు జమ చేసే ముందు ప్రతి లబ్దిదారు కుటుంబానికి సంక్షేమ లేఖలు అందేలా చూడాలి. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలి. డీబీటీ పథకాల్లో ప్రోగ్రామబుల్ వోచర్లను లబ్దిదారులకు ఇస్తే వారు వినియోగించుకుంటారు. మార్చి 9 నాటికి 50.45 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారు. రూ.1775 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్సు చేసింది. డ్వాక్రా, మెప్మా సంఘాల సేవల్ని వినియోగించుకుని పీ4 సహా జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా చేపట్టాలి. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలి. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలి. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తాం. అన్నదాత సుఖీభవ ద్వారా రేపు మూడో విడత నిధులు విడుదల చేస్తున్నాం. అన్నా క్యాంటీన్ల ద్వారా 7.50 కోట్ల భోజనాలు ఇప్పటి వరకూ పేదలకు అందించగలిగాం. అంగన్ వాడీ, ఆశాలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్నాం. రూ. వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాం. పల్లె పండుగ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.4 వేల కోట్ల వ్యయం చేశాం. సంక్షేమ పథకాలు లాస్ట్ మైల్ డెలివరికి చేరడమనేది లక్ష్యంగా కలెక్టర్లు పనిచేయాలి. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా జిల్లా కలెక్టర్లు పని చేయాలి. ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం లేదా ఇంటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఉగాదికి 2.50 లక్షల మందికి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ప్రతీ ఇంటికీ జేజేఎం కింద తాగునీటి కుళాయి ఇస్తాం... ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా చర్యలు తీసుకుంటాం. సాలిడ్, లిక్విడ్ మేనేజ్మెంట్ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి. నెట్ జీరో కాన్సెప్టుగా ఘన వ్యర్ధాలను వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు తరలించాలి. తడి వ్యర్ధాలను కాంపోస్టు తయారు చేసేందుకు మళ్లించాలి. 500 పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టులో కిచెన్ గార్డెన్, బయోడైవర్సిటీలో భాగస్వాములను చేయాలి. వీ బీజీ రామ్ జీ కింద రూ.9773 కోట్లు ఏపీకి కేటాయించారు. ఇప్పుడు ఈ పథకం డిమాండ్ డ్రివెన్ కాదు... దీనికి అనుగుణంగా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పెట్టుడులు గురించి ఎలా ఆలోచిస్తున్నామో... పేదలకు అందించే సంక్షేమం గురించి... వారికి కల్పించే సాధికారత గురించీ కలెక్టర్లు ఆలోచించాలి"అని సీఎం చంద్రబాబు సూచించారు.

ప్రతి రంగంలో వృద్ధి సాధించి జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి : "పన్ను ఎగవేతలు లేకుండా పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలి. ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్ అభివృద్ధి జరిగితే... ప్రభుత్వానికి పెద్ద ఎత్తున వస్తుంది. ప్రతీ రంగంలోనూ వృద్ధి సాధించటం ద్వారా జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి. కొందరు కాంట్రాక్టర్లు తమ కార్యాలయాలు వేరే రాష్ట్రాల్లో పెట్టుకున్నారు... పనులు మాత్రం మన రాష్ట్రంలో చేస్తున్నారు. టెండర్లు, వర్క్ ఆర్డర్లలోని కాంట్రాక్టర్ల నుంచి ఆదాయం రావటం లేదు. ఇది సరి కాదు. జాతీయ రహదారులు, రైల్వేలు, ఇతర ప్రాజెక్టుల పనుల్లో కాంట్రాక్టర్లు చెల్లించే పన్నులు మన రాష్ట్రంలో చెల్లించేలా చూడాలి. పన్ను వసూళ్ల విషయంలో అనవసరపు వేధింపులు వద్దు. పన్ను ఎగవేతలు ఉండకూడదు. పన్నుల పరిధిలో ఉన్నవారు తప్పించుకోవడానికి వీల్లేదు... పన్నులు చెల్లించేలా చూడాలి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి పన్ను ఎగవేతకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలి. పాఠ్యాంశాల్లో కాలానుగుణంగా మార్పులు రావాలి. ప్రస్తుత అవసరాలు, అభివృద్ధికి అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలి. చీజజు=ు సహా వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలను, విశ్వవిద్యాలయాలను సంప్రదించి అధ్యయనం చేయాలి. వయోజన విద్యకు సంబంధించి అక్షరాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించటంలో కలెక్టర్లు పూర్తి శ్రద్ధ పెట్టాలి. జాతీయ స్థాయి విద్యా సంస్థలు అనుసరిస్తున్న పాఠ్యాంశాలు... మన విశ్వవిద్యాలయాల్లో బోధిస్తున్న పాఠ్యాంశాలను సమీక్షించాలి. జాతీయ, అంతర్జాతీయ విద్యాబోధన ప్రమాణాల్లో ఎక్కడున్నామనేది అధ్యయనం చేయాలి. తమిళనాడు, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు ఉన్నత విద్యలో అగ్రస్థానంలో ఉన్నాయి. గత పాలనలో టీచర్లను కూడా రిక్రూట్ చేయలేకపోయారు. స్కిల్ డెవలప్మెంట్ ను రీస్ట్రక్చర్ చేసి... ఉద్యోగావకాశాలు లభించేలా చర్యలు చేపట్టాలి. స్నాతకోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి. విదేశాల్లో దీనిని అపురూపమైన ఘట్టంగా నిర్వహిస్తారు. విద్యార్థులకు చిరస్థాయిగా గుర్తుండి పోయేలా విశ్వవిద్యాలయాల్లో కాన్వోకేషన్ ప్రక్రియ జరగాలి. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యా సంస్థల రేటింగ్ ఎలా ఉందో పరిశీలించాలి."అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.








# శభాష్ దుర్గేష్

● పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసలు
● ముంబయి పర్యటనలో క్రియాశీలకంగా వ్యవహరించి ప్రతిష్టాత్మక సంస్థతో ఎంఓయూ
● అమరావతిలో 'క్రియేటివ్ సిటీ' ఏర్పాటుకు ముందడుగు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి వెలగపూడి సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్లో భాగంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పనితీరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ముంబయి పర్యటనలో రాష్ట్ర పర్యాటక రంగ ప్రగతి కోసం మంత్రి కందుల దుర్గేష్ చూపిన చొరవను కొనియాడుతూ, "శభాష్ దుర్గేష్.. వెల్ డన్, కీప్ ఇట్ అప్" అంటూ ప్రశంసలు కురిపించారు.వివరాల్లోకి వెళ్తే ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్లో జరిగిన 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్పోలో పాల్గొన్న విశేషాలను మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి కల్పించిన పారిశ్రామిక హోదా, నూతన పర్యాటక పాలసీ 2024-29, ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు సమగ్రంగా వివరించానని తెలిపారు. ఈ క్రమంలో ప్రముఖ సంస్థ 'మెసెర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్' ప్రతినిధులు ఏపీ పర్యాటక రంగ పురోగతి పట్ల ఆకర్షితులై విశాఖపట్నంలో రూ. 100 కోట్లతో అమ్యూజ్మెంట్ పార్క్ ఏర్పాటు చేసేందుకు అప్పటికప్పుడు అక్కడే ఎంఓయూ కుదుర్చుకున్నారని మంత్రి దుర్గేష్ తెలిపారు.సినిమా రంగం మరియు స్కిల్ డెవలప్మెంట్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై 'యూరోస్' సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపానన్నారు. ఈ సంస్థ ప్రతినిధులు త్వరలోనే ఆంధ్రప్రదేశ్లో పర్యటించనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఇప్పటికే ఒక పర్యాయం వీరితో సీఎం చంద్రబాబు నాయుడు చర్చించినట్లు గుర్తు చేశారు.

లిఅమరావతి – గ్లోబల్ హబ్:ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. భవిష్యత్తు అంతా 'క్రియేటివ్ ఎకానమీ'దేనని స్పష్టం చేశారు. ఈ దిశగా అమరావతిలో ఒక భారీ 'క్రియేటివ్ సిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇది ఏఐ ఫిల్మ్ ఇండస్ట్రీ, యూట్యూబ్, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ కంటెంట్ సృష్టికి వేదికగా ఉంటుందన్నారు.అమరావతిని గ్లోబల్ క్రియేటివ్ హబ్గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురోగతి కోసం నిరంతరం కృషి చేయాలని, పర్యాటక మరియు సాంస్కృతిక రంగాల్లో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని మంత్రి దుర్గేష్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

### విశాఖలో రూ.100 కోట్లతో

## భారీ అమ్యూజ్మెంట్ పార్క్, రిసార్ట్ ప్రాజెక్ట్

● పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, ● మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ముంబయిలో అవగాహన ఒప్పందం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మరో కీలక అడుగు వేసింది. విశాఖపట్నంలో అత్యాధునిక అమ్యూజ్మెంట్ పార్క్ మరియు రిసార్ట్ అభివృద్ధి కోసం మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్తో మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ముంబయిలో జరిగిన (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్) ఎక్స్పో-2026 వేదికగా పర్యాటక శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'లో భాగంగా, వినోద రంగాన్ని రాష్ట్ర పర్యాటక వృద్ధికి ప్రధాన చిహ్నంగా మలిచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 100 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్క్ మరియు రిసార్ట్ విస్తరించి ఉండేలా ప్రణాళికలు రచించామన్నారు. ఇందులో 100 గదుల సామర్థ్యం కలిగిన విలాసవంతమైన రిసార్ట్ ఉంటుందని, సుమారు 300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. "మధ్యప్రదేశ్లోని గ్వాలియర్ ప్రధాన కేంద్రంగా 2017లో ప్రారంభమైన మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్, వినోద రంగంలో దాదాపు తొమ్మిదేళ్ల అనుభవం కలిగి ఉంది. మోడర్న్ గ్రూప్ ఆధ్వర్యంలో వీరు 'మస్తీ ల్యాండ్' బ్రాండ్తో అమ్యూజ్మెంట్ పార్కులు, గేమింగ్ జోన్లు, రెస్టారెంట్లు మరియు రిసార్టులను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ నిర్వాహకులకు ఈ రంగంలో 40 ఏళ్లకు పైగా విశేష అనుభవం ఉందని" మంత్రి దుర్గేష్ వివరించారు.ఈ సందర్భంగా లిమంత్రి కందుల దుర్గేష్లి మాట్లాడుతూ విశాఖపట్నం నగరం గ్లోబల్ కోస్టల్ టూరిజం హబ్గా వేగంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. నగరంలో మెగా అమ్యూజ్మెంట్ పార్కులను ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి వినోద మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.'కొత్త ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024--2029' ప్రకారం ఈ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అన్ని అనుమతులను త్వరితగతిన మంజూరు చేయనుందన్నారు. ఈ విధానం కింద 25 శాతం వరకు ఫిక్స్డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ, పారిశ్రామిక టారిఫ్ల ప్రకారం విద్యుత్ సరఫరా, 100 శాతం నెట్ ఎస్జిఎస్టి రీయింబర్స్మెంట్ వంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

## దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్... జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, రక్షణ రంగాల్లో మరో కీలక ముందడుగు పడింది. దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా పెంచే దిశగా నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద దేశంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ప్రతిష్మాత్మక ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది.శంకుస్థాపన కార్యక్రమానికి జువ్వలదిన్నె చేరుకున్న మంత్రి లోకేశ్ కు సాగర్ డిఫెన్స్ సంస్థ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను సందర్శించి, ప్రాజెక్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కూటమి ప్రభుత్వం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో 29.58 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇందులో 7.58 ఎకరాల వాటర్ ఫ్రంట్ ల్యాండ్ కూడా ఉండటం విశేషం.





# శరవేగంగా..

## కార్పొరేట్ వ్యవసాయం దిశగా అడుగులు

## లాభాల మాట సరే... ఉపాధి మాట ఏంటి?

అధిక ఉత్పత్తులు సాధించడమే లక్ష్యంగా వ్యవసాయాన్ని కార్పొరేట్ చేస్తూ హైటెక్ పరుగులు పెట్టిస్తున్నారు యువ రైతులు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో సహా నాట్లు వేయడం, విత్తనాలు జల్లడం, కలుపు తీయడం, కోతలు కోయడం ఇలా అన్ని పనుల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం రోజురోజుకూ పెరుగుతూ రావటం కనిపిస్తోంది. దుక్కిదున్నే ట్రాక్టర్‌కి మాత్రమే పరిమితం కాదు... పంట కోసే మెషన్లు, నేరుగా సంచుల్లో ధాన్యాన్ని సేకరించే యంత్రాల వరకూ ఇప్పుడు అందుబాటులోకి రావటంతో చాలా మంది ఇప్పుడు వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నాయి. పంటలు ఎప్పుడు వేయాలి, ఎప్పుడు కోయాలి, పురుగు పడితే ఏం చేయాలనేది చెప్పేందుకు మొబైల్ యాప్‌లు ఇప్పటికే రైతాంగానికి అండగా నిలుస్తున్నాయి. పంటను నిత్యం పరిశీలించేందుకు, మందుల పిచికారీకి, నీటిని చల్లి పంటలను రక్షించేందుకు డ్రోన్లు పెరగ్గా, సరైన సమయంలో వాటిని కోసేందుకు రోబోలు ఇలా కార్పొరేట్ హంగులను మేళవించుకుని కొత్తపుంతలు తొక్కుతోంది.



ప్రపంచ జనాభా 2050 నాటికి వెయ్యి కోట్లకు చేరుతుందని అంచనా. ఈ క్రమంలో భారత దేశ జనాభా కూడా అదే తీరుగా 200 కోట్లు వరకు చేరవచ్చని అంటున్నారు విశ్లేషకులు. అంటే ప్రపంచ జనాభాలో 20% భారత్‌లోనే ఉంటారు మరి, అంత మంది ఆహార అవసరాలు ఎలా తీరతాయనేది ప్రపంచవ్యాప్తం గా ఎంతోమంది మెదళ్లను తొలిచేస్తున్న ప్రశ్న.నిజమే జనాభా పెరుగుతోంది. ఆహార పదార్థాలకు డిమాండ్ పెరుగుతోంది.ఆడిమాండ్‌కు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడంలో టెక్నాలజీ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందనటంలో సందేహం లేదు. ఇప్పుడు వ్యవసాయ పద్దతులు అన్నీ మారాయి. గత కొన్ని శతాబ్దాలగణాంకాలను పరిశీలిస్తే ఆ విషయం స్పష్టం గా అర్థమవుతుంది.

### అన్నీ ఉన్నా

మనదేశంలో ఎక్కువ మందికి ఉపాధి లభించే ఏకైక రంగం వ్యవసాయమే.ప్రభుత్వాలు రైతుల్ని ఆదుకునేందుకు ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపట్టినప్పటకీ అనుకున్న ఫలితాలు రావడం లేదు. మనదగ్గర సారవంతమైన నేలలు, నీళ్లు, సాగు అనుకూల వాతావరణం ఉంది. కానీ నేలతల్లినే నమ్ముకొని సాగు చేస్తున్న రైతులకు లాభం తెచ్చిపెట్టేంతగా ఆధునిక పరికరాలు, పద్ధతుల వాడకం ఇక్కడ లేదు. ఈ లోటును భర్తీ చేసి, రైతుల్ని సాధికారులుగా చేసేందుకు ప్రభుత్వం సిద్ధం కావాలి. మారుతున్న కాలానుగుణంగా సంప్రదాయ వ్యవసాయాన్ని చేపడుతునే, మరోవైపు ఆధునిక వ్యవసాయ ఎద్దతులను మేళవించి అధిక పంటలను దిగుబడి చేస్తునే విదేశాలకు సైతం ఎగుమతులు చేస్తోంది ఇప్పుడు. గడిచిన కొన్ని దశాబ్దాల కాలంలో సాంకేతిక విప్లవం కారణంగా వినూత్న యంత్రాలు అందుబాటులోకి రావటంతో, ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయంలో యాంత్రీకరణ భారీగా పెరిగింది.

### సాంకేతికత కొత్తపుంతలు

ప్రస్తుత డిజిటల్ యుగంలో వ్యవసాయం చేయటంలోనూ సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతోంది. హైటెక్ యంత్రాలు అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పంటల పర్యవేక్షణ కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారు. పారిశ్రామిక, సాంకేతిక సేవల రంగాల్లో సంచలనం సృష్టిస్తున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డేటా ఎనలిటిక్స్. వ్యవసాయంలోనూ కీలకంగా కావటం గమనించవచ్చు.

### పంటపొలాల్లో రోబోలు

రైతుగా.. కూలీగా.. ప్రజలు పనిచేస్తున్న నేటి రోజులకు భిన్నంగా వ్యవసాయంలోకి రోబో 'రైతులు' ప్రవేశించాయి. ఇప్పటికే పలు సంస్థలు రోబోల పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తగా.. ఇలా అన్ని పనులూ అల వోకగా చేసే రోబోలు వచ్చేసాయి. ఆ రోబోలు పొలంలో కలువు మొక్కలను గుర్తించి, తొలగించడం మొదలుకుని.. పంట కోత వరకు అన్ని పనులూ నిరాఘాటంగా చేయగలవని నిపుణులు అంటున్నారు. ఇక పంటలను నిత్యం పరిశీలిస్తూ.. సరైన సమయంలో వాటిని కోసే రోబోలు కూడా ఉన్నాయి. విదేశాల్లో ఇప్పటికే రోబోల వాడకం పెరిగింది. ఆప్టికల్ సెన్సర్ల సాయంతో కలువు మొక్కలను గుర్తించి నాశనం చేసే రోబోలు వచ్చాయి. ఇవి కలువు మొక్కలను గుర్తించి.. అక్కడికక్కడే భూమిలో కలిపేస్తాయి. వచ్చే రెండు మూడు దశాబ్దాల కాలంలో వ్యవసాయం చాలావరకు డిజిటల్ అయి పోయే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అవి అందుబాటులోకి వస్తే రైతు పొలానికి వెళ్లాల్సిన పనుండదు. ఇంట్లో ఉండి స్మార్ట్ ఫోన్‌తోకమాండ్ ఇచ్చి రోబోలతో పంటలను పర్యవేక్షించొచ్చు.

### డ్రోన్లు కీలకం

విదేశాల్లో వ్యవసాయంలో డ్రోన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించేం దుకు, చీడపీడలు వస్తే వెంటనే గుర్తించి, తగిన నివారణ చర్యలు తీసుకునేందుకు ఉపయోగప డుతున్నాయి. ఒక మొక్క ప్రతి అణువణువునూ పరీక్షించి, దాని ఆరోగ్య స్థితిని తెలుసుకునేందుకు ఉపయోగపడే వీఆర్ సాంకేతికతను అభివృద్ధి జరగటంతోడ్రోన్లతో పంట చేలను త్రీడీ ఫొటోలు తీయొచ్చు. ఆ చిత్రాలను సెన్సార్ల తో పరీక్షించి మొక్కల ఆరోగ్య స్థితిని తెలుసుకోవచ్చు. చీడపీడలను స్పష్టంగా గుర్తించే వీలుంటుంది. అలాగే, ఆ మొక్కలకు ఎలాంటి పోషకాలు అవసరమో కూడా తెలుసుకోవచ్చు. ఇలాంటి సాంకేతికత రానున్న కాలం లో ఎంతగానో ఉపయోగపడుతుంది ఒక డ్రోన్ పది నిమిషాల్లో ఎకరా పొలంపై మందులు చల్లగలదు. త్వర లోనే తెలుగు రాష్ట్రాలలోకూడా డ్రోన్లతో పంటల ఫొటోలు తీయడం, రసాయనాలు, ఎరువులు పిచికారీ చేయడం సులువయ్యే అవకాశం ఉంది. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీపై సహకారం కోసం ఇటీవలే ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ.. తమిళనాడులోని అన్నా యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా డ్రోన్ల సాగులో వినియోగంపై ఆ వర్సిటీ నిపుణులు మన అధికారులకు శిక్షణ ఇస్తారు. అగ్రికల్చర్‌లో డ్రోన్ల వాడకంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్) కూడా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన క్రమంలో త్వరలోనే ఇటు తెలంగాణతో పాటు అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ వ్యవసాయంలో రోబోలు, డ్రోన్ల వినియోగంలోకి వచ్చే అవకాశాలున్నయనిపిస్తోంది.



### కీటకాల పని కూడా

మారుతున్న వాతావరణ పరిస్థితులు, కాలుష్యం కారణంగా ఈ భూమి మీద ఎన్నో కీటకాలు అంతరించి పోతున్నాయి. దీని ప్రభాం పంట దిగుబడుల మీద తీవ్ర ప్రభావం ఉంటోంది. అయితే, ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తూ డ్రాప్ కాప్టర్ అనే స్టార్టప్ సంస్థ ప్రత్యేకమైన డ్రోన్‌ను రూపొందించింది. అది పంట చేల మీద 10 అడుగుల ఎత్తులో తిరుగుతూ పుప్పొడి రేణువులను చల్లుతుంది. గంటకు 40 ఎకరాల తోటను పూర్తి చేయ గలగటం ఆశ్చర్యం. కీటకాల తరహాలోనే ఇది పుప్పడిని వెదజల్లి పెద్ద ఉపసమనం చేకూరుస్తుంది.

### సలహాలిచ్చేందుకు యాప్‌లు

వ్యవసాయంలో రైతులకు మెరుగైన సలహాలు ఇచ్చేందుకు తనేక రకాల యాప్‌లు ఇప్పుడుఅందుబాటులోఉన్నాయి. ప్రధా నంగా భూసారం, ఎరువులు, వాతావరణ పరిస్థితి ఇలా అనేక అంశాలను ప్రస్తావిస్తూ, వాతావరన మార్పులు సంభవిస్తే ఏ తరహాలో నిర్ణయం తీసుకోవాలో ఎలాంటి జాగ్రత్తలు అవలం బించాలో రైతులకు వివరిస్తాయి.అలాగే భూమి దున్నడం విత్త నాల శుద్ధి, ఎంత లోతున విత్తనం నాటాలి, కలుపు నివార ణ, సశ్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగు విధానాలు, పంటల కోత, వాటిని సరైన పద్ధతిలో నిల్వ చేసుకోవడం వరకు ప్రతి దశలోనూ నేరుగా రైతుల మొబైల్ ఫోన్లకే సమాచారం ఇచ్చేలా ఉండటం గమనార్హం. స్మార్ట్ ఫోన్ లేకపోయినా.. బేసిక్ ఫోన్లతోనే రైతులు తమ మాతృభాషలో సమాచారం అందుకోవ టం మెచ్చుకోదగ్గ పరిణామం.

### ఉపాధికి గండి?

గిట్టుబాటు కావడంలేదంటూ వ్యవసాయాన్ని వదిలేసిన రైతులను చూశాం. కానీ, టెక్నాలజీ వినియోగం పెరుగుతున్నందున గతంలో వ్యవసాయం అంటే వెనకడుగు వేసిన వారు కూడా ఇప్పుడు ఈ రంగంలోకి ఆసక్తిగా వస్తున్నారు. యువత సాగుపై ఆసక్తి చూపుతుండటం మంచి పరిణామమే. అందునా హైటెక్ చదువులు చదివిన వారు సైతం వీకెండ్ వ్యవసాయం అంటూ పొలాలలోకి దిగుతున్నారు. కూరగాయలతో పాటు ఫలవృక్షాలను పెంచుతున్నారు. అయితే, టెక్నాలజీ పెరగడం వల్ల రైతులకు ఖర్చులు, శ్రమ, సమయం ఆదా అయ్యే అవకాశం ఉంటుందనటంతో సందేహం లేదు. కానీ, ఇదే సమయంలో కొన్ని ప్రతికూల ప్రభావాలు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉంది. రైతు కూలీలకు ఉపాధి లేకుండా పోయే ప్రమాదం ఖచ్చితంగా ఉంటుంది. కూలీల కొరత ఉన్న చోట రోబోల వల్ల ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ, వ్యవసాయమే ప్రధాన ఉపాధి వనరుగా ఉన్న ప్రాంతాల్లో రోబోటిక్ సాగుతో ఈ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుంది. ఐతే, ప్రభుత్వం వ్యవసాయ రంగం విషయంలో అనుసరించే విధానం ఆచరణాత్మకంగా ఉండాలి. రైతు శ్రేయస్సు తోపాటు, జాతీయ, అంతర్జాతీయ పోకడలను పరిగణనలోకి తీసుకొని, వర్తమాన, భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్దిష్ట వ్యవసాయ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నది నిపుణుల మాట. మరి ఈ కొత్త విధానం భారతావనికి ఎంత విస్తరిస్తుందో చూడాలి.

**కార్పొరైటేజేషన్ లక్ష్యాలు:**

వ్యవసాయ వాణిజ్యంలో నిపుణతను పెంపొందించడం
ప్రభుత్వేతర సంస్థలు నీటిపారుదల, వంగడాల ఉత్పత్తి, ఎరువుల తయారీ, పరిశోధనా రంగాలలో విస్తృతంగా పెట్టుబడులు పెట్టడం.
సాగుభూమి విస్తీర్ణం పెంచడం
ఉత్పాదకతను వృాఎద్ధి చేయడం (అధునాతన విధానాలు అవలంభించడం ద్వారా)
వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌కు సరైన సదుపాయాలు కల్పించి, దళారీల ప్రమేయాన్ని తగ్గించడం.
అక్రమ నిల్వలను నిరోధించి, కృత్రిమ ఆహార కొరతను నిర్మూలించడం.

**ప్రయోజనాలు:**

విమర్శకులు వాదించినట్లు కాకుండా, భూమి మీద హక్కు ఎప్పుడూ రైతుకే ఉంటుంది. కార్పొరేట్ సంస్థలు భూమిని రైతు నుంచి కాంట్రాక్టు పద్ధతిలో స్వాధీనం చేసుకొని తక్కువ పెట్టుబడితో ఆకర్షణీయమైన ఫలితాలను పొందడానికి వీలవుతుంది.
తాము విస్తరింపజేసిన వాణిజ్య అనుబంధ సంస్థల ద్వారా వ్యవసాయోత్పత్తులకు తగిన గిట్టుబాటు ధరలనందించడం, రైతుకు ప్రమాణిక ఆదాయాన్ని అందించడం
రైతుకు వ్యవసాయ రంగంలో తగిన శిక్షణ ద్వారా నిపుణతను పెంపొందించడం
వ్యవసాయ వాణిజ్యరంగం జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులకనుగుణంగా వ్యాపారాన్ని నిర్వహించడం.






# కుల్దీప్ యాదవ్ పెళ్లి వేడుకలు



భారత క్రికెటర్ కుల్దీప్ యాదవ్ మరియు అతని కాబోయే భార్య వంశిక వివాహానికి ముస్సోరీలో సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. 'క్వీన్ ఆఫ్ ది హిల్స్' అని పిలువబడే కొండ పట్టణంలోని అత్యంత ప్రసిద్ధ ఆస్తులలో ఒకటైన చారిత్రాత్మక ది సావోయ్ హోటల్లో మార్చి 13 మరియు 14 తేదీలలో వివాహ వేడుకలు జరగనున్నాయి.ముస్సోరీ నడిబొడ్డున ఉన్న అందమైన హోటల్ వివాహ వేడుక కోసం పూర్తిగా బుక్ చేయబడింది. ఆస్తి అంతటా అలంకరణలు దాదాపు పూర్తయ్యాయి మరియు భారతదేశం అంతటా నుండి వచ్చే అతిథులకు ఆతిథ్యం ఇవ్వడానికి విస్తృతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. అతిథులను స్వాగతించడం నుండి సాంప్రదాయ ఆచారాలను నిర్వహించడం వరకు, హోటల్ నిర్వహణ మరియు స్పిన్నర్ కుటుంబం ఈ కార్యక్రమం చిరస్మరణీయ వేడుకగా ఉండేలా ప్రతి వివరాలను ఖరారు చేస్తున్నారు.మార్చి 13న హల్దీ వేడుకతో సహా సాంప్రదాయ పూర్వ వివాహ ఆచారాలతో వివాహ వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ జంట వివాహం చేసుకునే ప్రధాన వివాహ వేడుక మార్చి 14 రాత్రి జరుగుతుంది. మతపరమైన ఆచారాలు మరియు వేడుకలు ముస్సోరీలో జరుగుతుండగా, మార్చి 17న ఉత్తరప్రదేశ్లోని లక్నోలో గ్రాండ్ రిసెప్షన్ ప్లాన్ చేయబడింది.వివిధ వేడుకల కోసం హోటల్ లోపల ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయి. వివాహ మండపం, రిసెప్షన్ ఏరియా మరియు సంగీత ప్రదర్శనల కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించారు. హోటల్ లోపల ప్రతి వేదిక అటువంటి ఉన్నత స్థాయి కార్యక్రమానికి అనువైన గొప్ప మరియు సొగసైన వాతావరణాన్ని ప్రతిబింబించేలా చూసుకుంది.వేడుకలకు హాజరయ్యే అతిథులకు వసతి కల్పించడానికి, ది సావోయ్ హోటల్లో దాదాపు 80 గదులు బుక్ చేయబడ్డాయి. అదనంగా, వివాహానికి ఆశించే పెద్ద సంఖ్యలో ఆహ్వానితులకు ఆతిథ్యం ఇవ్వడానికి సమీపంలోని అనేక హోటళ్లలో ఏర్పాట్లు చేయబడ్డాయి.అతిథి జాబితాలో క్రీడా ప్రపంచం, బాలీవుడ్ మరియు రాజకీయాల నుండి ప్రముఖ వ్యక్తులు ఉన్నారు. ఈ వేడుకకు అనేక మంది ప్రసిద్ధ క్రికెటర్లు హాజరవుతారని భావిస్తున్నారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) చైర్మన్ జే షా, భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, భారత మాజీ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోని, విరాట్ కోహ్లీ మరియు ప్రస్తుత భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వివాహ వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉంది.భారత క్రికెట్ జట్టులోని ఇతర సభ్యులు కూడా ఈ వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉంది. హోటల్ యాజమాన్యం అతిథుల కోసం ప్రత్యేక మెనూను కూడా సిద్ధం చేసింది. మెనూలో వివిధ రకాల వంటకాలతో కూడిన అల్పాహారం, భోజనం మరియు విందు ఎంపికలు ఉంటాయి. అతిథులకు ఉత్తరాఖండ్ సాంప్రదాయ వంటకాలను రుచి చూసే అవకాశం కూడా లభిస్తుంది, దీని ద్వారా ఈ ప్రాంతంలోని స్థానిక సాంస్కృతిక రుచులను అనుభవించవచ్చు. వివాహ కార్యక్రమాల సమయంలో శాఖాహారం మాత్రమే వడ్డించబడుతుందని వర్గాలు తెలిపాయి.కుల్దీప్ యాదవ్ కుటుంబం వివాహ ప్రణాళికలో చురుగ్గా పాల్గొంది, అతని తండ్రి హోటల్ యాజమాన్యంతో సమన్వయంతో ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ముస్సోరీలోని సావోయ్ హోటల్ గతంలో అనేక ఉన్నత స్థాయి వివాహాలను నిర్వహించింది. భారత వికెట్ కీపర్ బ్యాట్స్మన్ రిషబ్ పంత్ సోదరి వివాహం కూడా అదే వేదికలో జరిగింది, ఇది చాలా మంది క్రికెటర్లు మరియు ప్రముఖులను ఆకర్షించింది.

# ధోనీకి ఊరట



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు సీఎస్కే స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోనికి భారీ ఊరట లభించింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉల్లంఘించాడంటూ అతనిపై నమోదైన ఫిర్యాదును బీసీసీఐ ఎథిక్స్ కమిటీ కొట్టిపారేసింది. ఈ కేసులో ఎథిక్స్ కమిటీ అధికారి అరుణ్ మిశ్రా (రిటైర్డ్) ధోనికి క్లీన్ చిట్ ఇచ్చారు. టీమిండియా ఆటగాడిగా ఉంటూనే, 'ఆర్కా స్పోర్ట్స్ అండ్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్' అనే క్రికెట్ అకాడమీతో అనుబంధం (యజమానిగా) కొనసాగించడని ధోనిపై 2024 ఫిబ్రవరిలో ఫిర్యాదు నమోదైంది. ఇలా వ్యవహరించడం బీసీసీఐ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొనబడింది. 2018లో సవరించిన రూల్ 38(4)(ఖ), 38(4)(జూ) ప్రకారం ఇది తప్పు అని ఫిర్యాదుదారు వాదించారు. అదనంగా, ధోని తప్పనిసరి డిస్క్లోజర్ బాధ్యతలను కూడా నిర్వర్తించలేదని ఆరోపించారు.ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన జస్టిస్ మిశ్రా.. ధోని ఎలాంటి తప్పు చేయలేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అతనికి వ్యతిరేకంగా ఎలాంటి విరుద్ధ ప్రయోజనాల కేసు నిలబడదని స్పష్టం చేశారు. ధోని 2017లో ఆర్కా సంస్థతో ఒప్పందం చేసుకున్నారని, బీసీసీఐ సవరించిన నిబంధనలు 2018 సెప్టెంబర్లో అమల్లోకి వచ్చాయని గుర్తుచేశారు. అందువల్ల, ధోని ఆటగాడిగా ఉన్న సమయంలో ఎలాంటి విరుద్ధ ప్రయోజనం లేదని తేల్చారు. ఫిర్యాదుదారుడు వ్యక్తిగత కారణాలతోనే ఈ కేసు వేసినట్లు తీర్పులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ధోనిని 2026 ఐపీఎల్ సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ రీటైన్ చేసుకున్న విషయం తెలిసిందే. సీఎస్కే సీఈవో ఇటీవల చెప్పిన దాని ప్రకారం.. ధోని ఈ సీజన్లో అన్ని మ్యాచ్లకు అందుబాటులో ఉంటాడు. వయసు పైబడిన రిత్యా ధోని ఈ సీజన్కు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండరని తొలుత ప్రచారం జరిగింది. తాజాగా సీఈవోనే స్పష్టత ఇవ్వడంతో ఊహాగానాలకు తెరపడింది. 2026 సీజన్కు సంబంధించి తొలి విడత షెడ్యూల్ను నిన్ననే విడదల చేశారు. ఈ విడతలో అన్ని ఫ్రాంచైజీల్లాగే సీఎస్కే కూడా నాలుగు మ్యాచ్లు ఆడనుంది.

# భారత గోల్ఫర్లకు గ్లోబల్ ఛాన్స్




భారత ఆటగాళ్లు ప్రపంచ వేదికపై పోటీ పడేందుకు ఒక ప్రదర్శన మార్గాన్ని సృష్టించడానికి లివ్ గోల్ఫ్ మద్దతుగల ఇంటర్నేషనల్ సిరీస్ మరియు ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపిఎల్) గురువారం భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ప్రముఖ ఐజీపిఎల్ ఆటగాళ్ళు వివిధ అంతర్జాతీయ సిరీస్ ఈవెంట్లకు ప్రాప్యత పొందుతారు మరియు లివ్ గోల్ఫ్ ప్రమోషన్స్లో పోటీ పడే అవకాశాలను కూడా పొందుతారు, ఇది వారి ఉన్నత స్థాయి గోల్ఫ్కి పురోగతిని వేగవంతం చేస్తుంది. ఈ సహకారాన్ని అరాంకో లివ్ గోల్ఫ్ సింగపూర్లో అధికారికంగా ప్రకటించారు, ఇక్కడ రెండు సంస్థల నాయకులు ఉద్భవిస్తున్న ప్రతిభకు అభివృద్ధి మార్గాన్ని బలోపేతం చేయాలనే వారి ఉమ్మడి ఆశయాన్ని ధృవీకరించారు. ఈ రకమైన అవకాశం భారతీయ గోల్ఫింగ్ ప్రతిభకు గేమ్ ఛేంజర్, మరియు మా వేదికను అటువంటి అద్భుతమైన అవకాశాలకు విస్తరించడం మాకు సంతోషంగా ఉంది, "అని ఐజీపిఎల్ సిఇఒ ఉత్తమ్ సింగ్ ముండి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ భాగస్వామ్యం ద్వారా, సీజన్లో అంగీకరించిన పాయింట్ల వద్ద లీగ్ యొక్క ర్యాంకింగ్ల ద్వారా నిర్ణయించబడిన ఐజీపిఎల్ యొక్క ప్రముఖ ఆటగాళ్ళు క్యాలెండర్ అంతటా వివిధ అంతర్జాతీయ సిరీస్ ఈవెంట్లలో స్థానాలను సంపాదిస్తారు."భారతదేశం క్రీడకు అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్న మార్కెట్, మరియు ఐజీపిఎల్ని లివ్ గోల్ఫ్ మరియు ది ఇంటర్నేషనల్ సిరీస్తో సమలేఖనం చేయడం వల్ల ప్రతిభావంతులైన ఆటగాళ్ళు అంతర్జాతీయంగా తమను తాము పరీక్షించుకోవడానికి, ఈ మార్గాల ద్వారా వారి కెరీర్లను అభివృద్ధి చేసుకోవడానికి మరియు భారతదేశ తదుపరి తరం గోల్ఫ్ స్టార్లకు స్ఫూర్తినిచ్చే స్పష్టమైన నిచ్చెనను సృష్టించడానికి సహాయపడుతుంది" అని లివ్ గోల్ఫ్ సిఇఒ స్కాట్ ఓ'నీల్ అన్నారు.ఫ్రాంచైజ్ ఆధారిత లీగ్ దాని ప్రారంభ 2025--26 పర్యటనలో 11 టోర్నమెంట్లను కలిగి ఉంది. రెండవ ఎడిషన్ బుధవారం చండీగఢ్లో ప్రారంభమైంది.అంతర్జాతీయ సిరీస్లో పోటీ పడటం వల్ల ఈ ఆటగాళ్లకు ప్రపంచ స్థాయి కోర్సులలో ఉన్నత స్థాయి రంగాలకు వ్యతిరేకంగా తమను తాము పరీక్షించుకునే అవకాశం మరియు అధిక స్థాయి పోటీని అందించే అవకాశం.బలమైన ప్రదర్శనలు గోల్ఫ్ పర్యావరణ వ్యవస్థ అంతటా మరిన్ని అవకాశాలకు తలుపులు తెరుస్తాయి, వీటిలో సీజన్-పొడవు అంతర్జాతీయ సిరీస్ ర్యాంకింగ్లు మరియు గోల్ఫ్ ప్రమోషన్ల ద్వారా లీగ్కు మార్గం కూడా ఉంటుంది." ఐజీపిఎల్తో ఈ భాగస్వామ్యం ద్వారా, భారతదేశంలోని అగ్రశ్రేణి ప్రదర్శనకారులు క్రీడ యొక్క అత్యంత ఉన్నత దశల వైపు ప్రత్యక్ష మార్గాన్ని పొందుతారు" అని అంతర్జాతీయ సిరీస్ అధిపతి రాహుల్ సింగ్ అన్నారు."ఇది కేవలం రంగంలో ఒక స్థానం కంటే ఎక్కువ; వ్యాపారంలో అత్యుత్తమమైన వారితో పోటీ పడటానికి మరియు అధిక-స్టేక్స్ వాతావరణంలో అభివృద్ధి చెందడానికి ఇది ఒక ఆహ్వానం.

# భాంబ్రీ జోడీ సెమీస్‌లోకి




గురువారం ఉదయం జరిగిన ఇండియన్ వెల్స్ ఓపెన్లో భారత జోడీ యుకీ భాంబ్రీ మరియు అతని స్వీడిష్ భాగస్వామి ఆంద్రీ గోరాన్సన్ సెమీఫైనల్కు చేరుకున్నారు, ఆస్ట్రియన్-ఇటాలియన్ జోడీ అలెగ్జాండర్ ఎర్లర్ మరియు ఆంద్రియా వావాసోరిలను ఓడించారు. భాంబ్రీ మరియు గోరాన్సన్ ఎర్లర్ మరియు వావాసోరిపై 6-3, 7-6(2) తేడాతో విజయం సాధించారు. ఎటిపి మాస్టర్స్ 1000 స్థాయిలో భాంబ్రీకి ఇది తొలి సెమీఫైనల్, మాస్టర్స్ 1000 స్థాయిలో రెండుసార్లు డబుల్స్ క్వార్టర్-ఫైనల్కు చేరుకుంది. అతని మునుపటి రెండు క్వార్టర్ ఫైనల్స్ ఇండియన్ వెల్స్ 2025లో (గోరాన్సన్తో) మరియు మయామి మాస్టర్స్ 2025లో (నునో బోర్జెస్తో) జరిగాయి.ముఖ్యంగా, అన్సీడెడ్ ద్వయం టోర్నమెంట్లో ఇంకా ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. 16వ రౌండ్లో, భాంబ్రి మరియు గోరన్సన్ 6-4, 6-4 తేడాతో సాండర్ అరెండ్స్ మరియు జిరి లెహెక్కాను ఓడించి, తమ ప్రచారాన్ని 6-1, 6-3 తేడాతో వరుస సెట్లలో డేవిడ్ పెల్ మరియు ఫాబ్రిస్ మార్టిన్ ద్వయాన్ని ఓడించారు.ఖచనోవ్/రుబ్లెవ్ మరియు రిండర్క్నెచ్/వాచెరోట్ విజేతలతో వారు తలపడనున్నారు. ఫైనల్లో స్థానం ప్రమాదంలో ఉంది.గత నెలలో, భాంబ్రి తాజా ఎటిపి ర్యాంకింగ్స్లో ప్రపంచ నంబర్ 20 ర్యాంకింగ్లో కెరీర్లో అత్యధికంగా ప్రపంచ నంబర్ 20కి ఎగబాకాడు, రోహన్ బోపన్న తర్వాత టాప్ 20లోకి ప్రవేశించిన మొదటి భారతీయ పురుషుల డబుల్స్ ఆటగాడిగా నిలిచాడు.గోరన్సన్తో కలిసి, ఈ సంవత్సరం మొదటి గ్రాండ్స్లామ్, మెల్బోర్న్లో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్లో భాంబ్రి అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు, అతన్ని పరిమితిని దాటడానికి అవసరమైన ర్యాంకింగ్ పాయింట్లను సేకరించడానికి మూడవ రౌండ్కు చేరుకున్నాడు. 2025 సీజన్ నుండి భాంబ్రీ క్రమంగా పురోగమిస్తున్నాడు, అతను న్యూజిలాండ్కు చెందిన మైఖేల్ వీనస్తో కలిసి యుఎస్ ఓపెన్ సెమీఫైనల్కు చేరుకున్నాడు, అక్కడ వారు నాల్గవ సీడ్ బ్రిటిష్ ద్వయం జో సాలిస్బరీ మరియు నీల్ స్కుప్స్కి చేతిలో సెట్ మరియు బ్రేక్ అడ్వాంటేజ్ను కలిగి ఉండటం ద్వారా తృటిలో ఓడిపోయారు.మార్చి 2025లో, దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్షిప్లో భాంబ్రీ తన మొదటి ఎటిపి 500 టైటిల్ను సాధించాడు, ఆస్ట్రేలియాకు చెందిన అలెక్సీ పాపిరిన్తో జతకట్టాడు. ఈ జంట ఒక సెట్ నుండి దిగజారి నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని, ఉత్కంఠభరితమైన ఫైనల్లో ప్రస్తుత యుఎస్ ఓపెన్ మరియు ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ ఛాంపియన్లు హ్యారీ హెలియోవారా మరియు హెన్రీ ప్యాటెన్లను 3-6, 7-6 (12), 10-8 తేడాతో ఓడించాడు.

# సిటీపై వాల్వెర్డే సంచలనం



మాంచెస్టర్ సిటీపై హ్యాట్రిక్ తో రియల్ మాడ్రిడ్ ను ఛాంపియన్స్ లీగ్ ఆధిపత్య మోడ్ లోకి ఫెడెరికో వాల్వెర్డే ఒంటి చేత్తో తీసుకెళ్లిన తర్వాత, 15 సార్లు యూరోపియన్ కప్ విజేత ఈ వారాంతంలో లా లిగాలోకి తిరిగి రావాలి. బుధవారం జరిగిన వాల్వెర్డే చిరస్మరణీయమైన మూడు గోల్స్ మొదటి అర్ధభాగంలో సిటీపై 3-0 తేడాతో విజయం సాధించడానికి మరియు బార్సిలోనాలో అత్యుత్తమ జట్లకు నాయకత్వం వహించిన సంవత్సరాల నుండి మాడ్రిడ్ యొక్క శత్రువు అయిన కోచ్ పెప్ గార్డియోలాపై విజయం సాధించడానికి ఆజ్యం పోశాయి. స్పానిష్ లీగ్ యొక్క మునుపటి రౌండ్ లో సెల్టా విగోపై మాడ్రిడ్ 2-1 తేడాతో విజయం సాధించిన తర్వాత వాల్వెర్డే చేసిన ట్రెబుల్ వచ్చింది. ఇప్పుడు మాడ్రిడ్ ఒక ఆట కోసం మాత్రమే దృష్టి పెట్టాలి, కానీ 38 రౌండ్లలో 27 తర్వాత నాలుగు పాయింట్ల వెనుకబడి ఉన్న దేశీయ పోటీపై దృష్టి పెట్టాలి.అల్వారో అర్బెలోవా జట్టు శనివారం ఎల్చేకి ఆతిథ్యం ఇస్తుంది, ఆపై మూడు రోజుల తర్వాత ఇంగ్లాండ్కు వెళ్లి సిటీని ముగించి ఛాంపియన్స్ లీగ్ క్వార్టర్ ఫైనల్కు చేరుకుంటుంది. బార్సిలోనా ఆదివారం సెవిల్లాను ఆతిథ్యం ఇస్తుంది. మాడ్రిడ్ జట్టుకు ఎల్చే సులభంగా ఎంపిక కావచ్చని అనిపించినప్పటికీ, దక్షిణాదిలోని ఈ చిన్న క్లబ్ నవంబర్లో తన సొంత మైదానంలో 2-2తో పవర్హౌస్ను నిలుపుకుంది.ఎల్చే రెండు నెలల క్రితం ఎనిమిదవ స్థానంలో ఉంది, కానీ 17వ స్థానానికి పడిపోయింది మరియు బహిష్కరణ జోన్ అంచున ఉంది.వాల్వర్డే స్ఫూర్తితో సెల్టాలో విజయం సాధించడానికి ముందు, మాడ్రిడ్ లీగ్లో రెండుసార్లు గెటాఫే చేతిలో స్వదేశంలో మరియు ఒసాసునాలో ఓడిపోయింది.బార్సిలోనా అక్టోబర్లో సెవిల్లాలో 4-1 తేడాతో జరిగిన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది, ఈ సీజన్లో లీగ్లో దాని చెత్త ఓటమి. ఆ ఓటమిలో, బార్సిలోనా గాయపడిన దాడి ఆటగాళ్లు లామిన్ యమల్ మరియు రాఫిన్హా లేకుండా ఆడింది.గాయంతో బాధపడుతున్న మాడ్రిడ్కు వాల్వర్డే నాయకుడిగా నిలిచాడు. ఈ సీజన్లో అతను చేసిన ఆరు గోల్స్ జనవరి నుండి వచ్చాయి, కైలియన్ ఎంబప్పే మరియు జూడ్ బెల్లింగ్హామ్ ఇద్దరూ గాయపడ్డారు.బార్సిలోనా తరఫున యమల్ కూడా మంచి ఫామ్లో ఉన్నాడు. 18 ఏళ్ల ఈ యువకుడు తన చివరి ఏడు లా లిగా మ్యాచ్లలో ఏడు గోల్స్ సాధించాడు మరియు మంగళవారం జరిగిన ఛాంపియన్స్ లీగ్ రౌండ్-ఆఫ్-16లో న్యూకాజిల్లో జరిగిన 1-1 డ్రాను కాపాడటానికి ఒత్తిడితో కూడిన పెనాల్టీని అతను మార్చాడు.మోకాలి సమస్య కారణంగా ఫిబ్రవరి 21 నుండి ఎంబప్పే ఆడటం లేదు మరియు మాడ్రిడ్కు ఇది సందేహంగానే ఉంది, బెల్లింగ్హామ్ మరియు ఎడర్ మిలిటావో కూడా దీర్ఘకాలిక గాయంతో దూరంగా ఉన్నారు.బార్సిలోనా గాయపడిన జాబితాలో స్టార్టింగ్ ఫుల్ బ్యాక్స్ జూల్స్ కౌండే మరియు అలెజాండ్రో బాల్డే ఉన్నారు.బార్సిలోనా ఆదివారం క్లబ్ అధ్యక్ష పదవికి ఎన్నికను నిర్వహిస్తుంది, ఆ సమయంలో ప్రస్తుత జోన్ లాపోర్టా మరో ఐదేళ్ల పదవీకాలం కోసం ప్రయత్నిస్తున్నారు.

సూర్య www.suryaa.com

# సినిమా

# ప్రతిభను వెలికితీసే నెట్ ఫ్లిక్స్

నెట్‌ఫ్లిక్స్ సంస్థను హైదరాబాద్కు ఆహ్వానిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలా మంది ఇలాంటి స్టూడియో కోసం వెయిట్ చేస్తున్నారన్న ఆయన ప్రపంచ వ్యాప్తంగా మంచి ప్రతిభను నెటిఫ్లిక్స్ వెలికితీస్తుందని కితాబిచ్చారు. హైదరాబాద్, నెట్‌ఫ్లిక్స్‌కు దగ్గరి పోలికలు ఉన్నాయని చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ టాలెంట్ ఉన్న వాళ్లకు గొప్ప అవకాశాలు కల్పిస్తుందని, ఇప్పుడు గ్లోబల్ సిటీగా హైదరాబాద్ ఎదిగిందని అన్నారు. నెట్ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, తెలుగు అగ్రనటుడు రానాతో కలిసి ప్రారంభించారు. ఇందులో ఐలైన్ స్టూడియోస్ ప్రతినిధులు కూడా ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని నెట్‌ఫ్లిక్స్ కూడా ఆ దిశగా దృష్టి పెట్టినట్లు ఒకసారి ఆర్టికల్ చదివానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నెట్ఫ్లిక్స్ భవిష్యత్తులో స్పోర్ట్స్ విభాగంలో నంబర్ వన్ బ్రాడ్‌కాస్టర్‌గా ఎదుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసాను ఇచ్చారు. సినిమాలపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందని, మూవీస్ చూడటం చాలా ఇష్టమని అన్నారు. ఫ్యూచర్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయం పెట్టుకుంటామంటే స్థలం కేటాయిస్తామని, నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కంపెనీని కూడా అక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. హైదరాబాద్లో ఐలైన్ స్టూడియోను ప్రారంభించడం సంతోషంగా ఉందని ప్రముఖ నటుడు రానా అన్నారు. ఐలైన్ వంటి సంస్థ హైదరాబాద్కి రావడం ఇక్కడి సినిమాలు, అవి సాధించిన విజయాల గురించి చెప్పడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. నటులకు, దర్శకులకు, ప్రొడ్యూసర్లకు ఇలాంటి స్టూడియో భవిష్యత్తులో ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. గతంలో పరిమితమైన ఆర్థిక వనరులతోనే అదీ కూడా చాలా తక్కువ మంది సినిమాలను నిర్మించే వాళ్లని రానా అన్నారు. ఇప్పుడు సినిమాల్లో సరికొత్తగా టెక్నాలజీ వినియోగం పెరగడం, ఐలైన్ వంటి స్టూడియోలు ఇక్కడికి రావడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు.




## ఉస్తాద్ భగత్ సింగ్

# బిగ్గెస్ట్ మాస్ బస్టర్ కాలరే ఎత్తరా



ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి పాట, టీజర్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకున్నాయి. ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ తాజాగా చిత్రబృందం మూడో గీతం కాలరే ఎత్తరాను విడుదల చేసింది. గురువారం సాయంత్రం అభిమానుల కోలాహలం నడుమ హైదరాబాద్ లోని మైత్రి విమల్ థియేటర్ లో ఈ గీతావిష్కరణ వేడుక వైభవంగా జరిగింది. కాలరే ఎత్తరా పాట విడుదలతో సినిమాపై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. భారీ స్థాయిలో రూపొందించిన ఈ పాటలో భారీ సెట్‌లు, కట్టిపడేసే విజువల్స్, అద్భుతమైన ఎనర్జీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తన ప్రత్యేకమైన స్టైల్, ఎనర్జీ, డ్యాన్స్ స్టెప్పులతో తెరపై వెలుగులు నింపారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం, రామ్ మిర్యాల ఉత్సాహభరితమైన గానం, కాసర్ల శ్యామ్ శక్తివంతమైన సాహిత్యం కలిసి.. సినిమా యొక్క మాస్ అప్పీల్‌ను ప్రతిబింబించేలా గొప్పగా ఉంది ఈ గీతం. కాలరే ఎత్తరా గీతావిష్కరణ కార్యక్రమంలో దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ తో సినిమా అనగానే కథ కూడా వినకుండా సినిమా చేయడానికి అంగీకరించిన రాశి ఖన్నాకు ముందుగా కృతజ్ఞతలు. ఈ పాటలో కూడా కళ్యాణ్ గారితో కలిసి అద్భుతంగా డ్యాన్స్ చేశారు రాశి. 1500-2000 మందితో భారీస్థాయిలో ఈ పాటను తెరకెక్కించాం. పవన్ కళ్యాణ్ గారు వేసిన డ్యాన్స్ కి చప్పట్లు, ఈలలతో సెట్ అంతా దద్దరిల్లిపోయింది. కళ్యాణ్ గారు ఈ సినిమాని ప్రాణం పెట్టి పని చేశారు. ఈసారి పర్ఫార్మెన్స్ బద్దలైపోయిద్ది అని నేను మొదటి నుంచి ఎందుకు చెప్తున్నానంటే.. సెకండ్ హాఫ్ లో ఇంటెన్స్ సీన్స్ లో ఆయన అద్భుతంగా నటించారు. దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం అందించారు. మైత్రి మూవీ మేకర్స్ ఎక్కడా రాజీ పడకుండా సినిమాను నిర్మించారు అన్నారు.

# థ్రిల్లింగ్ యాక్షన్ లవ్ స్టోరీ డెకాయిట్



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్ లో డెకాయిట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'డెకాయిట్' ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ మూవీ సెట్ లో షూట్ ర్యాప్ ప్రెస్ మీట్ నిర్వహించారు. హీరో అడివి శేష్ మాట్లాడుతూ.. డెకాయిట్ ఒక కొత్త జోనర్ లో చేసిన సినిమా. ఈ మధ్యకాలంలో మనం లవ్ స్టోరీస్ చెప్పడం మానేశాను. ఈరోజుల్లో అందరూ ఒక మంచి లవ్ స్టోరీ కోరుకుంటున్నారు. ఈ రోజుల్లో లవ్ స్టోరీనే యూనిక్. ఇది థ్రిల్లింగ్ యాక్షన్ లో చెప్పిన లవ్ స్టోరీ. ఒక కొత్త జోనర్లో చేసిన ప్రయోగం. కథలో అవసరం ఉందంటే నేను ఏదైనా చేస్తాను. ఇందులో రుబారూ కూడా కథలో ఆ క్యారెక్టర్ కి అవసరమైన సాంగ్. ఈ సినిమా అందరినీ ఎక్సయిట్ చేస్తుంది. సినిమా చివరకు వచ్చేసరికి అందరూ ఎమోషన్ అవుతారు. ఈ సినిమాలో ఎమోషన్ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఈ సినిమా మీరు ఫ్యామిలీస్ తో కలిసి చూడొచ్చు. నేను మా సిస్టర్ తో కలిసి చూస్తాను. యాక్షన్స్ తో బ్లెండ్ చేసిన లవ్ స్టోరీ ఇది. ఇద్దరూ విడిపోయిన మాజీ ప్రేమికులు, వాళ్ళ జర్నీలో ఏం రియలైజ్ అవుతారో ఇందులో చాలా స్పెషల్ గా ఉంటుంది.

# ధురంధర్ ది రివెంజ్ నుంచి ఆరి ఆరి టైటిల్ ట్రాక్

హై ఎనర్జీ పాట ఇప్పుడు టి-సిరీస్ యూట్యూబ్ ఛానెల్‌లో అందుబాటులో ఉంది. ఎనర్జిటిక్ బీట్‌లు, పవర్ ఫుల్ వాకల్స్, రాప్ పార్ట్స్ కూడిన ఈ పాట, వైరల్ గా మారి సినిమా ఇంటెన్స్ వరల్డ్ ని ప్రజెంట్ చేస్తోంది. శశ్వత్ సచ్‌దేవ్ ఈ ట్రాక్‌ను ఆయనే కంపోజ్ చేసి, అరేంజ్ చేసి, ప్రోగ్రామ్ చేశారు. మోడరన్ మ్యూజిక్ ప్రొడక్షన్‌ను పంజాబీ శైలితో కలిపి రూపొందించిన ఈ పాట వినగానే ఉత్సాహాన్ని పెంచే ఎనర్జీతో రూపొందింది. ఈ పాటను నవతేజ్ సింగ్ రెహేల్ (బాంబే రాకర్స్), ఖాన్ సాబ్, జాస్మిన్ సండ్లాస్, సుధీర్ యాదువంశీ గాత్రంలో ఆలపించగా, ర్యాప్ భాగాలను రెబల్, టోకెన్ రాసి పాడారు. పాటకు పదాలను ప్రముఖ రచయిత ఇర్షాద్ కామిల్ బాంబే రాకర్స్‌తో కలిసి రాశారు. మ్యూజిక్ స్కోర్‌ను ఆడమ్ లూకాస్ రూపొందించారు. ఈ పాటకు రూపొందించిన మ్యూజిక్ వీడియో విజువల్ గా కూడా అద్భుతంగా ఆకట్టుకుంటుంది. ఇందులో రణవీర్ సింగ్ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తూ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంటారు. స్టైలిష్ యాక్షన్ షాట్లు, ఉత్కంఠభరిత సన్నివేశాలు వీడియోకు భారీ స్థాయి ఇంటెన్స్ ను తీసుకొచ్చాయి. ఎలక్ట్రిఫైయింగ్ మ్యూజిక్, డైనమిక్ విజువల్స్ కలయికగా రూపొందిన "ఆరి ఆరి" పాట ఈ సినిమాకు మ్యూజిక్ జర్నీని పవర్ ఫుల్ గా ప్రారంభిస్తూ హై-ఆక్టేన్ ఇంపాక్ట్‌ను అందిస్తుంది.



## వృషకర్మ స్టన్స్ కోసం

# నాగ చైతన్య ట్రాన్స్‌ఫర్మేషన్

యువ సామ్రాట్ నాగ చైతన్య తన అప్ కమింగ్ నెవర్ బిఫోర్ మిథికల్ స్పెక్టకిల్ వృషకర్మ కోసం చాలా హార్డ్ వర్క్ చేస్తున్నారు. విరూపాక్షతో బ్లాక్ బస్టర్ సాధించిన కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్.వి.సి.సి, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి, బాపినీడు ఈ వెంచర్‌ను సమర్పిస్తున్నారు. బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన వృషకర్మ గ్లింప్స్ అన్ని ప్లాట్‌ఫామ్‌లు, ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందనను పొందింది. వెంటనే వైరల్ అయ్యి భారీ సంచలనాన్ని సృష్టిస్తోంది. ఇంటెన్స్ విజువల్స్, పవర్ ఫుల్ వరల్డ్ బిల్డింగ్ అందరినీ ఆశ్చర్యపరిచాయి, సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. మేకర్స్ యువ సామ్రాట్ నాగ చైతన్యను ఫియర్సెస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ లో ప్రజెంట్ చేసే సరికొత్త స్టిల్స్‌ను రిలీజ్ చేశారు. ఈ ఫోటోలు పాత్ర కోసం ఆయన చేసిన కఠినమైన ట్రాన్స్‌ఫర్మేషన్, అలాగే అర్జున్ పాత్రను సహజంగా తెరపై చూపించేందుకు పెట్టిన అంకితభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఒక స్టిల్‌లో చైతన్య ఇంటెన్స్ గా వర్కౌట్ చేస్తూ కనిపిస్తున్నారు. ఆ ఫోటోలో ఆయన ప్రత్యేకంగా ఈ పాత్ర కోసం తీర్చిదిద్దుకున్న లీన్, చిసెల్డ్ ఫిజిక్ స్పష్టంగా కనిపిస్తోంది. వృషకర్మ ప్రపంచంలో పావర్ ఫుల్ అర్జున్ పాత్రను పోషించేందుకు ఆయన చూపిన క్రమ శిక్షణ, అంకితభావం ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ ద్వారా వెల్లడవుతోంది. మరో స్టిల్‌లో చైతన్య గాయాలతో, యుద్ధానికి సిద్ధమైన యోధుడిలా కనిపిస్తున్నారు. ఈ రఫ్ అండ్ రగ్డ్ లుక్ సినిమాలో ఉండబోయే హై-ఆక్టేన్ యాక్షన్‌తో పాటు ఎమోషన ని సూచిస్తోంది. ఇది చైతన్య కెరీర్‌లో ఇప్పటివరకు ఎన్నడూ కనిపించని ఇంటెన్స్ ఆన్‌స్క్రీన్ అవతార్‌లలో ఒకటిగా నిలవనుంది.



# యూత్ ఫస్ట్ లుక్ పోస్టర్

కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ యూత్. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. త్వరలోనే యూత్ మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను హీరో కిరణ్ అబ్బవరం లాంచ్ చేశారు. యూత్‌మూవీని తెలుగులోకి తీసుకొస్తున్న వినీత్, సందీప్ కిరణ్ అబ్బవరంతో చాలాకాలంగా ట్రావెల్ చేస్తున్నారు. కిరణ్ వారికి సపోర్ట్ గా నిలుస్తూ ఈ మూవీని ప్రమోట్ చేస్తున్నారు. యూత్ ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే మంచి యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లా అనిపిస్తోంది. మలయాళ బ్లాక్ బస్టర్ ప్రేమలు తెలుగులోనూ ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇలాంటి తరహా కంటెంట్ తోనే వచ్చిన లిటిల్ హార్ట్స్ కూడా పెద్ద సక్సెస్ దక్కించుకుంది. ఇప్పుడు తెలుగు ఆడియెన్స్ కు కావాల్సిన యూత్ ఫుల్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ జానర్ లో వస్తున్న యూత్ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే అలాంటి వైబ్స్ క్రియేట్ చేస్తోంది.



# మణిరత్నం మూవీ ఫీల్ కలిగే దీవాన టీజర్



శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా దీవాన. స్నేహ మణిమేగలై హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతోంది. ఈ చిత్రాన్ని అర్వ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. దీవాన ఈ వేసవికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.దీవాన సినిమా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే మణిరత్నం సినిమా ఫీల్ కలుగుతోంది. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే – ఓ పెళ్లి వేడుకల్లో హీరోయిన్ ను చూసి లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అన్నట్లు ప్రేమలో పడతాడు హీరో. అప్పటి నుంచి ఆ అమ్మాయే లోకంగా బతుకుతుంటాడు. ఆ అమ్మాయి తరుపు వాళ్లతో ప్రమాదమని స్నేహితులు చెప్పినా వినిపించుకోడు. ఇంతే ప్రేమ అమ్మాయి నుంచి కూడా ఈ అబ్బాయికి దక్కిందా లేదా అనేది థియేటర్స్ చూడాలి. టీజర్ లోని ప్రేమ ఇది ప్రేమ గుండెల్లోన సడిరేపేదే ప్రేమ... సాంగ్ బీజీఎం హార్ట్ టచింగ్ గా ఉంది. టీజర్ చివరలో ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తర్ర ఈ పోరీలు, అది నీ పానం పీక్కతినకపోతే నన్ను అడుగురా.. అనే డైలాగ్స్ ఆసక్తి కలిగిస్తున్నాయి. దీవాన సినిమాలో ఒక ఇంటెన్స్ బ్యూటిఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీ చూడబోతున్నట్లు టీజర్ తో తెలుస్తోంది. టీజర్ చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తోంది. టీజర్ పూర్తయ్యాక కూడా పాట ఇంకా మదిలోనే తిరుగుతున్న అనుభూతి కలుగుతోంది. విజువల్స్ చాలా రియలెస్టిక్ గా బ్యూటిఫుల్ గా ఉన్నాయి. హీరో హీరోయిన్స్ జంట ఫ్రెష్ గా కనిపిస్తోంది. కొత్త హీరోయిన్ స్నేహ మణిమేగలై బ్యూటిఫుల్ గా కనిపించి ఆకట్టుకుంది.

# డాల్బీ ఫార్మెట్‌లో పెద్ది



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా పెద్ది పోస్ట్-ప్రొడక్షన్, ప్రమోషనల్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. బుచ్చి బాబు సనా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం మరో ప్రత్యేకతను సొంతం చేసుకుంది. ఈ చిత్రం అత్యాధునిక డాల్బీ సినిమాస్ ఫార్మెట్‌లో కూడా విడుదల కానుంది. రామ్ చరణ్ మాస్ రగ్గడ్ అవతార్‌ను డాల్బీ సినిమాస్ ఫార్మెట్ లో చూడడం ప్రేక్షకులకు మరింత గ్రాండ్ ఎక్స్ పీరియన్స్ అందించనుంది. పెద్ది వంటి భారీ యాక్షన్, ఎమోషన్ కలిగిన సినిమాను డాల్బీ సినిమాస్ లో చూడడం ప్రేక్షకులకు పూర్తిగా లీనమయ్యే అనుభూతిని ఇవ్వనుంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లో రామ్ చరణ్ రగ్డ్ అవతార్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. చేతిలో బ్యాట్ పట్టుకుని, ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్న ఆయన క్యారెక్టర్ సినిమాలో పవర్‌ఫుల్ యాక్షన్‌ను సూచిస్తోంది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పెద్ది ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం క్రియేట్ చేస్తోంది. పెద్ది ఫస్ట్ షాట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఎఆర్ రెహమాన్ అందించిన సౌండ్‌ట్రాక్స్ మెగా చార్ట్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. చికిరి చికిరి, రైరై రా రా పాటలు వరల్డ్ వైడ్ వైరల్ అయ్యాయి.

# కార్మేని సెల్వం టీజర్



పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లోరూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని పెంచగా.. గురువారం తెలుగు టీజర్ ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి అని సముద్రఖని వాయిస్ ఓవర్ తో ప్రారంభమైన టీజర్ సినిమాపై క్యూరియాసిటిని పెంచుతుంది. అధిక ఖర్చులు, భారీ లోన్లు, క్రిప్టో పెట్టుబడులు, త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు వంటి విషయాలను వివిధ కోణాల్లో చూపిస్తూ నేటి సమాజంలో డబ్బు పట్ల ఉన్న ఆలోచనలను చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ ఆధారిత జీవనశైలి, డబ్బు కోసం మనుషులు తీసుకునే నిర్ణయాలు కథలో కీలక పాత్ర పోషించబోతున్నాయని అర్థమవుతుంది. సముద్రఖని కుటుంబంతో కనిపించే సన్నివేశాలు హృదయానికి హత్తుకునేలా ఉంటాయి. లక్ష్మీ ప్రియా చంద్రమౌళి ఆయన భార్యగా, చిన్న కుమారుడితో కుటుంబ జీవితం చూపిస్తుండగా, మరోవైపు విదేశాల్లో ఒంటరిగా కనిపించే కొన్ని షాట్లు కథపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

## రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్నయాక్షన్

# ఎంటర్ టైనర్ బుల్లెట్ రెడ్డి



ఆది, మేఘ, హనిక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా బుల్లెట్ రెడ్డి. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి ఫిలింస్ బ్యానర్ పై ఆది దర్శక నిర్మాతగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ లో ఉంది. ఈ చిత్ర విశేషాలను ఈ రోజు హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో జరిగిన ప్రెస్ మీట్ లో దర్శక నిర్మాత హీరో ఆది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫైట్ మాస్టర్ ఖయ్యూం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత హీరో ఆది మాట్లాడుతూ - యాక్షన్ ఓరియెంటెడ్ చిత్రమిది. ఈ చిత్రంలో హీరో బుల్లెట్ రెడ్డి వెయ్యి ఎకరాల జమీందారు. ఆయనకు చెందాల్సిన లక్షల కోట్ల రూపాయల విలువైన నిధి దక్కించుకునేందుకు కొందరు దురాశ పరులు ఎలా ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలను హీరో ఎలా ఎదుర్కొన్నాడు అనేది ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది. నాకు మార్షల్ ఆర్ట్స్ లో ఉన్న ప్రావీణ్యం ఉండటం ఈ సినిమాలో నటించేందుకు కలిసొచ్చింది. ఖయ్యూం మాస్టర్ నాకు బాగా సపోర్ట్ చేశారు. మా సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ లో ఉంది. ఆదిలాబాద్ అడవుల్లో పాట చిత్రీకరణ జరిపాం. అలాగే నిజామాబాద్ లో ఫైట్ సీక్వెన్స్ లు రూపొందించాం. ఈ నెల 23వ తేదీ నుంచి రాజమండ్రి, అమలాపురం పరిసర ప్రాంతాల్లో తదుపరి షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఏప్రిల్ 5వరకు ఈ షెడ్యూల్ కొనసాగుతుంది. చివరి షెడ్యూల్ మళ్లీ ఆదిలాబాద్, నిజామాబాద్ లో చేస్తాం అన్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.